సాహిత్య

# ప్రస్థానం

నవంబర్ 2018

వెల రూ. 20



సాహితీస్రవంతి



విజయవాడ సమీపంలోని చారిత్రాత్మక ఉండవల్లి గుహ. క్రీ.శ. 6, 7 శతాబ్దాలలో రాతిని తొలిచి నిర్మించారు.

సాహిత్య ప్రస్థానం నవంబర్ 2018

సంపుటి : 17 | సంపాదకీయం | సంచిక : 11

# విశ్వాసాలూ, వివక్షలూ

కేరళలోని శబరిమలై అయ్యప్ప ఆలయంలోకి 10-50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశాన్ని సుప్రీం కోర్టు అనుమతించినా మనువాదులు అంగీకరించకపోవడం రాజ్యాంగ విరుద్ధమైన చర్య. తరతరాల ఆచారాలకు ఇది విరుద్ధమంటూ వివాదం పెంచుతున్న మతతత్వ శక్తులూ వ్యక్తులూ 1991 తర్వాతే అది కూడా హైకోర్టు తీర్పుతోనే వారిపై నిషేదం వచ్చిందనే వాస్తవం దాటేస్తున్నారు. మహిళల రాక బాగా పెరిగిపోయింది గనకే ఈ సమస్య వచ్చిందని ఆనాడు హైకోర్టు కూడా స్పష్టం చేసింది. దేశంలో ఎవరి విశ్వాసాలు ఏమైనా మతాల పేరిట మహిళలపై దళితులపై వివక్ష సహించరానిది. కులం మతం రంగు లింగభేదం వంటి కారణాలతో దేశ పౌరుల మధ్య తేడా చూపించరాదని రాజ్యాంగమే చెబుతున్నది. కొంత కాలం కిందట శనిసింగాపూర్‌లో తర్వాత హాజీ అలీ మస్తాన్ దర్గాలో మహిళల ప్రవేశానికి అనుమతినిచ్చినట్టే ఇప్పుడు శబరిమల తీర్పు వచ్చింది. దీన్ని ఆహ్వానించాల్సింది పోయి అడ్డుకుని ఉద్రిక్తత పెంచడం భక్తి విశ్వాసాల పేరిట రాజకీయం చేయడమే. సనాతన సంప్రదాయం పేరిట గతంలో అనేక మూఢ నమ్మకాలు ఛాందసాలు శతాబ్దాల పాటు చలామణి అయ్యాయి. సంస్కరణోద్యమాల ద్వారా చట్టాల ద్వారా వాటిని నిర్మూలించుకున్నాం. ఆలయాలలో దళితుల ప్రవేశం ఎన్నో పోరాటాల తర్వాత గాని సాధ్యం కాలేదని గుర్తుంచుకోవడం అవసరం. ఇప్పటికి కొన్ని చోట్ల అది సంఘర్షణాత్మకంగానే వుంది. 1881లో కందుకూరి వీరేశలింగం వితంతు వివాహాలు మొదలుపెట్టినప్పుడు భారీ పోలీసు రక్షణ అవసరమైంది. స్త్రీలు ఆలయ ప్రవేశానికి అనర్హులుగా చెప్పేవారే జోగిని, బసివి వంటి దురాచారాలను కొనసాగిస్తే నిషేదించడానికి చట్టం అవసరమైంది. వివక్షతకూ మూఢత్వానికి ఎప్పుడైనా ఎక్కువగా బలైంది మహిళలే. కొంతమంది అంటున్నట్టు ఇది అయ్యప్ప భక్తులతో సమస్య కాదు- ఆ పేరిట రాజకీయం చేసేవారిది మాత్రమే. కేరళలో కమ్యూనిస్టులు దీర్ఘకాలంగా అధికారంలోకి వస్తున్నా అయ్యప్ప ఆలయం జోలికిపోయింది లేదు. ఇప్పుడు కూడా అత్యున్నత న్యాయస్థానం తీర్పు అమలు తప్ప అదేపనిగా మహిళలను పంపే పని ప్రభుత్వం పెట్టుకోలేదు కూడా. నిజంగా భక్తితో వచ్చే స్త్రీలను అడ్డుకుని అవమానించడం అనుచితమే కాదు, అప్రజాస్వామికం కూడా. భక్తి విశ్వాసాలకు భద్రత కల్పించడం, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ఒకదానికొకటి పోటీ కాదు. కొద్ది కాలం కిందట మధోరుభగన్ నవలలో పెరుమాల్ మురుగన్ స్థానిక ఆలయంలో వున్న ఆచారాన్నే చిత్రిస్తే తనపై దాడి చేశారు. ఇప్పుడు శబరిమలలో స్త్రీలకు వ్యతిరేకంగా చెలరేగి పోతున్నారు. ఈ తరహా మతతత్వ శక్తులను నిశితంగా ఎదుర్కోవడం ఆలోచనా పరుల కర్తవ్యం. అసలు మహిళలను అపవిత్రత పేరిట దూరం పెట్టడమే అమానుషమని అర్థం చేసుకోవాలి. ♦

సంపాదకవర్గం:

తెలకపల్లి రవి ప్రధాన సంపాదకుడు

వొరప్రసాద్ వర్కింగ్ ఎడిటర్

కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్

గనారా ◆ శమంతకమణి

కెంగార మోహన్

కె.లక్ష్మయ్య, మేనేజర్

బొమ్మలు: తుంబలి శివాజి

గంగాధర్ వీర్ల

చిదంబరం

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:

సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002, ఫోన్: 0866-2577248, సెల్: 9490099059

ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, www.prasthanam.com

సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి! తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!

1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000/ ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-

Bank Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada
A/c No. 52001500585, IFSC: SBIN0020343
చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

**కథలు**

నికా - షేక్ హుసేన్ సత్యాగ్ని.......................... 5
పాపం పసివాడు - పత్తి సుమతి........................ 24
మట్టిపెల్ల వాసన - విజయ్..... ........................ 35
వెన్నెల కురిసిన రాత్రి - టి.వి. ......................... 45

**కవితలు**

ఓ నిశీధి రాత్రి - లోసారి సుధాకర్......................4
సొగసు - పద్మావతి రాంభక్త............................9
మనిషి, పుట్టుక, పెండ్లి - డా॥ కత్తి పద్మారావు........ 10
గంగ నుండి ఓల్గాకు - డా॥ దిలావర్.................. 14
నీ తల(o)పున - ప్రసన్నరామ.......................... 14
మట్టి దీపాలు - డా॥ ఉదారి నారాయణ................ 19
గీతామృతం - అల్లూరి గౌరీలక్ష్మి.........................19
వాడు నా తమ్ముడు - కెంగార మోహన్................ 22
తెల్ల కాగితం - దార్ల వెంకటేశ్వర రావు..................23
నువ్వే ఓ మహాత్ముడివి - మాధవి పిన్నమనేని......... 23
మానని గాయాల సెగ - సునీత గంగవరపు........... 27
ప్రజాగ్రహం - పుట్టి గిరిధర్............................. 27
ఊరి చివర - జాని. తక్కెడ శిల.......................... 34
ఇదే నేటి నిజం - హరి అంబటి......................... 34
మౌనరాగం - సి.ఎస్. రాంబాబు........................ 43
ఆశచావని కృషీవలుడు - వి. రవీంద్రరెడ్డి............ 44
ఊరి మధ్యలో బొడ్రాయి - జె.బి. చరణ్.................49

దండించాల్సిందే - డా॥ కప్పగంతుల మధుసూదన్....52

**వ్యాసాలు**

సాహిత్య ప్రస్థానం అక్టోబర్ నెల పురస్కారాలు ........ 9
ధర్మపత్ని రాజ్యలక్ష్మమ్మ
- శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ.. 11
దళితుడే రాసిన తెలుగు దళిత నవల 'నవయుగం'
- డా॥ పొదిలి నాగరాజు......... 15
నా బాల్యమే నా జీవితనౌకకు తెరచాప
(ఇంటర్వ్యూ: విజయ్)- డా॥ శాంతినారాయణ.... 20
జీవితం లోంచి.. పుస్తకాల్లోంచి.. - మాగ్జిం గోర్కీ..... 28
కవిత్వపు మూడోకన్ను 'వై' కవిత్వం
- అక్షరమాలి సురేష్............. 32
అట్టడుగుల ఆగ్రహ ప్రకటన 'నీలవేణి' కథాసంపుటి
- ఎమ్వీ రామిరెడ్డి................ 39
సుగంధాలు వెదజల్లే 'వికసిత దళితం'
- జంధ్యాల రఘుబాబు...........50
మనసు పొదల్లో వెల్లువెత్తిన కవిత్వం
- వై. హెచ్.కె. మోహన్‌రావు...................... 54
స్వీకారం....................................................56
అలరించిన అనంత పుస్తక సంబరాలు
- డాక్టర్ యం. ప్రగతి............................ 59
డైరీ ..........................................................60

**కవిత**

## ఓ నిశీధి రాత్రి

- లోసారి సుధాకర్



*నిశబ్దపు అలజడిలో*
*కలల వంతెన నిర్మించాను*
*దుఃఖ ప్రవాహాన్ని దాటడానికి*
*ఏ దేవదూత సత్య బోధ చేయలేదు*
*ఏ మునీ జ్ఞానమార్గం చూపలేదు*
♦
*బాధల సుడిగుండాల్లో మునిగి పోతున్న నన్ను*
*ఆమె ఆ కరుణామయి తన చిటికెన వేలితో*
*నా కనురెప్పల్ని దయతో ముద్దాడింది*
*అప్పుడే తెలిసింది*
*కన్నీళ్లకు ఆనందబాష్పాలకు*
*మధ్య దూరం*
*అంతలో ఆమె మెరుపులా మాయమైంది ?*
♦

కథ




# నికా

- షేక్ హుసేన్ సత్యాగ్ని - 9866040810

బంధుమిత్రులతో షాదీఖానా నిండుగా ఉంది. ఇంకా అడపాదడపా వస్తూనే ఉన్నారు. పెళ్ళివారు 'రండి రండి' అని ఆహ్వానిస్తూ, సీట్లు లేనివారికి అదనపు కుర్చీలు వేసి కూర్చోబెడుతున్నారు.

వేదికకు ఎదురుగా మూడు వరుసల్లో స్త్రీలు కూర్చున్నారు. అక్కడక్కడా పలుచగా బురఖాలు లేనివాళ్ళున్నా బురఖాలు వేసుకున్న వాళ్ళే ఎక్కువ. అయినా వాళ్ళు వేసుకున్న నగలు, కట్టుకున్న బట్టలు చూచాయగా కనిపిస్తూనే ఉన్నాయి. ఆమె చీర బాగుంది, ఈమె నగ మోడ్రన్‌గా చేయించింది – అంటూ పరస్పరం చూపించుకుంటూ వారిలో వారు చర్చించుకుంటున్నారు. కొందరు యువకులు పెళ్ళికాని అమ్మాయిలను రహస్యంగా సైగలతో చూపిస్తూ, తమ తోటివారితో గుసగుసలాడుతున్నారు. మరికొందరు తమతో నిశ్చితార్థము జరిగిన అమ్మాయి లెక్కడున్నారాయని గుంపులో పరిశీలనగా చూస్తున్నారు. ఇక ఆకతాయిలైతే వాళ్ళ అందచందాలను బేరీజువేస్తూ తమ మిత్రులతో ఎకసక్కాలాడుతున్నారు.

వంటగది వైపు నుండి వస్తున్న బిరియాని ఘుమఘుమలు షాదీఖానా అంతా ముసురుకున్నాయి. నికా తొందరగా అయిపోతే మజా చూడొచ్చని లొట్టలేసుకుంటున్నారు – కొందరు భోజనప్రియులు. సకాలంలో నికా తంతు ముగిసిపోతే వేళకింత అన్నం తినొచ్చని వయసు మళ్ళిన పెద్దలు యెదురు చూస్తున్నారు.

పెళ్ళివారు హడావుడిగా తిరుగుతూ నికాకు కావాల్సిన సరంజామానంతా వేదిక మీదికి చేరుస్తున్నారు. పెండ్లికూతురు తండ్రి సుభాన్‌సాబ్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఆత్రుతగా ప్రవేశ ద్వారం వైపు చూస్తున్నాడు విఐపిలొస్తే ఆహ్వానించడానికి.

వేదిక వైపు నుండి వచ్చి, అప్పుడే ఒకరు లేచిపోతే ఖాళీ అయిన తన పక్కసీట్లో కూర్చునబోయిన యువకున్ని చూచి 'ఇంకా ఆలశ్యమేమంట?' అడిగాడు ఒక పెద్దాయన.

'అంతా రెడీగా ఉంది చాచా! ఖాజీసాబ్ రావడమే తరువాయి. నికా మొదలవుతుంది' – అన్నాడా యువకుడు.

'ఈ ఖాజీలు ఇంతే బేటా! సీజన్ కదా! ఒక్కొక్కరు

రెండుమూడు పెళ్ళిళ్ళు ఒప్పుకొని ఉంటారు. సకాలంలో రాలేక మనల్ని ఇబ్బంది పెడుతుంటా'రని విసుక్కున్నాడా పెద్దాయన.

వేదికకు ఎడమవైపున్న గదిలో పెళ్ళి కుమారుని ముస్తాబు చేస్తున్నారు. పెళ్ళి కుమార్తె తరపున వచ్చిన సేరా, ఇమాం జామీన్ కట్టారు. అతని తల్లిదండ్రులతోపాటు కొందరు పెద్దలు సేరాను తాకి ఆశీర్వదించారు. కొందరు ముత్తైదువులు పది, నూరు రూపాయల నోట్లను దిష్టి తీసి అక్కడున్న పళ్లెంలో వేశారు.

ఒక బలమైన యువకుడు పెళ్ళి కుమారున్ని భుజంమీది కెత్తుకుంటే మరో ఇద్దరు సేరా కదలకుండా ఎత్తి పట్టుకున్నారు. మెల్లగా వేదిక వద్దకు మోసుకొచ్చి, పెళ్ళికుమారుని కోసం పరచిన ప్రత్యేక పరుపు మీద కూర్చోబెట్టారు. వేదికకు కుడివైపున్న గదిలో పెళ్ళి కుమార్తెను చక్కగా అలంకరించి, ఆమె నెత్తిన సర్‌గా కప్పారు. ఆమె తలవంచుకుని కూర్చుంది. చుట్టూ స్నేహితురాండ్రు, బంధువులు కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఖాజీసాబ్‌ను చూస్తూనే నవ్వుమొఖంతో సుబాన్‌సాబ్ సలాం చెబుతూ ఆహ్వానించాడు. 'అంతా రెడీగా ఉంది సాహెబ్. మీ కోసం యెదురు చూస్తున్నాం' అంటూ వేదిక మీదకు పిల్చుకుపోయాడు. ఖాజీసాహెబ్ శిష్యుడు ఒకడు నికాదఫ్తర్ ఉన్న సంచి పట్టుకొని ఆయన్ను అనుసరించాడు.

ఖాజీసాహెబ్ రాకను గమనించి వేదిక మీద కూర్చున్న పెద్దలు మూకుమ్మడిగా లేచి 'సలాం లేకుం సాహెబ్!' అంటూ, ఆయనకు దారి ఇచ్చి సర్దుకుని నిలబడ్డారు. 'హాయ్ అల్లా!' అంటూ ఖాజీ సాహెబ్, నింపాదిగా పెళ్ళి కుమారుని యెదురుగా కూర్చున్నాడు. అక్కడున్న వారివైపు చూచి 'నాకు ఇంకో నికా ఉంది. సుబాన్‌సాబ్ కాదుకూడదని నిష్ఠూరం చేస్తూవుంటే తొందరగా ఇది ముగించుకుని పోదామని వచ్చాను' – అంటూ శిష్యుని వద్ద నుండి నికా దఫ్తర్ తీసుకున్నాడు.

ఇరువైపులకు సంబంధించిన ముఖ్యులు ఇద్దరిని తన దగ్గరకు వచ్చి కూర్చోమని పిలిచాడు ఖాజి. ఇరువురు మధ్య వయసున్న పెద్దలొచ్చి ఆయన యెదురుగా అటూ ఇటూ కూర్చున్నారు. ఇద్దరివైపు చూస్తూ 'చెప్పండి' అన్నాడు ఖాజీసాబ్.

'నా పేరు అబ్దుల్ కరీం. నేను పెళ్ళి కుమారుని చిన్నాన్నను' – అన్నారొకరు.

ఇటువైపున్న మరొకరు 'నా పేరు మురాద్ సాబ్. నేను పెండ్లి కుమార్తె మేనమామను' అన్నాడు.

ఖాజీసాబ్ పెళ్లిపుస్తకం తెరిచి పేజీలు తిప్పుతూ 'పెండ్లి కుమారుని పేరు?'

'అబ్దుల్ మునాఫ్' – అన్నాడు కరీం.

'తండ్రి పేరు?'

'అబ్దుల్ షుకూర్'.

చిరునామా, ఇతర వివరాలు అడిగి రాసుకున్నాడు.

మురాద్‌వైపు చూచి 'పెండ్లి కుమార్తె పేరు?'

'షాజహానా సాబ్'

తండ్రిపేరు సుబాన్‌సాబ్ అని తానే రాసుకుని, మిగతా వివరాలు అడిగి తెలుసుకుని రాసుకున్నాడు. వకీలుగా ఇద్దరికీ బంధువైన ఇమాం సాహెబ్ పేరును ఇరువైపులవారూ ప్రతిపాదించారు. ఇమాం సాహెబ్ వివరాలు అడిగి రాసుకున్నాడు.

ఇరువైపుల వారిని చూస్తూ 'మహరెంత?' అడిగాడు ఖాజీ.

'ఇరవైఐదువేలు' అని రెండువైపుల వారూ ఒకేసారి సమాధానమిచ్చారు.

'అది ఇప్పుడే చెల్లిస్తారా? తరువాతా?' అని అబ్దుల్ కరీం వైపు చూచాడు ఖాజీ.

'నగదు చెల్లిస్తాం సాబ్' అన్నాడు పెండ్లికొడుకు చాచా కరీం.

వివరాలన్నీ రాసుకున్నాడు ఖాజీ. ఇరువైపుల పెద్దలతో సంతకాలు చేయించుకున్నాడు.

'యా అల్లా' అంటూ అందరివైపు చూచి 'నికాకు అనుమతిస్తారా?' అన్నాడు.

అక్కడున్నవారందరూ 'అల్హం దులిల్లా' అన్నారు ఒక్కసారిగా.

నికా ప్రాధాన్యతను గురించి కొద్దిసేపు వివరించాడు ఖాజీ. నింపాదిగా పెండ్లికుమారుని వైపు చూచి 'నేను చెప్పినట్లు చెప్పు' అంటూ –

'ఇమాం సాహెబ్ వకాల్తాతో అబ్దుల్ కరీం, మురాద్ సాహెబ్ సాక్షులుగా ఇరువదిఐదువేల రూపాయల మహర్‌తో సుబాన్ సాహెబ్ కుమార్తె షాజహానాను మీకు నికా చేస్తున్నారు. అంగీకారమేనా?' అనడిగాడు.

'అంగీకారమే' అన్నాడు పెండ్లి కుమారుడు.

అదే ప్రశ్న మరో రెండు సార్లు అడిగాడు ఖాజీ. ప్రతిసారీ 'అంగీకారమే' నన్నాడు పెండ్లి కుమారుడు.

తనకెదురుగా పళ్లెంలో ఉన్న కలకండ ముక్కను తీసుకుని

పెండ్లి కుమారునికిచ్చి సగం కొరుక్కుని, మిగతా సగం కరీం చేతికిమ్మన్నాడు.

ఆ ముక్కను పెండ్లి కుమార్తెకు ఇచ్చి, ఆమె అంగీకారం తీసుకుని సంతకం చేయించుకుని రావాలని చెప్పి, నికా దఫ్తర్‌ను ఇమాం సాహెబ్ చేతికిచ్చాడు ఖాజీ.

ఇమాం సాహెబ్‌తో పాటు ఇరువైపులా పెద్దలిద్దరూ పెండ్లి కుమార్తె గదివైపు నడిచారు.

పెండ్లి కుమార్తె ఈడున్న ఒక అమ్మాయి ఆమెను ఆనుకుని కూర్చుని చాలాసేపటి నుండి యేదో చెబుతూవుంది. ఆమె తలవంచుకుని ఊకొడుతూ ఉంది. మధ్యలో అప్పుడప్పుడు తలపైకెత్తి కంగారుగా ఆమె కళ్ళల్లోకి చూస్తూంది. ఇంతలో ఒక పెద్దామె 'నికా అనుమతికి పెద్దలొచ్చారు. వాళ్ళకు దావ ఇయండే' అని కేకేసింది.

ముగ్గురు పెద్దలూ వచ్చి పెండ్లి కుమార్తె దగ్గర కూర్చున్నారు. కరీం సాహెబ్ తన చేతిలోని కలకండ ముక్కను ఆమెకిస్తూ 'ఇది తినమ్మా!' అన్నాడు. ఆమె దాన్ని అందుకుని చేతిలోనే పట్టుకుంది. 'తినాలమ్మా! అది మన ఆచారం' అని బుజ్జగించాడు మురాద్ సాబ్. అయినా ఆమె ససేమిరా అన్నట్లు తల పక్కకు తిప్పుకుంది.

'సిగ్గు పడుతోంది' అని ముగ్గురూ ఒకర్నొకరు చూసుకుంటూ ముసిముసిగా నవ్వుకున్నారు.

'చూడమ్మా! నేను చెప్పింది బాగా విను. ఇమాం సాహెబ్ వకాల్తాలో కరీం సాహెబ్, మురాద్ సాహెబ్ సాక్షులుగా అబ్దుల్ షకూర్ సాహెబ్ కుమారుడు అబ్దుల్ మునాఫ్ అను వరునకు ఇరవైయైదువేల రూపాయల మహర్‌తో మీ తండ్రి నీకు నికా చేయిస్తున్నాడు. నీకు అంగీకారమేనా!' అని అడిగాడు ఇమాం సాహెబ్.

ఆమె ఉలకలేదు. పలకలేదు.

'చూడమ్మా! బాగా విను. మళ్ళీ విను' అంటూ ఇంకో రెండుసార్లు అదే అడిగాడు.

ఆమె నుండి సమాధానం లేదు.

'సిగ్గుతో ఎవరూ చెప్పరు. అయినా మౌనం అంగీకారమేగా!' అంటూ సర్దిచెప్పబోయాడు ఆమె మేనమామ మురాద్ సాహెబ్.

పెండ్లి కూతురు ఉన్నపలంగా కంగారుతో తలపైకెత్తి 'నాకిష్టం లేదు' అంది మెల్లగా. అక్కడున్న వాళ్ళందరూ నోళ్ళు వెళ్ళబెట్టారు.

ఇది మామూలు తంతు అనుకుని నిర్లక్ష్యంగా ఉన్న ఆడవాళ్ళు, 'ఏం అనింది?' అని పక్కవాళ్ళనడిగి తెలుసుకుని, 'అవ్వ' అని నోటికి చేయి అడ్డం పెట్టుకున్నారు. అక్కడున్న కొందరు యువతుల ముఖాల్లో ఆనందం తొణికిసలాడింది. తరతరాలుగా యథాలాపంగ తంతువలె సాగిపోతున్న సంప్రదాయాన్ని షాజహాన తుంచివేసిందని మురిసిపోయారు.

మురాద్ సాబ్‌కు దిక్కుతోచక, అక్కడే ఉన్న పెండ్లి కూతురు తల్లితో 'ఏమైందక్కా!' అంటూ, బొటనవేలు నిటారుగా ఉంచి పిడికిలి బిగించి చెయ్యి ఊపుతూ సైగ చేశాడు.

ఆమె నిశ్చేష్టురాలై ఉంది. మౌనంగా అతని కళ్ళలోకి చూసింది – తనకేమీ తెలియదన్నట్లు.

పెండ్లి కూతురు నికాకు ఒప్పుకోలేదనే మాట ఆ నోటా ఈ నోటా పొక్కి క్షణాలమీద షాదీఖానా అంతా నెరుసుకుంది. అంతవరకూ చీరలు, నగల మీద సాగుతున్న ఊసుకోలు మాటలు నిలిచిపోయి, ఆడమగా అందరికీ 'పెండ్లి కూతురు ఒప్పుకోలే'దనే మాట చర్చనీయాంశమయింది. ఆ విషయం చిలవలు పలువలుగా అల్లి తమ అభిప్రాయాలను ఒకరికొకరు చెప్పుకోవడం మొదలుపెట్టినారు.

'ఈ కాలం ఆడపిల్లలు మరీ బరితెగించినారు. ఎక్కడ ఏ రొంపిలో దిగిందో! వాళ్ళనని ఏం లాభం? పిల్ల తల్లితండ్రులననాలి' – అన్నది అక్కడ ఇంచుమించుగా పెద్దలందరిలో ఏకాభిప్రాయమై మాటల్లో దొర్లుతోంది.

యువతీయువకులు కొందరు మాత్రం ఇదేదో కొంపలంటుకుపోయినంత ప్రమాదకరంగా భావించక, తేలిగ్గా తీసుకున్నారు. షాజహానా నికాకు అంగీకరించక పోవడానికి కారణమేమై ఉంటుందా అన్న ఆసక్తిని మాత్రం వ్యక్తపరుచుకుంటున్నారు.

బయట ద్వారం వద్ద విఐపిల రాక కోసం ఎదురు చూస్తున్న సుభాన్ సాబ్‌కు, బావమరిది ద్వారా విషయం తెలిసి కంపించాడు. ఆగ్రహం పట్టలేక పరుగెత్తినట్లుగా నడుస్తూ పెండ్లి కుమార్తె గదికి చేరాడు.

అతన్ని చూస్తూనే పెండ్లి కూతురుతో సహా అందరూ లేచి నిల్చున్నారు. సూటిగా కుమార్తె కళ్ళలోకి చూస్తూ 'ఏమయింది నీకు? యెందుకీ పాడు పని చేశావ్?' అంటూ ఊగిపోయాడు.

ఆమె తలదించుకుని యేడుపు మొహంతో యేడ్వడానికి సిద్ధంగా ఉంది.

'ఏం జరిగిందో సమాధానం చెప్పు' గద్దింపు స్వరంతో అడిగాడు సుభాన్ సాబ్.

ఆమె నసుగుతూ 'క్షమించండి అబ్బాజాన్! వాళ్ళు మంచివాళ్ళు కారు' – అంది తడబడుతూ యేడుపు నిండిన గొంతుతో.

తన నిర్ణయాన్ని కాదని ఎదురుతిరిగే ధైర్యం తన కూతురికెట్ల వచ్చిందాయని లోలోన ఉడికిపోతున్నాడు సుబాన్ సాబ్. కళ్ళు పెద్దవిచేసి ఆమె వైపు తీక్షణంగా చూస్తూ.

'ఇన్ని రోజులూ తెలియంది ఇప్పుడే ఎట్ల తెలిసిందమ్మా!' అన్నాడు మందలింపుగా.

కూతురు గుండెలమీద కుంపటై కూర్చుందని ఆమెను త్వరగా వదిలించుకోవడానికి మంచి చెడ్డలు విచారించకుండా అడ్డమైన వాడికి కట్టబెడితే నోరు మూసుకోవల్సిందేనా అని మెల్లగా గొణుగుతూ యెక్కి యెక్కి ఏడుస్తూంది షాజహాన. సుబాన్ సాబ్ నివ్వెరపోయి కూతురు వైపు చూస్తున్నాడు.

'ఈమె నడగండి. అన్నీ చెబుతుంది' అని తన పక్కనున్న అమ్మాయిని చూపించింది షాజహానా.

ఆమెను ఎగాదిగా చూస్తూ 'ఓహో! దీనికంతటికి కారణం నువ్వా?' అన్నట్లు తల పంకిస్తూ, 'ఎవరమ్మా?' నువ్వు అని గుద్దురిమాడు సుభాన్ సాబ్. ఆమె నోట మాట పెగలక అందరి ముఖాలు చూస్తూ నిలుచుంది.

'కొంపకు అగ్గివుల్ల గీచిపెట్టావ్. ఇంకా భయమెందుకమ్మా! నీకేం తెలుసో చెప్పు తల్లీ!' అని కటువుగా అడిగాడు సుభాన్ సాబ్.

'నా పేరు జహానారా. అబ్దుల్ మునాఫ్ నేనూ తిరుపతిలో బి.టెక్. చదివాం. చదువు పూర్తయిన తర్వాత ఇద్దరమూ పెళ్ళిచేసుకోవాలనుకున్నాం. మా ఇరువురి తల్లిదండ్రులకు చెప్పి ఒప్పించాం. మా అబ్బాజాన్ నా నిశ్చితార్థం ఘనంగా చేశాడు. నికా, వలీమాలు కూడా నిశ్చయించి పెళ్లిపత్రికలు కూడా అచ్చువేయించారు. ఇక పెళ్ళి పదిరోజులనగా...' అంటూ ఆమె తడబడింది.

ఆమె నోట మాట పెగల్లేదు. దుఃఖంతో బావురుమంది.

సుభాన్‌సాబ్‌తో పాటు అక్కడున్న వారందరూ నివ్వెరపోయి చూస్తున్నారు. కొన్ని క్షణాల తర్వాత తేరుకున్న సుభాన్ సాబ్ 'చెప్పమ్మా! ఏడ్వొద్దు' అని కొంత మెత్తబడి అడిగాడు.

'మా అబ్బాజాన్ అకస్మాత్తుగా హార్ట్ అటాక్ వచ్చి చనిపోయాడు చాచా!' అంటూ యేడుపు దిగమింగుకుంటూ చెప్పింది.

అక్కడున్న వాళ్ళందరూ జాలిగా ఆమె వైపు చూస్తున్నారు.

ఆమె తన బ్యాగులో నుండి పెండ్లిపత్రిక తీసి సుభాన్‌సాబ్‌కు ఇస్తూ, 'అనుకోని అనర్థం జరిగింది. అబ్బాజాన్ చెప్పినంతా ఇప్పుడు ఇవ్వలేకపోయినా, తర్వాత మలిగె అమ్మి ఇస్తామని ప్రాధేయపడింది మా అమ్మీ. వాళ్ళు ససేమిరా అన్నారు చాచా. అబ్దుల్ మునాఫ్ మంచివాడే. తల్లిదండ్రులను యెదిరించలేని పిరికివాడు చాచా!'. ఆమె కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. నేను దరిద్రపు గొట్టుదాన్ని కాబట్టి మా అబ్బాజాన్ చనిపోయారట. ఈ పెండ్లి జరిగితే తమ యింటికి అరిష్టమని మొండికేశారు.

ఆమె ఇచ్చిన పెండ్లిపత్రిక చేతపట్టుకుని, బావమరిది మురాద్‌ను పిల్చి ఏదో తర్జన భర్జన పడ్డాడు.

సుభాన్‌సాబ్ ఏ నిర్ణయం తీసుకుంటాడోనని, అక్కడున్న వాళ్ళందరూ ఉత్కంఠగా అతనివైపే గుడ్లప్పగించి చూస్తున్నారు.

మురాద్ వెళ్ళి, అవతలి పెళ్లిపెద్ద అబ్దుల్ కరీంను పిల్చుకుని వచ్చాడు.

సుభాన్ సాబ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు – 'ఈ పెండ్లి జరగదు. తాము ఇచ్చిన కట్నకానుకలు తిరిగి ఇవ్వా'లని.

♦♦♦

అప్పటికే షాదిఖానాలో 'పెళ్లి ఆగిపోయింద'నే విషయం పొక్కి కలకలంగా ఉంది. 'ఇంతవరకూ వచ్చాక పెండ్లి కూతురు వద్దనిందని పెండ్లి ఆపడమే'మిటని కొందరు గుసగుసలు పోతున్నారు. మరికొందరు యువతీ యువకులు 'మొదట అనుకున్న అమ్మాయితో అబ్దుల్ మునాఫ్ పెండ్లిచే'యాలని బాహాటంగానే పెండ్లికొడుకు తరపు పెద్దలతో వాదిస్తున్నారు. మరికొందరు ఏమీతోచక డోలాయమానంగా ఉన్నారు.

పెండ్లి కొడుకు మునాఫ్‌లో అంతర్మథనం ప్రారంభమయింది. ♦

♦

*సేరా : పెండ్లి కుమారుని మోహానికి అడ్డంగా దిగేసే మల్లెపూల పరదా.*

*సర్‌గా : పెండ్లి కుమార్తెకు కప్పే జలతారు పరదా.*

♦

# పురస్కారాలు

## సాహిత్య ప్రస్థానం అక్టోబర్ నెల పురస్కారాలు

| సంకల్పం | ప్రకృతి... విధ్వంసం... చరిత్ర... | అసుంటసుంట |
|---|---|---|
| కథకు: రూ.700/- | వ్యాసం: రూ.500/- | కవితకు : రూ .500/- |
| రచయిత: పుప్పాల సూర్యకుమారి | రచయిత : సుంకర గోపాలయ్య | రచయిత : రతన్‌రాజు బందిలి |

■■■

*కథ, కవితకు సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కారం, వ్యాసానికి కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.*

**- ఎడిటర్**

## సొగసు


**- పద్మావతి రాంభక్త**
**9966307777**




ఎన్నాళ్ళుగానో గుట్టుగా
లోన దాగిన నది
అప్పుడప్పుడు ఆనకట్టను బద్దలుకొట్టి
దుఃఖవరదై ముంచెత్తుతుంది
బొట్టుబొట్టుగా ఉబుకుతున్న
ఊటంతా పోగుపడి
ఏదో గుబులు మేఘం
హృదయాకాశమంతా
కమ్ముకుని నల్లబారినపుడు
దిగులు పగుళ్ళలోంచి
కన్నీటివాన ఉధృతంగా
కురిసిపోతుంది
ఎన్నో సంక్షోభాలను సంఘర్షణలను
భారంగా మోసి
అలసట అలుముకునే సమయంలో
బాధ్యతల బరువులు
మరింతగా వెన్నెముకను
కృంగదీస్తున్నపుడు
తప్పనిసరయిన పయనం
అనివార్యతలోకి నెట్టేసి
వేదన గుండెలో గూడుకట్టుకుంటుంది
ఇంతలో ఒక ముళ్ళమాట
బాణంలా సూటిగా
ఎదను తాకగానే
గడ్డకట్టినదంతా బద్దలై
తుపానులా రూపాంతరం
చెంది సుడిగాలై చుట్టేస్తుంది
ఆత్మీయుల పలుకుతేనెలలో
ఈదులాడుతూ
పొరలు పొరలుగా
గతపు నలుపు పుటలను
విప్పుతున్నపుడైనా
పూడుకున్న గొంతులో
కొట్టుమిట్టాడుతున్న
గాయాల రొద
హఠాత్తుగా బయటకు దూకేస్తుంది
ఎంతో కాలంగా
ధైర్యపు కవచం తొడుక్కుని
అడుగులేస్తున్నా
విధి క్రూరమైన ఆటలాడుతూ
వింత పరీక్షలకు గురి చేసి
ఓటమిని అంగీకరిస్తారేమో
అని నిరీక్షిస్తూ ఉంటుంది
గెలుపు కోసమే కాక
పోరాటపటిమను పెంచే
స్ఫూర్తిమంత్రాన్ని మనమే
రచించుకుని
బ్రతుకు బరిలో
చెంపలపై పేరుకున్న
చారికలను తుడుచుకుంటూ
తలపడడంలోనేగా
జీవితపు సొగసు దాగి ఉంటుంది ♦

**కవిత**

# మనిషి, పెండ్లి, పుట్టుక

- డాక్టర్ కత్తి పద్మారావు
9948748812



మానవ సంబంధాల్లో వైరుధ్యాలు
హింసా ప్రవృత్తి పరిఢవిల్లుతోంది
ప్రేమ ఎలా నేరమౌతుంది ?
తండ్రే కసాయి వాడైతే ఎవర్ని నమ్మాలి
కత్తితో అల్లుణ్ణే వధిస్తే
సామాజిక ధర్మమేముంది ?
హిందూ ధర్మమంటే వధించడమేనా!
రావణుణ్ని వధించారు!
నరకుణ్ణి చంపారు!
శంబూకుడి తల తీశారు!
అయినా మనిషిని మనిషి పెండ్లాడడం ఎలా నేరం
మరి వశిష్ఠుడు అరుంధతిని చేసుకొన్నాడు
అరుంధతిని ఎందుకు పూజిస్తున్నారు?
అరుంధతి నక్షత్రమెలా అయ్యింది?
శక్తి అదృశ్యంతిని చేసుకొన్నాడు
వారికి పరాశరుడు ఎలా పుట్టాడు?
పరాశర స్మృతిని ఎలా అనుసరిస్తున్నారు?
పరాశరునికి బెస్తకన్యకు వ్యాసుడెలా పుట్టాడు?
సంకరంగా పుట్టిన వ్యాసుని చేత
పురాణాలెలా వ్రాయించుకొన్నారు.
అసలు, ఆర్య రాజ్యానికి మూలమైన
కౌరవ వంశం కథేంటి?
వ్యాసునికి, అంబికా,అంబాలికకు
పుట్టిన ధృతరాష్ట్రునికి పాండురాజుల పుట్టుకేమిటి?
ధృతరాష్ట్రునికి వంద మంది కొడుకులు ఎలాపుడతారు?
వివేచన లేదా! ప్రశ్నలేదా!
సొంత కొడుక్కి
దుర్యోధనుడు
'దుష్టంగా యుద్ధం చేయువాడు' అని అర్థం
కూతురుకి
దుస్సల 'చెడ్డగా మాట్లాడునది'
అని పేర్లు ఎలా పెట్టుకొంటారు
ఆలోచన లేదా!
పుక్కిట పురాణాలకు బుర్రలు తాకట్టు పెట్టిన
మీరు, మనుష్యులను మనుష్యులుగా
ఎందుకు చూడలేరు
పాండు రాజుకు పిల్లలు కలగలేదు
యముడికి ధర్మరాజు
వాయు దేవునికి భీముడు
ఇంద్రుడుకి అర్జునుడు
అశ్వనీ దేవతలకు
నకుల సహదేవులు ఎలా కలిగారు
వీరిదే వర్ణం? వీరిదే కులం?
వర్ణం సృష్టించబడింది
అసలు దేవుడే సృష్టించబడ్డాడు
దేవుణ్ణి మానవుడే సృష్టించాడు
మానవుడు లేనిచోట దేవుడు లేడు
మానవుడు సృష్టించిన దేవునికి
మానవుణ్నే బలివ్వడం ఎంత నేరం
అవును, నీవు నీ కూతుర్ని కన్నావు
ఆమె ఎవర్నీ ప్రేమించ గూడదా!
కులం మూలం నీకు తెలుసా?
అల్లుణ్ణి చంపి హంతకుడివయ్యావు
నీవు రాజ్యాంగేతర శక్తివయ్యావు
ఇప్పుడు కూతురు భర్త లేనిదయ్యింది
మీ ఋషులందరూ వర్ణాంతరాలే కదా!
పరిశీలిస్తే నీవూ వర్ణాంతరుడివే
నీవూ ఒకరికి బానిసవే
క్రతువుల్లో నీవెందుకు
బ్రాహ్మణునికాళ్ళు పట్టుకొంటున్నావు
నీవు ఎవరి శ్రమతో
ధనవంతునివయ్యావు
మా శ్రమను దోచుకొనే హక్కు నీకుంటే
మీ పిల్లలను చేసుకొనే హక్కు
మాకులేదా?
వర్ణాంతరం వెలుగు
వర్ణాంతరమే జీవనసాఫల్యం
సమాజం మూలం తెలుసుకోండి,
మానవాభ్యుదయానికి మూలం ప్రేమ
ప్రేమ వర్ణాంతరానికి వారధి
మనిషిని మనిషి వెలిగించే
సామాజిక విప్లవమే మార్గం

***(అమృతను కులాంతర వివాహం చేసుకున్నందుకు 14-9-2018న 23 యేండ్లకే మామ మారుతీరావు (వైశ్య) ద్వారా హత్యకు గురైన దళిత యువకుడు ప్రణయ్ కుమార్‌కు అంకితం)***


కందుకూరి దంపతులు

# ధర్మపత్ని రాజ్యలక్ష్మమ్మ

- శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

*"కులజయు నిర్మలాంగి యను*
*కూలయు నయ్యయి విద్యలందు గౌ*
*శలవతియున్ ప్రశస్తగుణ*
*సన్నుతురాలును నైనయట్టి కో*
*మలి లభియించినన్ గద స*
*సమంజసమౌను గృహస్థధర్మ మ*
*ట్లలవడినట్టు లైనను గృ*
*హస్తుని భాగ్యము చెప్పశక్యమే."*

శ్రీకందుకూరి వీరేశలింగము పంతులుగారికి రాజ్యలక్ష్మమ్మగారు అనుకూలవతియైన భార్య. ఆమె సహాయముతో ఆయన అనేక మహత్తర కార్యములను చేయగలిగారు.

రాజ్యలక్ష్మమ్మగారు 1851 సంవత్సరములో తూర్పు గోదావరి జిల్లా కాతేరు గ్రామంలో జన్మించారు. ఈమె తండ్రి అద్దంకి పట్టాభిరామయ్యగారు. కాని ఈమె తలిదండ్రులవద్ద పెరగలేదు. ఈమెకు నాల్గవయేట తల్లి మరల ఒక మగశిశువును గని చనిపోగా ఈమె మేనమామ వెన్నేటి వెంకటరత్నముగారును వారి సతీమణి లచ్చమాంబగారును ఈమెను అల్లారుముద్దుగా పెంచి విద్యాబుద్ధులు చెప్పించి పెద్దదానిని చేశారు.

రాజ్యలక్ష్మమ్మగారికి 8వ యేట వివాహమైనది. అప్పటికి వీరేశలింగము పంతులుగారి వయస్సు పదిరెండు మాత్రమే. వివాహమైన మరి నాలుగేళ్ళకు అనగా పంద్రెండవ యేట రాజ్యలక్ష్మమ్మ అత్తవారియింటికి వచ్చింది. అంతే – నాటినుంటి ఈ దంపతులు యేబది సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా గార్హస్థ్య జీవితం గడిపారు. ఇది సాధారణ సాంసారిక జీవితంగాదు. అనేకమైన శారీరక మానసిక క్లేశపరంపరలతో కూడుకున్నది. విశిష్టమైనది.

పంతులుగారు ఆంధ్రదేశాభ్యుదయానికి నలుముఖాల అమోఘమైన కృషిచేశారు. ఒకటి సారస్వత సేవ. రెండవది బాలవితంతువుల వివాహము. మూడవది వేశ్యాలంపటులును, లంచగొండులును అయిన పెద్దమనుషులతో పోరాటము, నాల్గవది కర్మపరిత్యాగము, విగ్రహారాధన నిషేధము, జాతిమత భేదములేని ఏకేశ్వరోపాసన. సారస్వత విషయం తప్పిస్తే వీనిలో ప్రతిఒక్కటీ సంఘంలో తుపానురేపేవే. కాని వీరేశలింగం పంతులు గారు ఆరాధ్య నియోగి బ్రాహ్మణులు, ఈ శివపూజా దురంధరులకు పట్టుదల యెక్కువ. అనుకున్న పనిని యెన్ని కష్టము లెదుర్కొన్నా వెనుదీయక చేయుడమేతప్ప మానుకొనడమనేది వారి తత్వంలోనే లేదు. వీరి కడగండ్లకు ముఖ్యకారణమైనది పంతులుగారు తలపెట్టిన స్త్రీ పునర్వివాహ ఉద్యమము. చిన్నతనముననే భర్తల కోల్పోయి అష్టకష్టములు పడుచున్న బాలవితంతువులకు మరల వివాహములు చేయవలెనని పంతులు ప్రయత్నమారంభించారు. ఇది పూర్వాచార పరాయణులకు ఎంతో కంటకప్రాయమైంది. దీనిని వారు సంఘబలంతోను పీఠాధిపతుల మద్దత్తుతోను బహుముఖాల ఎదిరించారు. ఆ రోజుల్లో ప్రజలు సంఘానికి వ్యతిరేకమైన యే ఒక్కపని చేసినా కులములోనుంచి వెలిబెట్టడం సర్వసాధారణం. కులబహిష్కారం సామాన్యమైన కష్టంగాదు. ఇంటికి పనివారు రారు, వంటచేసేవారు రారు, బంధువులు, మిత్రులు రారు, పురోహితులు రారు, పేరంటములకు, భోజనములకు వీరిని యెవరూ పిలువరు.

వీరు పిలిస్తే ఒకరు రారు. వీరి యింటికి ఎవరు వచ్చివెళ్ళినా వారికి, వారివారి యింటికి వచ్చివెళ్ళినవారికి గూడా కులంలో వెలే, వారింట భోజనమే చేయనక్కరలేదు. తాంబూలము పుచ్చుకువచ్చారని తెలిస్తే చాలు కులబహిష్కరణమే. సంఘంలో పుట్టి, సంఘంలో పెరిగి, సంఘంలో మెలగనేర్చిన మనిషికి దీనిని మించిన కష్టంలేదు. కనుక ఆ కాలంలో ప్రజలు వెలికి వెరచినట్టుగా పులికైనా వెరచేవారు కాదు.

స్త్రీకి భర్తయందు భయభక్తులతో గూడిన అనురాగము, పుట్టింటివారియందు విపరీతమైన ఆపేక్ష ఉండుట సహజలక్షణము. పెనిమిటి స్త్రీ పునర్వివాహోద్యమం తలపెట్టడంతో పుట్టింటి, అత్తయింటి సంబంధాల రెండూ రాజ్య లక్ష్మమ్మగారికి రెండు సమస్యలై కూర్చున్నవి. రెంటిని అంటిపెట్టుకొని ఉండటానికి పరిస్థితులు అనుకూలంగా లేవు, పుట్టింటిమీద ఆపేక్ష పెట్టుకున్నదా భర్తను వదులుకోవాలె, భర్తమీద మమకారం పెట్టుకున్నదా పుట్టింటి వారి మీద ఆశ త్రెంచుకోవాలె. ఈ రెండును ఆలోచించి రాజ్యలక్ష్మమ్మగారు భారతనారీమణి కేది కర్తవ్యమో ఆ భర్తవద్ద ఉండటమే నిశ్చయించుకున్నది. ఈ సంగతివిని చిన్నతనం నుండి అతిఆపేక్షతో పెంచుకున్న మేనమామ, ఏకైకసోదరుడు తమ్ముడూ వచ్చి పుట్టింటికి వచ్చివేయమని వేవిధాల చెప్పారు, ఏడ్చారు. నిష్ఠూరాలాడారు. కాని సీత, సావిత్రివంటి పతివ్రతల శ్రేణికి చెందిన రాజ్యలక్ష్మమ్మగారు, భర్తనువదలి పుట్టింటివారి పంచ చేరడానికి అంగీకరించలేదు. వానతో నేగి, పెనిమిటితో పేదరికము లేదు, వడ్లతో తట్ట యెండవలసినదే అన్న సామెతలు సార్థకంచేస్తూ భర్తవద్దనే ఉండిపోయినారు.

కుల బహిష్కారం మూలంగా రాజ్యలక్ష్మమ్మగారు పాపం అష్టకష్టాలు పడవలసివచ్చింది. పనివాళ్ళు రానందువల్ల ఉదయం వాకిలివూడ్చడం దగ్గిరనుంచి, అంట్లు, చెంబులు, వంట అన్నీ స్వయంగా చేసుకోవలసివచ్చింది. మంచినీళ్ళు తెచ్చువాళ్ళు రానందున గోదావరికి వెళ్ళి నీళ్లు తేవలసి వచ్చింది. ఒకటేమిటి ఆ కష్టపరంపరలకు అంతులేదు.

ఈ పనిపాటలు తప్ప మరేముచ్చటాలేదు. నోములనీ వ్రతములనీ పండుగలనీ పబ్బములనీ పేరంటములనీ విందులనీ తోడిస్త్రీలంతా పూచిన తంగేడులాగా చక్కగా సొమ్ములు పెట్టుకొని సరదాగా వెళ్ళుతుంటే రాజ్యలక్ష్మమ్మ గారు కులబహిష్కారం వల్ల తమరిని ఎవ్వరు పిలువక ఎక్కడికీ పోవడానికిలేక, యిరుగుపొరుగు స్త్రీల యెత్తి పొడుపులకు హేళనలకు మనస్సు చిల్లులపడుతూ గ్రుడ్లనీరు గ్రుడ్ల క్రుక్కుకుంటూ ఉండిపోతూ ఉండేది. పైగా పెనిమిటి ముక్కోపి. ఎందునా చొరవీయనిమనిషి. మనసులో బాధ ఆయనతోనైనా చెప్పుకోడానికిలేదు. చెప్పుకున్నదా నీకంతకష్టంగావుంటే మీవాళ్ళ యింటికి వెళ్ళమనడానికి వెనుదీయడు. అటువంటి పరిస్థితుల్లో రాజలక్ష్మమ్మగారు ఈ కష్టాల్ని ఎట్లా భరించిందో ఆమెకే ఎరుక. భగవంతునికే ఎరుక.

ఎంతెంత కష్టాలనూ మరపించే ప్రభావం కాలానికున్నది కాలక్రమంగా రాజ్యలక్ష్మమ్మగారు ఈ కష్ట పరంపరలకు అలవాటు పడిపోయింది. వివాహేచ్ఛతో తమ యింటికివచ్చిన బాలవితంతువులను చేరదీసి ఆదరించడము, వారికి బొట్టుపెట్టి గాజులు తొడిగించి చీరె రవికలు కట్టబెట్టి జడవేసి పూలుపెట్టి కూర్చుని వారికి పెండ్లిండ్లుచేయడము ఈ పనులలో నిమగ్నురాలై తమ బహిష్కారబాధలు మరిచిపోయింది. 1881 డిశంబరు 11తేదీని వీరేశలింగం పంతులుగారు ప్రథమ పునర్వివాహం చేశారు. వరుడు గోగులపాటి శ్రీరాములుగారు. వీరికి మొదటి భార్య చనిపోగా ఆమెవల్ల కలిగిన నాలుగు మాసములపిల్ల వానిని రాజ్యలక్ష్మమ్మగారు పెంచుకున్నారు. ఇతను ఈమె పోషణలో పెరిగి పెద్దవాడై పట్టపరీక్షయందు ఉత్తీర్ణుడై వివాహసమయమునకు పెంపుడు తల్లిదండ్రులు చేస్తామన్న బాలవితంతువును చేసికొనక ప్రాయశ్చిత్తము చేసుకొని కులములో కలిసి సాధారణ కన్యను పెండ్లిచేసుకున్నాడు. ఈ కుమారుని యెడబాటు రాజ్యలక్ష్మమ్మగారికి ఎంతో దుఃఖము కలిగించింది. చాలా రోజులు అన్నము నీళ్ళుగానక అల్లాడిపోయింది. ఆమె భగవంతునిగూర్చి వ్రాసుకున్న పాటలో --

కల్లగాదు సుతునిబాసి - తల్లడిల్లుచుంటిని

ఉల్లమందు నిలిచినీవు - నా మనసు చల్లచేయవే దేవ

- అన్న చరణమును బట్టి ఈ పుత్రునియెడబాటు ఆమె కెంత వేదన కలిగించిందో తెలుసుకోవచ్చు.

స్త్రీ పునర్వివాహములేగాక ఏ కారణముచేతనైనా పతితలైన స్త్రీలను, అట్టివారు కని పారవేసిన పిల్లలను గూడ సంరక్షించవలెనని రాజ్యలక్ష్మమ్మగారికి తలంపు గలిగి భర్తను అడిగింది. ఆయన వెంటనే పతిత స్త్రీల ఉద్ధరణాలయమును, అనాథబాలల శరణాలయమునుగూడ కట్టించారు. రాజ్యలక్ష్మమ్మగారికి భూతదయాపర్వతము మెండు. వా రేకులమువారైనా ఎట్టివారైనా సహాయము చేయడమే ఆమెపని. ఒకనాడు మండుటెండలో ఒక హరిజనుడు ఆకలి దప్పులచే శోషిల్లి వీధిలోబడి ఉండగా ఎవరినో సహాయము తీసుకొనివెళ్ళి అతనిని పట్టుకవచ్చి పంచలో పడుకోబెట్టుకొని అతనికి సేదతీరేంతవరకు ఉపచర్యచేసి రక్షించినదట. మానవులేగాదు

పెంపుడు కుక్కలు పిల్లులు పశువులున్నా ఆమెకు ప్రీతే. ఒకనాటి రాత్రి రాజ్యలక్ష్మమ్మగారు ఎదుటఉన్న పామునుచూడక ముందుకునడచిపోతూ ఉండగా బ్రౌన్ అను ఆమె పెంపుడు కుక్క ఆమెకు అడ్డమువచ్చి ముందుకు అడుగువేయకుండా ఆపినదట. కారణమేమిటని దీపముపెట్టి చూడగా ఎదుట పెద్దపాము! వెంటనే దానినెవరో చంపివేశారు. ఆమె చనిపోయిన తరువాత ఆమెను కుర్చీలో కూర్చోబెట్టగా ఆమె పెంపుడుపిల్లి వచ్చి ఒడిలో కూర్చుండి అడుకున్నట్లు పంతులుగారే వ్రాశారు.

రాజ్యలక్ష్మమ్మగారికి భగవద్భక్తి యెక్కువ. ఆమె రాజమహేంద్రవరములో స్త్రీలకొక ప్రార్థన సమాజము స్థాపించి ప్రతివారము స్త్రీలను సమావేశపరచి ప్రార్థనలు చేస్తూ ఉండేది. భార్య కోరికపై పంతులుగారు దానికి మందిరము కూడా కట్టించారు. ఆంధ్రప్రదేశమున స్త్రీ నిమిత్తమై స్థాపించబడిన ప్రార్థన సమాజములలో రాజ్యలక్ష్మమ్మగారి సమాజమే మొట్టమొదటిది.

రాజ్యలక్ష్మమ్మగారు చిన్ననాడు వీధిబడిలో కొద్దిగా చదువుకొనినారు. పెద్దవారైన తరువాత ఆ చదువును వృద్ధి చేసుకున్నారు. ఆమె ఏకేశ్వరుని గురించి ఎన్నో కీర్తనలు వ్రాశారు. అవి యెంతో భక్తిభరితంగా ఉంటాయి. శ్రీ వీరేశలింగం పంతులుగారి రచనలన్నీ చదివాము. అవి అన్నీ గద్యపద్యములే. వానిలో కీర్తనలున్నట్టు లేదు. ఆ కీర్తనల భాగమును రాజ్యలక్ష్మమ్మగారు విరచించి అర్ధాంగి నామమును సార్థకం చేసుకున్నారు.

రాజ్యలక్ష్మమ్మగారి జీవితమెంత దివ్యమైనదో ఆమె మరణము గూడా అంత దివ్యమైనదే. ఆమె యెల్లప్పుడు చేయు అనుదిన ప్రార్థనలో భర్తకంటె ముందుగా తాను పోవలెననేది ముఖ్యమైనదట. అందువల్లనే పంతులుగారు తన యావదాస్తిని హితకారిణీ సమాజమునకు దానపత్రము వ్రాస్తూ తన భార్యకు యివ్వవలసిన దానిని గూర్చి ఆలోచిస్తూ ఉండగా ఆ సంగతి రాజ్యలక్ష్మమ్మగారు తెలుసుకొని నేను మీకంటె ముందుగా పోతాను, నాకెందుకు ఆస్తి అన్నదట. ఇదే విషయమై ఆమెకు ఆప్తులైన వారు వచ్చి మీ ఆయన ఆస్తినంతా నీకు లేకుండా ధర్మము చేస్తుంటే వూరుకుంటావేమని హెచ్చరించారుట. “నేను నా భర్త కళ్ళ ముందుగానే పోతాను. నాకు ఏ ఆస్తి అక్కరలే”దన్నదట. అదేమి విశ్వాసమో ఆదేమి స్వచ్ఛంద మరణమో, ఆమె 1910 సంవత్సరము ఆగస్టు 11వ తేదీ శుక్రవారము రాత్రి ప్రొద్దుపోవు వరకు వంట వగైరా అన్ని పనులు చేసి, భర్తకు కావలసిన సపర్యలు చేసి, తాను భోజనము చేసి, సుఖముగా పడుకొని తెల్లవారునప్పటికి ఏ బాధ లేకుండా చనిపోయి ఉన్నది. ఆమె ఏమైనా మరణబాధపడినదా అంటే ఏమీ లేదు. బొట్టు చెరగలేదు. తల రేగలేదు. తలలో బెట్టుకున్న గులాబి పువ్వైనా వాడలేదు. కట్టుకున చీరైనా నలగలేదు. చనిపోయి గూడా నిద్రపోతున్నట్టుగా ఉండిపోయినది. మంచివారి చావు మరణ కాలమున తెలియునన్న సామెతను రాజ్యలక్ష్మమ్మగారి మరణము సార్థకం చేసింది. ఆమె మరణం చూచి యెల్లరు ఆశ్చర్యపోయినారు. ఆ నాడు వారి యింటా వాకిటా వీధిలో అంతా తిరునాళ ప్రజే.

భార్య మరణానంతరము వీరేశలింగముపంతులుగారి జీవితము నీరువీడిన చేప చందమైంది. అన్ని విధముల అసహాయుడైపోయినాడు. పంతులుగారు సహజముగా దుర్బలశరీరులు, వ్యాధిగ్రస్తులు, రాజ్యలక్ష్మమ్మగారు ఆయన శరీరతత్వము మనస్తత్వమెరిగి ఎన్నో విధముల ఉపచరించే వారు. రాజ్యలక్ష్మమ్మగారు ఏబది సంవత్సరములు ఆయనను తల్లివలె పోషించింది. దాసివలె ఉపచరించింది. మంత్రివలె ఆలోచన చెప్పినది. భూదేవివలె కష్టములు సహించినది. మహాలక్ష్మివలె ఉండి అన్ని విధముల ఆయనను సుఖపెట్టినది. భార్య మరణానంతరము పంతులుగారు తొమ్మిది సంవత్సరాలు జీవించారు. ఈ తొమ్మిది సంవత్సరములు సుఖపడిన దినములేదు. చేసిన మహత్కార్యములేదు. కృష్ణుని నిర్యాణానంతరం అర్జునుని వలె నిస్సహాయుడై శారీరక మానసిక క్లేశము లనుభవించి తనువు చాలించారు. ఏబది సంవత్సరములు భర్తకు తోడుగా నీడగా ఉండి శతాధిక గ్రంథములు వ్రాయుటకేమి, స్త్రీ పునర్వివాహాది సంస్కార కార్యములు చేయడానికేమి, యావద్ధనమును పరహితార్థం సమర్పించడానికేమి సహకరించిన రాజ్యలక్ష్మమ్మగారు ధన్యాత్మురాలు. ఇట్టి అర్ధాంగి లక్ష్మి లేకున్న పంతులుగా రింతటి మహత్తర కార్యములు చేయగలిగేవారు కారేమో!

రాజ్యలక్ష్మమ్మగారి పాటలు చాలాకాలం క్రితం చదివాను. ఆ పాటలలోని ఈ పాటభాగము నా నోటికెట్లా వచ్చిందోగాని ఆ ముక్కలు నా కెంతో యిష్టం :

*కాపాడ నీకన్న ఘనులెవ్వరున్నారు*
*కరుణతో బ్రోవుమయ్యా - పాపసంహార*
*నీ పాలబడిన నన్ను ఆపదుద్ధారక*
*ఆదరింపవే దేవ ॥కా॥*

ఆమె యెంత అనుభవంతో వ్రాశారోగాని ఆ పాట పాడుకుంటూ ఉంటే నాకేదైనా మనఃక్లేశం కలిగినప్పుడు గూడా మనశ్శాంతి కలిగిస్తూ ఉంటుంది. స్వర్గీయ రాజ్యలక్ష్మమ్మగారికి నా కృతజ్ఞతాంజలి ♦

# గంగ నుండి ఓల్గాకు..

- డా.దిలావర్
9866923294



మనమంతా బంధువులం!
ఆహా! ఏమి ప్రవచనాలండీ!
ఎవరికి ఎవరు బంధువులు?
ఉన్నోళ్ళకు ఉన్నోళ్ళు
పై కులపోళ్ళకు పై కులపోళ్ళు!
మరో తేనె పూసిన అభిభాషణ–
పవిత్ర గంగా నది బిందువులం!
ఎంత శ్రవణ పేయ సమాహితమండీ!
ఎంత మసిపూసి మారేడు గాయ చేసే ధర్మ సమ్మితండీ!
గంగా కూలంకషను కలుషితం చేసింది చాలు....
నిజానికి మనం కాళియ మడుగులో విరజిమ్మిన
కాల కూట విష బిందువులం!
బతికుండగానే మనుషుల్ని పీక్కు తినే రాబందులం!
ఓ పక్క అంతరిక్షానికి రెక్కలు కట్టుకుంటున్న విజ్ఞానం
మరోపక్క పాతాళానికి దిగ జారుతున్న మత మౌఢ్యం!
ఎన్నాళ్ళీ అసమ సమీకరణలు ?
మనిషికీ మనిషికీ మధ్య అగాధాల్లా
విష దష్ట్రలు చాపే కర కుల ఘాతుకాలు
నువ్వు ఒక్క సారి ఓల్గా పరీవాహక నాగరికతవై
గతం లోకి ప్రవహించు......

అక్కడ మనుగడకు వేటాడటం తప్ప
మనుషుల్ని విభజించి వేటాడటం ఉందదు
స్త్రీ మూర్తిని ఒక చిన్న అంగంగా భావించి
కుంచించుకు పోవడం ఉండదు....
అక్కడ మాతృస్వామ్యం
మానవ పునరుత్పత్తిని స్వేచ్ఛగా స్వప్నించే మాతృక!
కుటుంబ మహా వృక్షమై
ప్రాణ వాయువులందించే జీవన వాహిక!
మళ్ళీ మన మహా ప్రస్థానం
గంగ నుండి ఓల్గాకు సాగించుదామా..... ♦

---

# నీ తల(ం)పున

- ప్రసన్నరామ



వైకల్యపు
గాయాల భుజాలు
సంకల్పాన్ని ఎత్తుకోలేక
చతికిల పడ్డాయి...

వేల సూర్యుల
నీ వెలుగుజాడలో
కారుచీకట్లను
వెతుక్కుంటున్న
గుడ్డి వాళ్ళం...

మా తలరాత
బాగుకోసం
చేతనా రాగాలను
హృద్యంగా మీటితే,
ఆ తంత్రులను
చిదిమేస్తున్న
వెర్రి వెంగళప్పలం...

చిన్నతనపు
ఇరుకు గదుల్లో
పాఠాలు నేర్చిన వాళ్ళం..

కుల పైత్యాన్ని
గొడ్డళ్లకు
అలంకరించుకొని
మురిసిపోతున్న మొండి
వాళ్ళం.....

దారి తప్పిన
మా గమనాలను
దిద్దుబాటు
చేసుకోలేక
సర్దుకుపోతున్న
నిస్సహాయులం...

మతాల మత్తు
కులాల కంపుతో
ఊరేగుతున్న
మా వెర్రి తలలకు
నీ తలపాగా
కావాలి ఆసరా...

మిమ్మల్ని
మీ అభిమానాన్ని
మీ అభిమతాన్ని
అనాథను చేసిన మమ్మల్ని
క్షమించు మహాత్మా....

ఎందుకంటే
చిన్నతనపు
ఇరుకుగదుల్లో
పాఠాలు నేర్చిన వాళ్ళం మేము.. ♦




# దళితుడే రాసిన తెలుగు దళిత నవల 'నవయుగం'

- డా॥ పొదిలి నాగరాజు
9052038569

తెలుగు నవలా సాహిత్యంలో దళిత నవలల స్థానం పరిమితమేనని చెప్పాలి. తొలి తరంలో దళిత నవలను దళితేతరులు సంఘసంస్కరణ భావజాలంతో రాశారు. దీనికి గాంధీజీ హరిజనోద్ధరణ కారణంగా ఉండవచ్చు. జాతీయోద్యమ కాలంలో గాంధీగారి సంస్కరణ కార్యక్రమాలలో హరిజనోద్ధరణ ప్రముఖపాత్ర వహించింది. ఈ నేపథ్యపరంగా దళితుల దుర్భర జీవితాన్ని నవలల ద్వారా చిత్రించటానికి ఆనాటి ప్రముఖ నవలా రచయితలు ఎంతోమంది ముందుకువచ్చారు. వారిలో తల్లాప్రగడ సూర్యనారాయణ (హేలావతి – 1913) తొలి దళిత నవలా రచయితగా గుర్తించాం. వీరికి కొనసాగింపుగా వేంకట పార్వతీశ కవుల (మాతృమందిరం – 1918), వేలూరి శివరామశాస్త్రి (ఓబయ్య – 1920), ఉన్నవ లక్ష్మీనారాయణ (మాలపల్లి – 1922) మొదలైన మేటి రచయితలంతా దళితేతరులైనప్పటికీ దళిత నవలలను రచించారు. ఒక దళితుడు తమ దళితుల జీవితాన్ని నేపథ్యంగా చేసుకొని రచించిన నవలే 'నవయుగం', ఈ రకం రచయితల్లో చెప్పుకోవాల్సిన దళిత రచయిత మధురకవి పాలా వెంకట సుబ్బయ్య. ఈయన దళితుడు. తమ దళిత జీవితాన్ని ఇతివృత్తంగా చేసుకొని 'నవయుగం' నవలను రచించాడు.

మధురకవి పాలా వెంకట సుబ్బయ్య నవంబర్ 11,1913లో కడప జిల్లా రైల్వేకోడూరులో జన్మించాడు. క్రీ.శ. 1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసన సభ్యులుగా పనిచేశారు. పద్యకావ్యాలు, నవలలు, నాటకాలు, కథా సంపుటాలు, ఖండకావ్యాలు లాంటివి సుమారు నలభై పై చిలుకు గ్రంథాలను రచించాడు. 'రాజహంస' అనే గ్రంథమాలను స్థాపించి ఈయన రచనలే కాకుండా ఇతరుల రచనలను కూడా ముద్రింపచేసాడు. 'నవయుగం', నవలకు కాస్త ముందూ వెనుకా ఇలాంటి ఇతివృత్తంతోనే ఆదర్శం, బలిపీఠం, నైమిశారణ్యం లాంటి నవలలు, పడిపోతున్న అడ్డుగోడలు లాంటి నాటికలు వచ్చాయి. రాయలసీమ లోకి కడప జిల్లా ప్రాంతంలో కుల వ్యవస్థ, అంటరానితనం పెట్టనిగోడలా ఉండేవని నవయుగం నవల వల్ల తెలుస్తుంది.

మనిషిని మనిషిగా గుర్తించడం మానవత్వం, ఒక జాతి ఉన్న స్థానం నుండి ఒక్క అడుగైనా ముందుకు వేయగలగడం ఆధునికం. మానవత్వంతో ఆధునికతను అందిపుచ్చుకోవడమే మానవజాతికి నవయుగం. కాలాన్ని బట్టి వ్యక్తులు, వ్యక్తులను బట్టి సామాజిక జీవన మనుగడ మారుతూ ఉండడం సహజం. ఏకత్వంలో భిన్నత్వాన్ని సాధించిన భారతదేశంలో కులవ్యవస్థ శాశ్వతంగా వేళ్ళూనుకొని పోయింది. ఇది మనిషికి మనిషికి మధ్య అంతరాలను సృష్టించింది. అస్పృశ్యతకు పాదులుతీసి ఊరు, మాలాడ అనే రెండు విభిన్న తీగలను పెంచి పోషించింది. అన్నదమ్ముల్లాంటి భారతీయ సమాజంలో

వ్యతిరేక పవనాలు బలపడడానికి కారణమయింది. చివరికి 1960 నాటికి ఈ దురాచారం రాయలసీమ చుట్టూ చిక్కుల తీగలాగా అల్లుకొని వుండేది. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన చాలాకాలం వరకు సీమలో కులవ్యవస్థ ఆధిపత్యం కొనసాగుతూనే ఉండేది. ఈ పరిస్థితిని గుర్తించిన మధురకవి పాలా వెంకట సుబ్బయ్య సీమలో కులవ్యవస్థను నిర్మూలించి, సమసమాజాన్ని నిర్మించి కొత్త యుగానికి నాంది పలకాలని 1965లో 'నవయుగం' నవలను రచించాడు. ఆనాడు సీమలో కులవ్యవస్థ అంటరానితనం ఏవిధంగా కొనసాగేవో ఈ నవల ఆధారంగా అర్థమౌతుంది.

కడప జిల్లాలోని మైదుకూరు ప్రాంతం దగ్గరలో మంగాపురమనే ఊరుంది. ఊరి బయట దళితవాడలో వున్న తాతయ్య పెద్ద రైతు సుబ్బారెడ్డి ఇంట్లో వెట్టివాడు. తాతయ్యకు శేఖర్, లక్ష్మి అనే ఇద్దరు పిల్లలు. శేఖర్ చదవడమంటే ఇష్టంలేని సుబ్బారెడ్డి తన కొడుకు రామిరెడ్డికి శేఖర్‌ను పనివాడుగా ఉండాలని తాతయ్యతో అస్తమానం చెబుతూ వుండేవాడు. ఆ ఊరి ఉపాధ్యాయుడు జకరయ్య శేఖర్‌ను నెల్లూరులోని ఉన్నత పాఠశాలలో చేర్పిస్తాడు. సుబ్బారెడ్డికి ఈ విషయం తెలిసి శేఖర్‌ను ఇంటికి రప్పించమని తాతయ్యని బలవంతం చేస్తాడు. తాతయ్య శేఖర్‌కు ఉత్తరం రాస్తాడు. ఉత్తరం చూసిన శేఖర్ వెట్టిచాకిరి బతుకు ఇష్టంలేక బాధపడుతుంటాడు. తిరిగి ఇంటికి వెళ్ళటానికి ఇష్టపడడు. శేఖర్, మిత్రుడు రఘుతో కలిసి ఢిల్లీ పారిపోతూ ఇద్దరూ కలిసి నెల్లూరు వద్దనున్న పెన్నానదిలో దూకి చనిపోయారనే ఉదంతాన్ని సృష్టిస్తారు. ఢిల్లీ చేరి రామారావు అనే పార్లమెంటు సభ్యుడి సహాయంతో చదువుకొంటారు. కాకినాడ నుండి రామచంద్రయ్య కుటుంబం ఢిల్లీకి వస్తారు. డిగ్రీ చదువుతున్న రఘు హరిజనుడని తెలిసినా తన ఇంటి అల్లుడుగా చేసుకోవడానికి రామచంద్రయ్య కాకినాడకు రఘును తీసుకువెళ్తాడు. శేఖర్ బిఏ పూర్తిచేసి సబ్ కలెక్టరు అవుతాడు. పి.యస్.రావుగా పేరు మార్చుకొని ఉద్యోగరీత్యా మంగాపురానికి వస్తాడు. చాలా రోజుల తర్వాత కాకినాడలో ఉన్న రఘు నుంచి వచ్చిన ఉత్తరం అందగానే సంతోషించి శేఖర్ కాకినాడ వెళ్తాడు. రఘు ఇంట్లో తన చెల్లెలు లక్ష్మిని కలుసుకుంటాడు. ''శేఖర్ చనిపోయాడని తెలిసినప్పటినుండి సుబ్బారెడ్డి తాతయ్యను హింసిస్తుంటే తాతయ్య మంగాపురం వదిలి తిరుపతి చేర్తాడు. తిరుపతిలో లక్ష్మి మీద మనసుపడిన రంగడికి తాతయ్యకు గొడవై తలకు దెబ్బతగిలి తాతయ్య చనిపోతాడు. ఆ పరిస్థితుల్లో రఘు దంపతులు తిరుపతికి వస్తారు. అగస్మాత్తుగా ప్రమాదం జరిగి రఘు భార్య వసుంధర ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నప్పుడు లక్ష్మి తన రక్తాన్నిచ్చి వసుంధరను కాపాడుతుంది. అప్పటినుండి రామచంద్రయ్య లక్ష్మిని కాకినాడ తీసుకెళ్ళి అన్నీ తానై చూసుకొంటున్నాడు" ఈ గతాన్నంతా లక్ష్మి తన అన్న శేఖర్‌కు చెబుతుంది. మంగాపురంలోని కులవ్యవస్థను, అంటరానితనాన్ని రూపుమాపడానికి రఘు, రామచంద్రయ్య శేఖర్ మంగాపురం చేరి హరిజనులను ఉద్ధరిస్తారు. మంగాపురాన్ని ఆదర్శ గ్రామంగా తీరుస్తారు.

నవలలో కుల నిర్మూలన కోసం వెంకట సుబ్బయ్య మూడు రకాల కులాంతర వివాహాలను చేయిస్తాడు.

దళితుడైనా రఘు ప్రవర్తనను చూసిన రామచంద్రయ్య తన కూతురు వసుంధరను ఇచ్చి పెళ్ళి చేయడం, ఇది నిస్వార్థమైనది. ఆదర్శవంతమైనది.

అగ్ర కులానికి చెందిన వరదరాజులు శేఖర్ దళితుడని తెలిసి మొదట తన కూతురు మీనాక్షినిచ్చి పెళ్ళి చేయటానికి అంగీకరించడు. కానీ శేఖర్ సబ్ కలెక్టర్ అని తెలిసిన తర్వాత మీనాక్షినిచ్చి పెళ్ళి చేస్తాడు. ఇది స్వార్థంతో కూడిన పెళ్ళి ఇందులో ఆర్థికంగా బలపడడం వల్ల కులంతో పనిలేదనే స్వభావం కనిపిస్తుంది.

శేఖర్ అల్లుడు కావడంతో శేఖర్ చెల్లెలు లక్ష్మిని అదే వరదరాజులు తన కోడలుగా స్వీకరించడం.

ముందుగా పై రెండు కులాంతర వివాహాలు కావడంతో మూడవది పెద్దగా కుల ప్రస్తావనకు రాలేదు. అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంత ఆదర్శభావాలు, ఆధునిక భావజాలాలు సీమలో కొనసాగాలనే చిత్రణ నవలలో దర్శనమిస్తుంది. రామచంద్రయ్య వసుంధరను రఘుకివ్వడానికి సిద్ధపడతాడు. రఘు నేను దళితుడ్ని అని చెప్పి తన నిజాయితీని నిలుపుకుంటాడు. కాకినాడకు చెందిన రామచంద్రయ్య "ఓశ్ అదా! ఏం ఫరవాలేదు. కులాలెవరిక్కావాలోయ్, గుణాలు కావాల్సింది" అని తన ఆదర్శ భావాన్ని వెలిబుచ్చుతాడు. ఇంతలో రామచంద్రయ్య భార్య మాట్లాడుతూ "నాయనా! ఎందుకొచ్చిన కులాలివి? జాతిని నిర్వీర్యం చేయటానికా! మానవుడు కల్పించిన ఈ అడ్డంకులను కూలద్రోసెయ్యాలి" అంటుంది. వయసు మళ్ళిన వీళ్ళలో రచయిత సాంప్రదాయ భావాలను కాకుండా ఆధునిక భావాలను చిత్రించడం విశేషం.

ఆధునిక తరానికి చెందిన వసుంధర రఘును పెళ్ళి చేసుకోవటానికి సిద్ధపడి "హరిజనులైతే దేవుని బిడ్డలే ఇంకేమి,

మీ చుట్టరికం చేత మేము పవిత్రులమవుతాం” అనే అభిప్రాయాన్ని ప్రకటిస్తుంది. ఈ మూడు పాత్రలు కోస్తా ప్రాంతానికి చెందినవే. కులాంతర వివాహాల విషయంలో సీమ వెనుకబాటుతనం శేఖర్ పెళ్ళితో తెలిసిపోతుంది. అంటరానితనం పాటించడంలో సీమ అప్పటికీ కరుడుకట్టిన భావజాలాలతో ఉండినట్లు నవలలో ఈ చిత్రణ ద్వారా తెలుస్తుంది.

రాయలసీమ కడప వాసైన వరదరాజులు తన చుట్టూ వున్న నలుగురితో మాట్లాడుతూ పైకి కులాంతర వివాహాలను సమర్థిస్తాడు. శేఖర్ తన కూతురిని ఇష్టపడ్డాడని తెలిసిన తర్వాత అగ్ర కులానికి చెందిన వరదరాజులు దళితుడైన శేఖర్‌కు తన కూతురిని ఇవ్వటానికి ఒప్పుకోడు. సీమలో కొంతమంది అగ్రకులాల పెద్దమనుషులు అవసరానికి తగిన విధంగా అభ్యుదయ భావాలను ప్రదర్శిస్తుంటారు. అది తనదాకా వచ్చిందంటే వెంటనే సునాయాసంగా తప్పుకొనే ప్రయత్నం చేస్తారు. పరువు ప్రతిష్టలు గుర్తొస్తాయి. ఆధునిక భావాలు అంతలోనే అంతమైపోతాయి. వెంటనే తమ అభిప్రాయాలను మార్చుకొని కులం విషయంలో కఠినంగా మారిపోతారు.

రచయితలకు తన జీవితానుభవం ద్వారా ఎదురైన సమకాలీన పరిస్థితుల దృష్ట్యా వరదరాజుల పాత్రతో కొన్ని సన్నివేశాలను చిత్రించాడు. అప్పుడు కాకినాడకు చెందిన రామచంద్రయ్య కలిగించుకొని “కులాలు మానవుడు కల్పించినవే, భగవంతుడు కల్పించలేదు. మానవులంతా ఒక్కటే. కులాలు భగవంతుడే సృష్టించి వుంటే ఇంగ్లాండు, అమెరికా, జపాను, రష్యా, చైనాలలో కులాలెందుకు లేవు?” అంటూ వరదరాజులుకు జ్ఞానోదయం కలిగిస్తాడు.

రామచంద్రయ్య పాత్రవల్ల రాయలసీమలో కులాంతర వివాహాలు కొనసాగుతాయని రచయిత అభిప్రాయపడ్డాడు. “చదువుకున్న వాళ్ళే సమాజ అభివృద్ధికి పట్టుకొమ్మలు. వీళ్ళంతా కులాంతర వివాహాలకు సిద్ధమైతే ఈ కులవ్యవస్థ నిర్మూలమవుతుంది. చదువు సంస్కారము కలిగినవాళ్ళు కులాంతర వివాహాలకు పూనుకుంటే క్రమంగా అవే పోతై. అప్పుడు ఎవరూ ఎవరినీ నిందింపలేరు” అనే మాటలను రామచంద్రయ్య ద్వారా చెప్పించి సీమలో ఆధునికతను తీసుకొనిరావటానికి ప్రయత్నం చేస్తాడు. మూడవ కులాంతర వివాహం లక్ష్మీ వరదరాజులు కొడుకు ప్రసన్నవదనంది. నవలలో లక్ష్మి సాహితీవేత్తగా, సంగీతకారిణిగా కనిపిస్తుంది. తక్కువ కాలంలో ఎక్కువ ప్రతిభను సంపాదిస్తుంది. 1965 ప్రాంతంలో స్త్రీ ఆధునిక సమాజంలో నూతన ఒరవడికి దారులు వెతుకుతున్న తొలి ప్రయత్నంగా లక్ష్మీ పాత్ర కనిపిస్తుంది. లక్ష్మీ పాత్రతో స్త్రీ ప్రతిభకు పెద్దపీట వేశాడు మధురకవి పాలా వెంకయ్య.

నవయుగం నవలలో కులనిర్మూలనతో పాటు గ్రామోద్ధరణ, దళితోద్ధరణలు కూడా చిత్రింపబడ్డాయి. రాయలసీమ ప్రాంతంలో దళితోద్ధరణ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండేది. 1960-65 మధ్యకాలంలో అగ్రకులాల వాళ్ళు దళితులను తమకు బానిసలుగా చేసుకొని, వారిచేత వెట్టిచాకిరీ చేయించుకుంటూ, వారిని అతినీచంగా చూసారన్న వాస్తవాలను ఈ నవల వెల్లడిచేస్తుంది. స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగం అమలులోకి వచ్చి సంవత్సరాలైనా సీమలో దళితులపై కొనసాగుతున్న హింసాకాండపై ఎలాంటి మార్పు రాలేనది చెప్పటానికి ‘నవయుగం’ నవల ఒక ఆధారంగా నిలుస్తుంది.

శేఖర్ చిన్నప్పుడు తాతయ్య తరానికి, శేఖర్ తరానికి రచయిత చాలా వ్యత్యాసాన్ని చూపించాడు. తాతయ్య కాలంలో రైతులు దళితులను అవమానించినా, హింసించినా దళితులు వారిని ఎదిరించలేక గమ్మునుండేవాళ్ళు. మంగాపురంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జకరయ్య నెల్లూరు వాసి. ఈయన దళితులను ఉద్దేశించి “స్వరాజ్యమొచ్చింది, స్వేచ్ఛగా బ్రతకటానికి ప్రతివానికి హక్కుంది. బ్రతుకంతా బండచాకిరి చేస్తూ రైతుల పెట్టుపోతలపై ఆధారపడటం మానవత్వం కాదు” అంటూ ప్రతిరోజూ సాయంత్రంవేళ దళితవాడలో దళితులను సమావేశపరచి దళితుల మార్పుకోసం ప్రయత్నం చేసేవాడు. అయినా మంగాపుర దళితులలో ఈశమంత మార్పుకూడా రాదు. పైగా ఊరి రైతులంతా కలిసి దళితుల అభ్యుదయాన్ని కోరుకునే జకరయ్యను తన్ని తరిమేస్తుంటే కిక్కురుమనకుండా కొయ్యబొమ్మల్లా చూస్తూ ఉంటారు దళితులంతా.

మార్పును కోరుకునే జకరయ్య పాత్రను కూడా రచయిత సీమ బయటి ప్రాంతం నుంచే గ్రహించడం ఆలోచించవలసిన విషయం. శేఖర్ డిప్యూటీ కలెక్టర్‌గా మంగాపురానికి వచ్చిన తర్వాత దళితులలో తిరుగుబాటు ధోరణి కనిపిస్తుంది. దళితులకు, రైతులకు గొడవలు అవటం, శేఖర్ డిప్యూటీ కలెక్టర్‌గా వాటికి పరిష్కారాల మార్పులను చూపడం ద్వారా

రచయిత నవలలో మార్పును చూపిస్తాడు.

అప్పుడప్పుడే పెద్ద పెద్ద చదువులు చదువుకొంటున్న దళితులు వాళ్ళ జాతి ఉద్ధరణ కోసం పాటుపడడం నవలలో కనపడుతుంది. చదువుకున్న శేఖర్, రఘులు మంగాపురం దళితులను ఉద్ధరించడానికి కాకినాడ నుంచి సీమకు వస్తారు. లోతుగా ఆలోచిస్తే సీమ దళితులను ఉద్ధరించాలనే ఆలోచనకు కాకినాడలో బీజం పడుతుంది. ''కడప జిల్లాలో ప్రొద్దుటూరుందట. దానికి సమీపంలో మంగాపురమనే గ్రామముందట. అక్కడుండే రైతులు మూర్ఖులై హరిజనులను హింసిస్తున్నారట. అందుకని మనం పోయి హరిజనసేవ చేయటానికి పూనుకోవాలి'' అంటూ రామచంద్రయ్య కుటుంబం, రఘు శేఖర్‌లు కలసి కాకినాడ నుంచి మంగాపురానికి వస్తారు.

తూర్పుగోదావరి నుంచి వచ్చిన రఘు ఆ ప్రాంతంలోని ఆధునిక లక్షణాలను అవగాహన చేసుకొని, రాజ్యాంగంలోని విశేషాలను తెలుసుకుని మంగాపురంలోని దళితుల్లో మార్పును తీసుకొనిరావాలని ప్రయత్నం చేస్తాడు. మంగాపురం దళితులకు రాజ్యాంగంలోని విషయాలను గూర్చి వివరిస్తూ "మన రాజ్యాంగ శాసనంలో అంటరానితనాన్ని కొట్టేశారు. అంటరానితనాన్ని ఏ విధంగాను అమలుచేయరాదు. పబ్లిక్ చావులు, దేవాలయాలు, పబ్లిక్ రాస్తాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, హోటల్లు, వగైరాలలోనికి హరిజనులను రానివ్వకపోతే ఆరు నెలల శిక్ష, అయిదు వందల రూపాయల జరిమానా కోర్టులు విధిస్తాయి" అన్న రాజ్యాంగ వాస్తవాలను దళితులకు వివరిస్తాడు.

దళితులపట్ల  అసభ్యకరంగా ప్రవర్తించరాదని, వారిని అంటరానితనంతో అవమానించరాదని, అలాంటి మనస్తత్వాన్ని మార్చుకోవాలని మంగాపురం రైతులను హెచ్చరిస్తాడు. ఇక్కడ రఘు పాత్రలో వెంకట సుబ్బయ్య దర్శనమిస్తారు. ఒక దళితునిగా తాను అనుభవించిన జీవితం నుంచి వచ్చిన మాటలుగా మనకు అనిపిస్తాయి.

రాష్ట్ర శాసనసభ సభ్యులుగా పనిచేసిన వ్యక్తిగా కాకుండా, సామాన్య దళితునిగా మారి దళితులవైపు నిలబడి దళితులను గౌరవించకపోయినా పరవాలేదు, కనీసం వాళ్ళని మనుషులుగానైనా చూడండని వాపోవడం లాంటి ధోరణి మనకు ఈ నవలలో కనిపిస్తుంది. సంస్కర్త హృదయంతో కాకినాడ నుంచి వచ్చిన రఘు, రామిరెడ్డి లాంటి తదితర రైతుల ముందు నిల్చుని, దళితుల పక్షంవైపు నిలబడి తిరుగుబాటు ధోరణితో తమ హక్కుల గురించి, చట్టరీత్యా తనకందవలసిన అధికారాల గురించి మాట్లాడతాడు. ఆ కాలంలో సీమలో ఇలాంటివి సర్వసాధారణం. వాస్తవంగానైతే పల్లెల్లో ఇలా ఎదురుతిరిగిన దళితులపై రైతులు తమ కులపోల్లను కూడగట్టుకొని ప్రాణం పోయేలా చావకొట్టినా దళితులకు దిక్కుండదు. ఇది అన్యాయమని దళితులవైపు నిలబడి అడిగే నాధుడుండడు. అందుకే రచయిత ఆ కాలానికి ఇటువంటి సంఘటనలను నవలలో అక్కడక్కడా చిత్రించాల్సి వచ్చింది. మరో కోణంలో శేఖర్ పాత్రలో దర్శనమిస్తూ సమాజంపై బాధ్యతగల వ్యక్తిగా ''హరిజనోద్ధరణకు అడ్డుపడేవారిని, అవమానించే వారిని చట్టమే శిక్షిస్తుంది" అని చెబుతాడు. మార్పు అనేది  సమాజంలోని అన్ని వర్గాలలో రావాలి. ముఖ్యంగా రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను అనుభవించే తత్వం అందరిలో కలసి రావాలి. అప్పుడే కుల నిర్మూలన, దళితోద్ధరణ జరుగుతుందని రచయిత నవల ద్వారా అభిప్రాయపడతాడు.

అజ్ఞానులు, పుట్టుబానిసలు అని అవమానించి అణగద్రొక్కబడిన దళితులకు కూడా అవకాశాలు అందిస్తే అద్భుతాలు సాధిస్తారని నిరూపించిన దళిత నవల "నవయుగం". ఈ నవలలో శేఖర్ ప్రభుత్వ అధికారిగా, రఘు సంస్కర్తగా, లక్ష్మి విద్యావేత్తగా కనిపిస్తారు. ఈ పాత్రలతో దళితులలో కూడా గొప్ప వ్యక్తులుంటారని రచయిత పేర్కొన్నాడు. దేశం అభివృద్ధి చెందాలంటే ఇతరులతోపాటు దళితులు సేవ కూడా దేశానికి అత్యంత అవసరమని, దేశంలోని ప్రజలంతా అన్నదమ్ముల్లా కలసిమెలసి జీవించాలని కోరుకుంటాడు రచయిత. ఆధునిక భావాలతో  ముందుకు నడుస్తూ మనుషులుగా పుట్టిన మన మధ్య కట్టిన ఈ కులాల అడ్డుగోడల్ని కూల్చివేసి, సమసమాజ నిర్మాణానికి పాటుపడి నవయుగానికి నాంది పలకాలనే ఆశయంతో రచయిత 'నవయుగం' నవలను రచించాడు. ఒక దళితుడిగా ఈ దళిత నవలను రాయడంతో ఇందులోని సన్నివేశాలు, పాత్రలు సజీవంగా మనకు దర్శనమిస్తాయి. దళితుల జీవితంలో మార్పు రావాలని, దళితులు తమ హక్కులకోసం తామే పోరాడాలని ఎంతో గొప్పగా కోరుకున్న మధురకవి పాలా వెంకట సుబ్బయ్యను 'నవయుగం' దళిత నవల ద్వారా తెలుగులో తొలితరం దళిత నవలా రచయితగా నిలిచిపోతారు. ♦



# మట్టి దీపాలు

- డా॥ ఉదారి నారాయణ
9441413666

రంగు రంగుల కలలు కంటూ
యవ్వనపు తీగపై నడుస్తున్న
నునులేత ఆశయాల అడుగులు వీళ్లు

కనబడేవన్నీ పాలని
రాళ్లన్నీ పూలని నమ్మే
కొత్తలోకపు బాటసారులు వీళ్లు
ఒకరు తమ్ముళ్ని చెల్లెల్ని సాదే తల్లి
సంసారాన్ని సవరించే తండ్రి

అరిగిపోయిన భుజాల పిల్లతల్లులు వీళ్లు
కరిగిపోయిన ఆశల పిల్లతండ్రులు వీళ్లు

సంసార సాగరాన్ని ఈదడంలో
వీర విజేతలు వీళ్లు

నిద్రలేని కండ్లతో
ఇంటింటికి పత్రికల
పావురాళ్లని పంచె
దినసరి జీవులు వీళ్లు

ఇంద్రధనస్సులాంటి పదహారేళ్లని
పడుచుదనపు ఉల్లాసాన్ని
వయసుతీరా పంపుకోనివ్వండ్రి
సామాజిక చరిత్రపుటల్లో
ఉద్యమ వీరుల ఆనవాళ్లను
వెతుక్కోనివ్వండ్రి

ఎంగిలి కప్పుల్ని కన్నీళ్లతో కడిగే
చిల్లులపై కప్పుల ఇంటిబిడ్డలు వీళ్లు
చేనుతో చెట్టుతో పిట్టతో
గుస గుసలాడుతూ
పదం కలిపి పాడుతున్న
మట్టిపాదాలు వీళ్లు
పట్టణ నగిషీల నవ్వులు
చూడాలనుకుంటున్నారు
అంతస్తు మెరుపుల మర్మమేమిటో
చదవాలనుకుంటున్నారు

వీళ్లే మన ఎ టిఎంలు, ప్రాణవాయువులు
వీళ్లే మన జీవిత జీవకణాలు
వీళ్లే మన కాన్వెంటు టైలు
షూసుల లేసులు...
వీళ్లే నుంచే మరో అబ్దుల్‌కలామ్
రాకెట్ లాంచ్ చేస్తాడేమో
వీళ్ల నుంచే మరో అంబేద్కర్
చివరిగుడిసెల దుఃఖాన్ని కడిగేస్తాడేమో!
వీళ్లకి ఒక వెన్నెల లాంతరునందించండ్రి ♦

---

# గీతామృతం

- అల్లూరి గౌరీలక్ష్మి
9948392357



బతుకు బెంజ్ కార్లో కూర్చున్నంత సౌఖ్యంగా ఉండదు
ఒంటెద్దు బండిలో సాగే గతుకుల దారిలా ఉంటుంది
సంసారం సూపర్ మార్కెటంత సొగసుగా ఉండదు
కిరాణా కొట్టంత గజి బిజి గందరగోళంగా ఉంటుంది
లైఫ్ పార్టనర్స్ సేల్స్ మేనేజర్సులా సౌమ్యంగా ఉండరు
రైల్వే కౌంటర్‌లో ఉద్యోగుల్లా ఉదాసీనంగా ఉంటారు
ఇంటి సమస్యలు మాష్టారి లెక్కల్లా టక్కున తెగవు
అసలు ప్రశ్నలేంటో అర్థం కాని చిక్కుముడిగా ఉంటాయి
ఉద్యోగమంటే ఫస్ట్ మార్క్ తెచ్చుకున్నంత సులువు కాదు
నవరసాలనభియిస్తూ రంగ స్థలంపై చేసే ఏకపాత్రాభినయం
మిత్రులంటే స్నేహం సినిమాలా త్యాగాల తంపట కాదు
నేస్తపు జూదంలో అసలు గ్యారంటీ లేని పెట్టుబడి
చిత్రకారుడు కుదురుగా వేసిన చిత్రం కాదు జీవితం
సరిగమలు నేర్చుకుంటూ ఆడిటోరియంలో చేసే గాన కచేరి
క్లాస్ పుస్తకాలు నేర్పేది సబ్జెక్టుల విషయ పరిజ్ఞానం
మనుగడ చదువు నేర్పేది జీవించగలిగే లోక జ్ఞానం
జీవిత తాత్పర్యంగా చెప్పింది భగవత్ గీతామృతం
మనిషి తాను జీవించి పంచేది అనుభవ గీతామృతం
అది సృష్టి చక్రపు తర తరాల కఠిన తాత్వికత
ఇది కఠోర వాస్తవాల నేటి కాలపు వడపోత ♦



# నా బాల్యమే నా జీవితనౌకకు తెరచాప

- డా॥ శాంతినారాయణ

ఇంటర్వ్యూ: విజయ్
9490122229

**మీ బాల్యం .....**

♦ నా బాల్యమంతా కష్టాలు కడగండ్లతో గడిచింది. కష్టాల కడలిపై సాగిన నా బాల్యమే నా జీవితానౌకకు ఒక తెరచాపగా నిలిచింది. మాది సింగనమల తాలుకాలోని బండమీదపల్లె. అమ్మ కేశమ్మ. నాన్న వెంకటస్వామి. మాది అత్యంత నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబం. అమ్మానాన్నలు చదువుకు నోచుకోలేదు. చదువుకోవడానికి కూడా స్తోమత లేని కుటుంబం. నా పుట్టిన తేదీ కూడా సరిగా నమోదుకాలే. రికార్డుల ప్రకారం 01-07-1946. మా ఇంట్లో నేనే పెద్దోన్ని. నాకు నలుగురు చెల్లెళ్ళు. ఇద్దరు తమ్ముళ్ళు. వాళ్ళందరికీ నేనే పెళ్ళిళ్ళు చేసినాను.

సన్నకారు రైతుల దగ్గర ఒకటిరెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని దాంట్లో కష్టపడి పండించిన పంటతో సంవత్సరం పాటు జీవించాల్సి వచ్చేది. అది చాలక తమలపాకులు బుట్టలో తీసుకుపోయి అమ్మి జీవించేవాళ్ళం. నేను కూడా చిన్నప్పట్నించి తమల పాకులు అమ్మడానికి పోతావుంటి. మాకు రెండు దున్నపోతులు వుండేవి. వాటికి గడ్డికావాల. ఆ గడ్డికోసం మాపల్లెకు దగ్గరలో శింగనమల (శృంగనమల, శింగనమల అయింది) కొండకు పోయి గడ్డికోసుకుని వచ్చేవాన్ని. ఐదోతరగతి అయిపోయేటప్పుడు మా పరిస్థితి చూసి చలించిపోయి మా టీచరు మదనగోపాల్‌సారు శింగనమలో హైస్కూలు హెడ్‌మాస్టరుగా ఉన్న చిత్తరంజన్‌దాస్ సారును కలుసుకోమన్నాడు. మదనగోపాల్‌సారు మాకు దూరపు బందువుకూడా. హెడ్‌మాస్టరు చిత్తరంజన్‌దాస్‌సారు సాయం మరువలేనిది.

ఒక పక్క కూలీకి పోతూ చదువుసాగించినాను. ఎప్పుడు అవసరమైతే అప్పుడు మా హెడ్‌మాస్టరు సారు ఇంటికి పోతే వాళ్ళ ఇంట్లో ఉన్నది మాకు పెట్టేవాళ్ళు. నేను తినేసి వచ్చేసేవాన్ని. 1962-63లో భయంకరమైన కరువు వచ్చింది. శింగనమల చెరువులో కూడా నీళ్ళు లేవు. కరువులో పాపంచి, ఈత గడ్డలు తినేవాళ్ళం. భయంకర గడ్డుకాలం అది ఒక కఠోర జీవితం. కడపలో ప్రొద్దుటూరులో కెసికెనాల్ కాలువ పనులకు మా అమ్మానాన్న వలసపోయినారు. దాంతో మా నాయన పిన్నమ్మ, ఆ పిన్నమ్మ కొడుకు (చిన్నాయన) ఊర్లో వుండిపోయినారు. మా చిన్నాయనకు రెండు కాళ్ళులేవు. వాళ్ళు పూర్ణకుడాలు, కర్జికాయలు తయారుచేసి అమ్మేవారు. జయరాంపల్లె, నార్పల, నార్పల చుట్టుపక్కల పల్లెలకు పోయి అవి అమ్ముకొని వచ్చేవాళ్ళం. మాకు ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షలకు అనంతపురంలో సెంటరు వేసినారు. అవి 11రోజుల పరీక్షలు. మాకు అనంతపురంలో బంధువులు ఎవరూ లేరు. లాడ్జీల్లో వుండే స్తోమత లేదు. మా నాన్న పిన్నమ్మ (చిన్నవ్వ) ఆమె కొడుకు (చిన్నాయన), నేను అనంతపురంలో పవర్ ఆఫీసు గోడకు గోతం పట్టలతో ఒక చిన్న డేరా కట్టుకుని గుంతపొంగనాలు, దోసెలు చేసుకుని తిని వీధిలైట్ల కింద చదువుకున్నాను. అదొక భయంకర అనుభవం. పరీక్షలయినాక మా చిన్నవ్వతో కలిసి నేను మాచిన్నాయనను భుజాన ఎక్కించుకొని ఒక గంప నెత్తిన పెట్టుకొని దంతులూరు, నీలంపల్లె, ఆకుతేడు, కరుట్లపల్లె, ఇల్లూరు ఇలా

అన్ని పల్లెల్లో పూర్ణకుడాలు, కర్జికాయలు అమ్ముకుంటూ పోయేవాళ్ళం. ఇల్లూరులో నాతోపాటు ఎస్.ఎస్.ఎల్.సి పరీక్షలు రాసిన సత్యనారాయణరెడ్డితో కలిసినాను. అతనిది ఆ వూరే. ఇప్పుడు ఆయన ఎస్.సిగా రిటైర్ అయినాడు. అక్కడ వాళ్ళకు నీళ్ళు పారతాయి. అక్కడ వరిమళ్ళు కోతలు జరుగుతూవుండేవి. వాళ్ళింటిపక్కన వుండే పీర్లచావిడిలో దిగి అక్కడే వుండేవాళ్ళం. కర్జికాయలు, కుడాలు చేసుకొని మళ్ళలో పనిచేసే కూలీలకు, రైతులకు అమ్ముతాంటిమి. అప్పుడు వస్తుమార్పిడి ఉండేది. వడ్ల గింజలు ఇచ్చేవారు. నేను రాత్రిపూట ఆ వూర్లో వుండే రాధాకృష్ణ ఆయిల్‌మిల్లులో పని చేసేవాన్ని కూలీ 2.5 రూపాయలు ఇచ్చేవారు. ఆ డబ్బుల్తోనే ఫ్యాంటు, చొక్కా కొనుక్కున్నా. అప్పట్లో ఫ్యాంటు తొడుక్కోవాలని నాకొక కలగా వుండింది. ఆయిల్ మిల్లులో పనిచేసేటప్పుడు ఒకసారి ఆయిల్ గుంతలో పడినాను. అది మోకాలులోతు ఉండింది. మరోసారి ఆయిల్ చిట్లి మీదపడింది. బొబ్బలు వచ్చినాయి.

ఎస్.ఎస్.ఎల్.సి రిజల్ట్స్ వచ్చినాయి. పాసైనాను. కొన్నాళ్ళు అనంతపురంలో గుల్జార్‌పేటలో ఇబ్రహీందాస్‌తో పాటు ఒక గుడిసెలో వుండేవాన్ని. ఆ గుడిసె రూ.50/–లు బాడుగ. ఇంతలో ఆదోనిలో ఉద్యోగం వచ్చింది.

మాతాత పేరు సొంటి దాసప్ప. ఇంటిపేరును మా హెడ్‌మాస్టరు ఇంగ్లీషులో రాసేటప్పుడు **'Sonti', 'Santi'** లాగా రాసేవాడు. నేను నా ఇంటిపేరు శాంతి అయితే బాగుందని నా పేరును శాంతిగా మార్చుకున్నాను.

***మీ ఉన్నత విద్యావిశేషాలు ....***

♦ మలేరియా డిపార్టుమెంటులో ఉద్యోగం వచ్చింది. కొన్నాళ్లు ఆదోనిలో పనిచేసినాను. కాని నాకు అది నచ్చలేదు. చిత్తరంజన్ దాస్ సారు నన్ను ఓరియంటల్ కళాశాలలో తిరుపతిలో చదవడానికి పంపించినారు. అక్కడ చేరినాక సాహిత్యం అధ్యయనం చేసినాను. చందో పద్యాలు, అవధానం చేయడం నేర్చుకున్నాను. అవి గొప్పవని ఆ రోజుల్లో ఒక భ్రమగా ఉండేది. నాగ సిద్ధారెడ్డి, త్రిపురనేని మాకు క్లాసులకు వచ్చి చెప్పేవారు. వారి ప్రభావంతో నేను మారిపోయినాను. 1969లో విద్వాన్ పూర్తి చేసినాను. టీచరుగా నాకు సింగనమల స్కూలులోనే అపాయింట్‌మెంటు వచ్చింది. మా హెడ్మాస్టరు చిత్తరంజన్‌దాస్ దగ్గరే నేను టీచరుగా చేరినాను.

***సాహిత్యంలోకి ప్రవేశం ఎలా జరిగింది..***

♦ 1973లో విమలగారితో నా వివాహం జరిగింది. ఆమె కూడా రాయదుర్గంలో టీచరుగా పనిచేసేది. అప్పట్లో మాత్రా చంధస్సులో గేయాలు రాసేవాడిని. అవధానాలు చేసేవాడిని. ఒకసారి ఆశావాదిగారు నన్ను ఆయన పనిచేసే స్కూలుకు పిలిపించి అవధానం చేయించినారు. కొలుకలూరి ఇనాక్, రామచంద్రయ్య, గాడేపల్లి కుక్కుటేశ్వరరావు మొదలైన కవుల సమావేశాలకు హాజరయ్యేవాడిని. సినారే సాహిత్యాన్ని అధ్యయనం చేసినాను. మొదట్లో ప్రేమకథలు రాసినాను. 1972లో రక్తపుముద్ద పిలిచింది కథాసంపుటి వేసినాను. 1976లో రాయదుర్గంలో వుండగా చైతన్య భారతిని స్థాపించాము. కంబదూరి షేక్ నబీ రసూల్, కె. జగదీష్, కాటం గోవిందప్ప నేను కలిసి జాతీయ కవి సమ్మేళనం జరిపాము. 1976లో నడిరేయి నగరం కవితా సంపుటి వేసినాను. ఇది గేయ సంపుటి. 1976లో రాస్తా కథల సంపుటి తీసుకొచ్చాను. 1978 నాటికి నాలో మార్పు వచ్చింది. అవధానానికి స్వస్తి పలికినాను. అది సర్కస్ ఫైట్ లాంటిదని నాకు అర్థమైంది. నా భావజాలంలో మార్పు వచ్చింది. 1980లో మాధురి అనే ప్రేమ నవల రాసినాను.

సింగమనేనిగారి జూదం కథాసంపుటి నన్ను ప్రభావితం చేసింది. దాంతో 1985లో నేను రాసిన దళారి కథ ఆంధ్రప్రభలో అచ్చుఅయింది. 1999లో పల్లేరు ముల్లు కథాసంపుటి రాసినాను. 2000లో పెన్నేటి మలుపులు నవల రాసినాను. తెలుగు దేశం అధికారంలోకి వచ్చినాక వచ్చిన మార్పులను ఇందులో ప్రస్తావించాను. 2000 నుండి 2004వరకు కాలం కథలు వార్తలో మాండలికంలో రాసినాను. అవి 2004లో నాగలికట్ట సుద్దులుగా వచ్చింది. నమ్ముకున్న రాజ్యం కథల సంపుటి 2004లో వచ్చింది.

2003–2004లో కరువు విపరీతంగా ఉండింది. ఆత్మహత్యలు పెరిగినాయి. రైతు ఆత్మ హత్యల నివారణాయాత్ర జిల్లా రచయితల సంఘం తరుపున చేసినాము. ఇనుప గజ్జల తల్లి కథల సంపుటి వేసినాము. 2014లో కొండచిలువ కథల సంపుటిని, 2017లో బతుకుబండి కథల సంపుటి, కొత్త అక్షరాలమై కవితా సంపుటిని తీసుకొచ్చాను.

***ప్రస్తుత సాహిత్య ధోరణులపై మీ అభిప్రాయం...***

♦ ఉద్యమాల ద్వారా సాహిత్యం వచ్చింది. చుండూరు, పాదిరికుప్పం, కారంచేడులో దళితులపై జరిగిన సంఘటనల ద్వారా దళిత సాహిత్యం వచ్చింది. అంటరానివసంతం, పంచమం, ఉక్కుపాదం, నిప్పులవాగు, ఎదురగ్గి, అద్దంలో చందమామ ఇవన్నీ దళిత సాహిత్యాన్ని ప్రతిబింబించే నవలలు. బహుజన చైతన్యం వచ్చాక వృత్తుల కథలు వచ్చాయి.

## కవిత

# వాడు నా తమ్ముడు

- కెంగార మోహన్
9493375447

**నా** *గుండెల్ని చీల్చుకుని పుట్టినవాడు*
*ప్రేమించడం మాత్రమే తెలిసినవాడు*
*వాణ్ణేరాకాసి అలలు ఎత్తుకుపోయి*
*ఏడేడు సముద్రాలకవతల విసిరెయ్యలేదు*
*పల్లకిలో ఎత్తుకెళ్ళడానికి*
*వాడేమి ఆధిపత్యకులంలో పుట్టలేదు*
*ఈ దేశం గూర్చి తెలియనివాడు*
*కులోన్మాదుల రాజ్యమని తెలుసుకోలేనివాడు*
*శంభూకుడిలా భూమిపై తన రుధిరధారను తడిపిన వాడు*
*పద్మవ్యూహంలోకి  వెళ్ళడం మాత్రమే తెలిసినవాడు*
*నిష్కల్మష 'ప్రణయ'నాదానికి అగ్రవర్ణ నాగుపాములు*
*నటించి, నర్తించి కాటేస్తాయని తెలియని వాడు*
*ఇప్పుడు చెప్పండ్రా కులం లేదని*
*ఎవడ్రా మనువు లేదన్నది*
*మెడపై పడ్డ వేట కొడవలి పిడికిట్లో లేదా?*
*ఒరేయ్ తమ్ముడూ! నీతో మాట్లాడాలని ఉందిరా..*
*ఎక్కడని వెతకను..?*
*అనంత వాయువుల్లో వాణ్ణి కలిపేశారని తెలిసినా*



*వాడిక్కడే ఉన్నాడనిపిస్తోంది*
*వాణ్ణి మనింటికి మనం తెచ్చుకుందాం రండి*
*వాడెక్కడున్నాడంటారా..*
*కన్నీటి చుక్కల్లో కనిపించే ప్రతిబింబం వాడిదే..*
*(ప్రణయ్ స్మృతిలో..)* ♦

---

చిక్కనవుతున్న పాట వచ్చింది.  కుర్చీ నాటకం ప్రస్తుతం సాంస్కృతిక శాఖలో డైరెక్టరుగా పని చేస్తున్న విజయ భాస్కర్ అప్పట్లోనే రాసినారు.

***మాండలికంపై మీ అభిప్రాయం...***

♦ పాత్రోచిత సంభాషణల్లో మాండలికం తప్పనిసరిగా రాయాలి.

***మీ ప్రాపంచిక దృక్పథం...***

♦ శ్రమములోన బుట్టు సర్వంబు తానౌను అని వేమన చెప్పిన శ్రమను నమ్ముతాను.  శ్రమే సమాజానికి మూలం. హేతువాదాన్ని, భౌతిక వాదాన్ని నమ్ముతాను.  ఏ రచనైనా వాస్తవికతకు దగ్గరగా ఉండాలి. తప్పనిసరిగా కళాత్మకత జోడించాలి. సమాజాన్ని పరిశీలించడం ద్వారానే నేను మారినాను. నేను నాస్తికున్ని . నా జీవితపు అనుభవాల ద్వారానే నేను పరివర్తన చెందినాను. అలాంటి వాళ్ళు హేతుబద్ధంగా ఉంటారు.  మనిషికి హేతుబద్ధత చాలా ముఖ్యం. నేను హేతుబద్ధంగా ఉంటాను.

***మీరు పలు పురస్కారాలు అందుకున్నారు.అలాగే మీ ట్రస్టు ద్వారా పురస్కారాలు కూడా అందిస్తున్నారు...***

♦ విమలా శాంతి సాహిత్య సామాజిక సమితిని ఏర్పాటు చేసి సమాజం కోసం, సాహిత్యం కోసం కృషి చేసేవారిని సన్మానించడం చేస్తున్నాను.  సాహితీ సృజన చేస్తున్న వారి కథలకు, కవిత్వానికి ప్రతి సంవత్సరం ఒక బహుమతిని పురస్కారాన్ని అందిస్తున్నాను.

***భవిష్యత్ రచనలు...***

♦ వెట్టికి వెట్టి ఒక దళిత అస్తిత్వ నవల, సిరివరం మీట్ మార్కెట్ ఒక బహుజన అస్తిత్వ నవలిక, రక్షక తడులు ఒక ప్రాంతీయ అస్తిత్వ నవలిక ఇవన్నీ 2018లోపే తీసుకొస్తాను.

***కొత్తగా రాస్తున్న యువతకు మీ సందేశం...***

♦ యువతరం నిలకడగా ఆదునిక సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి.  సాహిత్యంలో సమాజంలో వస్తున్న పరిణామాల్ని క్షుణ్ణంగా నిశితంగా పరిశీలన చేస్తూ ఏదిరాసినా సమాజానికి ఉపయోగపడేలా రాయాలి.  హేతుబద్ధంగా పదిమందినీ ఆలోచింపజేస్తూ రచనలు చేయాలి. అభివృద్ధిలో ఆధునికత వ్యక్తం కావాలి.  సమాజంలో జరిగే సంఘటల్ని కథావస్తువుగా మలిచే నైపుణ్యం పెంపొందించుకోవాలి.  వీటిని నిత్య లక్షణాలతో సమాజ హితం కోసం సృజన చేయాలి.♦

## కవిత

# తెల్లకాగితం!

- దార్ల వెంకటేశ్వరరావు
9182685231

ఎన్నాళ్ళిలా రాతలున్నా
అక్షరాల్లేనట్లుండే కాగితమలా నరాల్లో
నేరాల్ని దాచుకుని శ్వేతపత్రంలా మెరుస్తుంది?
ఎన్నాళ్ళిలా మొలిచిన కొమ్ములకు
దేవతా వస్త్రాల్ని కప్పుకొని
ఆ అడవిదున్నలా చేనంతా ధ్వంసం చేస్తుంది?
నాకిప్పుడు తెల్లకాగితాన్ని చూసినా
నల్లక్షరాల్ని చెరిపిన గుర్తులో...
ఎవరన్నా మిస్టర్ క్లీన్ నంటుంటే
క్లీన్ కాలేని మరకలో...
ఎవర్నన్నా కరడుగట్టిన నేరస్తుడంటున్నా
కళ్ళల్లో దీనత్వమో ...
వంతెనల్ని దాటికెళ్ళేముందు
గొంతులో గింగర్లు కొడుతున్న శబ్దాలు!
పోలీస్ స్టేషన్ ముందు ఎముకను నాక్కుంటూ
సొల్లు కారుస్తున్న కుక్కల అరుపులేంటిలా
పొద్దున్నే వాటిల్లోకి యెగిరొచ్చి
ఇళ్ళంతా ఖరాబు చేస్తున్నాయి?



ఆ అరుపుల్ని అర్థం చేసుకోవాలంటే
యే ఇన్వెస్టిగేషన్ కంపెనీలో
కొనాలో నిఘంటువుల్ని!
ఏకాంతపు ఒంటరితనమైనా
ఒంటరితనపు సమూహమైనా
భరించడమంత సులభం కాదేమో!
'ఆపండ్రా బాబూ'
పొద్దున్నే ఆ ఇడియట్ బాక్స్ ఏమిట్రా
జుర్రుజుర్రున పీల్చే
ఎముకల రుచుల్ని వినలేకపోతున్నాను!
అవతలకిసిరేయండ్రా
సంతోషాన్నో, దుఃఖాన్నో పలకని
తెల్లకాగితాల్ని చూడలేకపోతున్నాను! ♦

---

# నువ్వే ఓ మహాత్ముడివి

- మాధవి పిన్నమనేని

వేకువనే నువ్వు స్వేచ్ఛగా ఎగిరే విహంగానివి
మధ్యాన్నం నువ్వు పంజరాన బంధించినట్లు
వృత్తిచట్రంలో బంధితుడివి..
సాయంత్రాలలో నీవు సీతాకోకల వర్ణమద్దుకున్న సుకుమారుడివి
రాత్రుళ్ళు రగిలే నిప్పువి, ఆంక్షలు విదుల్చుకున్న ఆనందానివి
ఎగసే అలవి,ఉబికే లావావి,నడిసంద్రంలో సునామీవి....
ఉదయ, మధ్యాన్న, సాయంత్రాలలో పడ్డ ఒత్తిడిని వదలలేక
వాటిలో ఒదగలేక ఒక్కసారే పేలే అగ్ని పర్వతానివి....

ఎవరంటే ఏం చెప్పాలి
ఉదయ, మధ్యాన్న, సాయంత్రాలలో ఒదిగిపోతే మామూలు
మనిషివి
ఒదగలేక ఒత్తిడి పడి, ఆలోచనలు రగుల్చుకొని ముందడుగేస్తే
నువ్వే ఓ మహా మనిషివి,
ఉదయాలను రోజంతా చల్లుకుంటే ఓ కవివి
మధ్యాన్నాలను నీలోఒంపుకుంటే గానుగ చుట్టూ తిరిగే ఎద్దువి
సాయంత్రాలను ఆసాంతం పరచుకుంటే ఓ ప్రేమికుడివి
రాత్రుళ్ళు మాత్రం రాసుకుంటే ఓ కాముకుడివి
అన్నీ కలిసినా ఆలోచనా, ఆచరణ లేక రగిలితే ఈ లోకంలో



ఇమడలేక కుమిలే, మార్పు కోరుకున్నా మారలేని
దిశా రహిత నిశాచరివి....

ఎం కావాలని రాసుందో నా నుదుటన అని
ఎదురుచూడకుండా
నిమిత్త మాత్రుడులా నిలవకుండా...
కాలం తీర్పు కోసం కలబడక
ఏది ఎంత పాళ్లలో కావాలో అలా రంగరించుకుని
నిన్ను నువ్వు మలుచుకుంటే..
నువ్వే ఓ మహాత్ముడివి... మదర్ థెరిస్సావి ♦




# పాపం పసివాడు

పత్తి సుమతి - 8790499405

"నన్ను విక్టిమ్"ని చేశారు. నేను బయటికి వెళ్ళి తలెత్తుకు తిరిగలేకపోతున్నాను. మొదట్నించీ మొత్తుకుంటూనే ఉన్నాను.. నన్ను డిస్ట్రర్బ్ చేయకండి. నామట్టుకు నేను చదువుకోగలను అని.. విన్నారా!? మీ మాట మీదే.. "డాక్టరయి పోవాలి.. ఫస్టు రాంక్ వచ్చేయాలి'.. ఒకటే గోల.. గోల.. " ఇంపేషంట్'గా చెప్పుకు పోతున్న కొడుక్కి అడ్డువస్తూ .. ''ఒరే.. ఒరే.. నవీన్ అన్యాయంగా మాట్లాడకురా!.. నాకు అసలు ఏం జరుగుతూందో తెలియనే తెలియదు.. నమ్మురా! నాకు అంత జ్ఞానం కూడా లేదురా! నిజంరా.!

ఏదో డాక్టరు అవుతావేమో అని – ఆశ తప్ప.. ఈ విధంగా మీనాన్న గారు ప్రయత్నిస్తున్నారని.. నాకు అసలు తెలియదు.. నామాట నమ్మరా!"

– ఆవేదనతో నవీన్ అమ్మ వాసవి.

"సరేలే.. ఏదో ఒకటి.. 'టార్గెట్' అయింది నేనేకదా! ఈ 'అడ్డదారి'లో ఎప్పుడు ఏ విధంగా బెడిసి కొడుతూందోనని ఒక్క క్షణం కూడా "సబ్జెక్ట్' మీద 'కాన్సన్ట్రేషన్' చెయ్యలేకపోయేవాడ్ని.. తెలుసా!?

నా 'మెంటల్ పెయిన్' ఎవరితో చెప్పుకోనూ!

"మీ అమ్మకు చెప్పకు.. తనకి అర్థంకాదు.."

అని నాతో ప్రామిస్ చేయించారు! తెలుసా!..'

వాసవి – కొడుకు చెపుతున్నది వింటూ.. ఒక్కసారిగా ఆశ్చర్య పోయింది.. ఏదో అందామనుకునేలోపే...

"ఎందుకు ఆ బోడి రాంక్..?

నా స్నేహితులు ఎలా కామెంట్ చేస్తున్నారో? "ఎంత పని చేశాడురా మీ డాడీ.. పైగా పెద్ద ఆఫీసరు.. టి.ఎ.ఎస్.క్యాడర్ కూడా! .. ఆ మాత్రం 'కామన్‌సెన్స్' లేదా!

'కంచే చేను మేస్తే' సామెత చిన్నప్పుడు విన్నాం.. ఇంతకీ ఇంత 'బ్రిలియంట్'వి నువ్వు ఎలా 'అడ్డదారి'లో రాంకు కొట్టేయడానికి 'యాక్‌సెప్ట్' చెయ్యగల్గేవు?!?.."

ఇలా – సూటిపోటీ మాటల్తో చంపుతున్నారు.."

మౌనంగా మనస్సులోనే రోదిస్తూ కొడుకు మాటలు

వింటూన్న వాసవి సడన్‌గా కారు హారన్ మ్రోగడంతో రపీమని లేచి నిలుచుని–

"బాబు నవీన్! మీ నాన్నగారు వస్తున్నారు.. దయచేసి ఊరుకో.. నీకు పుణ్యం ఉంటుంది.. నాకు పూర్తిగా ఇప్పుడే అర్థమయింది.. నువ్వు మాత్రం.. ఆవేదన చెందకు.." అంటూండగా.. వినిపించుకోకుండా– 'నేను ఒక్క నిమిషం కూడా ఇక్కడ ఉండను.." అంటూ బ్యాక్‌డోర్ నుంచి విసురుగా బయటికి వెళ్ళిపోయాడు

నవీన్.....

"ఒరే బాబూ నవీన్.. ఆగు.. నామాట విను ఒరే" అని వాసవి పిలుస్తోన్నా వాడు ఫాస్టుగా వెళ్ళిపోవడం.. నవీన్‌వాళ్ళ నాన్న లోపలికి రావడం ఒక్క సెకెండ్‌లో జరిగిపోయాయి...

లోపలికి వస్తూ నవీన్ ఏడీ.."ఎందుకా గావు కేకలు.. వెళ్ళనీ వాడే వస్తాడు.." అన్నాడు నిర్లక్ష్యంగా..

ఏం జరుగుతూందో క్షణంలో అర్థం చేసుకుని..." ఆ.. ఆ.. మీరు చేసిన నిర్వాకంకి.. వారు లోలోన ఎంతగా కుమిలిపోతున్నాడో.. మీకు ఆ పసి హృదయం అర్థం కాదులెండి.."

"వాడి భవిష్యత్ కోసం చేస్తే ఇలా బెడిసికొట్టి లీక్ అవుతోందని నేనేమైనా కలగన్నానా!? ఎక్కడకిపోతాడు.. వస్తాడులే!" తన మామూలు ధోరణిలోనే ధీమాగా అన్నాడు నవీన్ డాడీ.

"ఎంత సులువుగా చెప్పేశారు.. వాడి స్నేహితులు టీచర్స్ ఎలా కామెంట్ చేస్తాన్నారో వినండి..

వాడే చెబుతాడు మీకు...

పట్టున పద్దెనిమిది ఏళ్ళు దాటలేదు. వాడికి ఆ లేత హృదయం ఎలా తట్టుకోగలదు..?!

అయినా క్లాసు వన్ ఆఫీసరు అయివుండి..

మీకు ఈ మాత్రం జ్ఞానం లేకపోవడం ఏమిటి..?!"

"షటప్.. మరీ ఓవర్ అయిపోతున్నావు" – భర్త

"చాల్లేండి ఈ 'అడ్డదారి' లో రాంక్స్ సంపాదించడం ఏమిటి?! నేను అంతగా చదువుకోలేదనేగా నాకు తెలియకుండా ఇంత ఘోరం చేశారు.

నాకు చెప్పొద్దని 'మాట' తీసుకున్నారటగా..

డబ్బుతో ఏదైనా చేయవచ్చు అనుకున్నారు 'సరస్వతీ దేవి'ని కొనలేరు..

చాలా చాలా తప్పుచేశారు.. మీరు.. క్షమించరాని తప్పు చేశారు.. రాంక్స్.. లక్షలు పెట్టి కొంటారా?.. చీకటి పడుతోంది..

ఎక్కడికి వెళ్ళాడో.. నాకు చాలా భయంగా ఉంది.. వెళ్లి తీసుకురండి" గద్గద కంఠంతో అంది వాసవి.

కొంచెం తగ్గి "ఎక్కడికి వెళ్లి వెతకను"..

వాడే వస్తాడు.. మరేం పరవాలేదు.. ఎక్కడికి వెళ్తాడు..?' మళ్ళీ ధీమాగా అంటూ బాత్‌రూమ్ వైపుకి వెళ్ళిపోయాడు భర్త.

"ఈ పాషాణంతో మాట్లాడలేం.. డబ్బుతో ఏదైనా కొనేయవచ్చు.. అనుకునే మనిషికి.. ఆ పసివాడి మనస్సు.. అర్థం కాదు" అనుకుని తళుక్కున ఒక ఆలోచన రావడంతో తన రూమ్‌లోకి వెళ్ళిపోయి తలుపు లోపలికి గడియ వేసి.. ఫోన్ తీసుకుంది..

♦♦♦

"హలో.. హలో.. సరోజ్.. నేను ఆంటీని నవీన్ వాళ్ళ అమ్మని.. బాబూ! నవీన్ మీ యింటికి వచ్చాడా!" ఆత్రంగా, నెమ్మదిగా అడిగింది..

"లేదు ఆంటీ" అవతల కంఠం..

"బాబూ సరోజ్.. వాడు చాలా డిప్రెషన్‌లో ఉన్నాడు.. చీకటి పడుతుండగా వెళ్ళాడు.. నాకు చాలా భయంగా ఉంది.. వాడి మనస్సు నీకే బాగా తెలుసు.. వాడు ఎక్కడికి వెళ్ళి ఉంటాడో తెలుసుకుని.. నీతో తీసుకురావా! ప్లీజ్ సరోజ్..' ఎంతో దీనంగా–

వాసవి – వస్తోన్న కన్నీరు తుడుచుకుంటూ..

"ఆంటీ! మీరు ఏమీ అనుకోనంటే – ఒక నిజం చెప్పాలనుకుంటున్నాను... అంకుల్ చాలా తప్పుచేశారు – ఆంటీ.. వాడిని 'మిస్‌గైడ్' చేశారు. అందరూ ఇదేమాట అంటున్నారు. మా కళాశాలలో ఇదే టాపిక్.. క్లాస్‌వన్ ఆఫీసర్ అయి నవీన్‌కు రాంగ్ డైరెక్షన్ ఇచ్చారు. వాడు చాలా తెలివైనవాడు ఎల్‌కేజీ నుండి నా క్లాస్‌మేట్ కదా!... కేవలం ర్యాంక్ కోసం ఇలా.." చెపుతున్న సరోజ్‌కి వాసవి నెమ్మదిగా రోదిస్తూ.. (పెళ్ళుబికిన) కన్నీరు తుడుచుకుంటూ.. "బాబూ.. సరోజ్.. టైమ్ లేదు.. త్వరగా నీ స్నేహితులతో వెళ్ళి ఎక్కడున్నాడో తెలుసుకో బాబు.. ఈ "ఊబి" నుండి వాడిని నీవే బయటికి తేవాలి.. వెళ్ళు బాబు.. త్వరగా వెళ్ళు.. ఆలస్యం చేయకు.. " గద్గదస్వరంతో రోదిస్తూ ఫోను కట్ చేసింది.. వాసవి.

♦♦♦

"అమ్మా! నవీన్ వచ్చాడు.. కాదు.. మేమే లాక్కొచ్చాము వాడ్ని.. గాంధీపార్కులో ఒంటరిగా ఓమూల బెంచ్ మీద

కూర్చుని ఉన్నాడు.. నేను, నా స్నేహితులు ప్రవీణ్, రాజేష్, పవన్ ఎంతగా వెతికేమో తెలుసా!?.. ఇక్కడే భోజనం చేస్తాడు..” దడదడ చెప్పుకుపోతున్న కొడుకుని చూసి – విషయం అర్థం చేసుకుంది సరోజ్ తల్లి.

“రా..రా.. నవీన్! కూర్చో.. మంచినీరు కావాలా!.. ఎందుకు దిగులు? ముఖం పైకెత్తవోయ్! ఇందులో నీ తప్పు ఏముందీ!? నీవు చిన్నప్పటి నుంచి నాకు తెలుసుకదా! చాలా బ్రిలియంట్‌వి.. కాకపోతే మీనాన్నగారు.. పెద్ద ఆఫీసర్ కదా! తన ‘పలుకుబడి’ ఉపయోగించి రాంక్ సంపాదించి పేపర్‌లో నీ ‘ఫొటో’ పడితే చాలనుకున్నారు. డాక్టర్‌కోర్స్‌కి ‘సబ్జెక్ట్’ రావాలి గాని రాంక్స్ రావు అని తెలియదు మీ డాడీకి.

సరిసరి.. బాత్‌రూమ్‌కి వెళ్ళి రిప్రెష్ అయిరా.. భోజనం చేసిన తరువాత తీరిగ్గా మాట్లాడుకుందాం.. సరోజ్!

నవీన్‌తో కూడా నీవూ వెళ్ళు..” అందామె.

అమ్మ చెప్పింది అయస్కాంతంలా అర్థం చేసుకుని నవీన్‌కి బాత్‌రూమ్ వైపుకి తీసుకువెళ్ళాడు సరోజ్..

♦♦♦

“హలో.. హలో.. నేను నవీన్ మదర్‌నండి.. మా అబ్బాయి వచ్చాడా!? మీ అబ్బాయి సరోజ్ ఉన్నాడా”

అవతల కంఠం ఏడుస్తూ తడబడుతూ.. గద్గద స్వరంతో ఆత్రంగా..

“ఏడవకండి.. మరేం పరవాలేదు.. మీ అబ్బాయి ఇక్కడే ఉన్నాడు. మా తోనే భోజనం చేశాడు. మరీ రాత్రి 10 గంటలయింది కదా! మరి ఇప్పుడు ఎందుకు? రేపు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసి వస్తాడు లెండి. తోడుగా మా అబ్బాయిని పంపుతాను. వర్రీ అవకండి. నిదానంగా వస్తాడులెండి.. మరేం పరవాలేదు.. నేను జెనిటిక్స్ ప్రొఫెసర్‌ని.. నిమ్మళంగా ఉండండి. వాడెంత? వాడి వయస్సెంత? చాలా సున్నితమైనవాడు. . వాడి ప్రమేయం లేకుండా మీ వారే తన ‘ఇగోయిజమ్’తో చేసారు ‘ఈ బ్లండర్’. అంత ఆలోచనాశక్తి వాడి (నవీన్) కెక్కడిది..!? – ‘పాపం పసివాడు’.. లేలేత వయస్సులో ఉన్నాడు. వాడికి చెప్పేవిధంగా చెపుతాను.. సరేనా. నన్ను నమ్మండి’ సరోజ్ అమ్మగారు.. ఓదార్పుగా.. అంది.

“ఓకె మేడమ్! కేవలం.. మిమ్మల్నే నమ్ముకున్నాను’

అంది నవీన్ వాళ్ళ అమ్మ..

వాసవి ఫోన్ కట్ చేస్తూ..

“నవీన్! మీ అమ్మగారితో నేను చెప్పిన విషయాలు కొంతవరకు నీవు అర్థం చేసుకుని ఉంటావు.” సోఫాలో కూర్చుంటూ సరోజే వాళ్ళ అమ్మగారు సంభాషణ నిదానంగా మొదలుపెట్టారు..

“అవును ఆంటీ! అర్థం అవుతూంది” అన్నాడు నవీన్.

“ఎందుకంటే.. ఇది కేవలం యాదృచ్ఛికం అనుకోవాలి.. కొందరు ఉన్నతాధికారులు.. మరీ సెల్ఫిష్‌గా, ధీమాతో కొన్ని తప్పుడు అంచనాలు వేస్తోంటారు.. లీక్ అవదు అనే ఓవర్‌కాన్ఫిడెన్స్‌తో. మీ నాన్నగారు అంతే!

తన హోదాని ఎక్స్‌ప్లాయిట్ చేశారు..

“వుయ్ కెన్ చూజ్ ఎనీథింగ్ ఇన్ ద వరల్డ్. బట్ వుయ్ కెనాట్ చూజ్ అవర్ పేరెంట్స్” ఇది జన్యుశాస్త్రంలో మేము తరచుగా చెపుతూ ఉంటాం..

నీది లేత వయస్సు.. విచక్షణాజ్ఞానం తక్కువ.. ‘పేరెంట్స్ మన మంచికే కదా! చేస్తున్నారు.. అని గుడ్డిగా నమ్మేస్తారు మీరు.. ఇక్కడ అదే జరిగింది. మీ ఫాదర్‌ని ప్రతిఘటించే శక్తి నీలో లేదు.. ఇలా బెడిసి కొడుతోందని ఊహించలేవు కూడా! సరే జరిగింది ఏదో జరిగింది.. మీ అమ్మ గురించి ఆలోచించు.. ఆవిడ అట్టే చదువుకోలేదు.. ఏమి జరుగుతూందో ఆవిడకు బొత్తిగా తెలియదు.. బెంబేలెత్తి పోతున్నారు.. నీవు నీ కెరీర్‌ని నీకు నచ్చినట్లుగా మలుచుకో.. మీ నాన్న గారే ‘దోషి’.. పూర్తిగా ఈ లీకేజిలో... మీ నాన్నగారిని కూడా ఎక్కువగా విమర్శ చేయకు...బి కామ్, బి బోల్డ్ బి వైజ్. అసలు సరోజ్‌కి తండ్రే లేరు.. చిన్నప్పుడే వాడు తండ్రిని కోల్పోయాడు కదా! అప్పటినుంచి అన్నీ నేనే వాడికి. మీ అమ్మగురించి ఆలోచించాలి..”

అలా చెప్పుకుపోతున్న సరోజ్ తల్లి మాటలకు ఏమైందో ఏమో ఒక్కసారి నవీన్ ఆర్ద్రతతో ‘...ఆంటీ అర్థమైంది.. నేను జరిగిన దానికి మరి ఫీల్ అవను.. నా భవిష్యత్ ముఖ్యం.. అమ్మని సంతోషపెడతా! రేపు తెల్లారి.. సరోజ్‌తో ఇంటికి వెళతాను.. నమ్మండి. ఆంటీ అంటూ.. పడక గదివైపుకి తన చిన్ననాటి నుండిక్లాస్‌మేట్ అయిన సరోజ్ చేయి మరింత గట్టిగా పట్టుకుని వెళ్ళాడు.....

గత కొన్ని నెలలుగా నిద్రకు కరువైన ఆ ‘పసివాడు’ హాయిగా తేలికగా నిద్రపోయాడు. తన స్నేహితుడిపై చేయివేసుకుని....

♦

## కవిత

# మానని గాయాల సెగ

- సునీత గంగవరపు
9494084576



కొమ్మ మీద నుంచి
పువ్వు రాలిపడినంత సహజంగా
పొదవుముక్కు పిట్ట
తన చిట్టి రెక్కలు విప్పార్చి
ఆకాశానికెగిరినంత అందంగా
నాకు.. ఓడిపోవాలనుంది

పాదాల కింద పాకుతున్న క్షణాలు
ముళ్ల పొదలుగా మొలుస్తున్నపుడు
మానని గాయాల సెగ
మది మొదళ్లకు చేరి
మృదువైన వేర్లను
కాల్చివేస్తున్నపుడు..

బతుకు దారుల వెంట
మెత్తని పరామర్శలకు బదులు
వెగటు వాసనలు వీస్తున్నపుడు
నా నుంచి నేను దూరమై
నల్లని చీకటిరాత్రుల్లోకి జారిపోయినపుడు
నాకు.. ఓడిపోవాలనుంటుంది!

నా ప్రతి కదలికకు ముందు వెనుకా
ఆత్మీయంగా కాచుకుని కూచున్న
ఓటమికి గెలుపునిస్తూ..
కన్నుల్లోని అశ్రుబిందువుల
ఆనవాళ్లను
మనసు పాత్ర లోనికి వొంపుకొని

గెలుపుకు అందనంత దూరానికి పరుగెత్తి
అందరూ అసహ్యించుకునే
ఓటమి ఒడిలో తలవాల్చి
నిశ్చింతగా..నిస్సందేహంగా
నాకు ఓడిపోవాలనుంది

ఓటమి అంటే..
నేను ప్రేమించిన జీవితం
దక్కకపోవడమే కాదు..
నన్ను ప్రేమించే మృత్యువుతో
ప్రేమలో పడడం..! ♦

# ప్రజాగ్రహం

- పుట్టి గిరిధర్
9491493170



నీ దేహంలో
నీ అంగమొక వ్యర్థాంగం!
రెండు కాళ్ళ మధ్య
వేలాడే విషసర్పాన్నేసుకుని
వీధుల్లో ఊరేగుతావు!

కళ్ళల్లో కామాన్ని నింపుకొని
కుక్కలా మాంసాన్ని వెతుకుతావు!
నీ దాహం చల్లారడానికి
ఒక ప్రాణం బలౌతోంది!
అర నిమిషం కోసం
ఒక జీవితం ముగిసిపోతోంది!

నీవు చేసే నీచపు పనిలో
నీ చెల్లినో, బిడ్డనో చూసుకో!
కామక్రోధుడా...!
నీ పెళ్ళాంతో నీవు పడుకో
లేదంటే మళ్ళీ చేసుకో!

కాదంటావా...
సహజీవనం ఉండనే ఉంది,
ఇంకా తీరలేదా, సుఖాన్ని కొనుక్కో!

పాపం పసిపిల్లలని వదిలెయ్యండిరా!

కనబడినవి కొన్నే ఘటనలు
కనబడనివెన్నో దారుణాలు!
ఇక ఆపెయ్ లేదంటే...
నీ సమాజమే నిన్ను వెలేస్తుంది,
ప్రజాగ్రహమే నీకు తీర్పు చెబుతుంది!
పక్క చూపులు చూడాలంటే కూడా
నీ కళ్ళల్లో భయం పుడుతుంది!

శిక్షలు వేస్తేగానీ మారదు లోకం,
అలసత్వం ప్రదర్శిస్తే ఇంకెన్నో!
ప్రభుత్వం నిదరోతే
ప్రజాశక్తి మేల్కొనాలి!
తీర్పులే తలకిందులవ్వాలి
ప్రజాగ్రహం కట్టలు తెగాలి! ♦



# జీవితం లోంచి... పుస్తకాల్లోంచి...

- మక్సీమ్ గోర్కీ
(28.03.1868-18.06.1936)

నేను జీవితంనుంచీ, పుస్తకాలనుంచీ ఉభయత్రా అనుభూతుల్ని పోగుచేసుకున్నాను. మొదటి వాటిని ముడి పదార్థంతో పోల్చవచ్చు, రెండవ వాటిని సగం ఉత్పత్తి అయిన పదార్థంతో పోల్చవచ్చు. లేదా, ముతగ్గా అయినా సాదా మాటల్లో చెప్పాలంటే మొదటి సందర్భంలో నేను పశువుతో వ్యవహరించాల్సి వచ్చింది, తర్వాత సందర్భంలో మహా చక్కగా పదును చేసిన చర్మంతో వ్యవహరించాల్సి వచ్చింది. నేను విదేశీ సాహిత్యానికి చాలా యెక్కువగా రుణపడివున్నాను, ముఖ్యంగా ఫ్రాన్సు దేశపు సాహిత్యానికి. మా తాత క్రూరంగా, పిసినారిగా వుండేవాడు. కాని బాల్జాక్ "ఎజెనీ గ్రాండే" చదివే దాకా నేను ఆయన్ని సరిగా అర్థం చేసుకోలేకపోయాను. ఎజెనీ తండ్రి వృద్ధ గ్రాండే కూడా క్రూరంగా పిసినారిగా వుండి, మా తాతని పోలి వుండేవాడు. కాని అతను మా తాత కంటే మరింత మొరటుగా, ఆసక్తికరంగా వుండేవాడు. యీ ఫ్రెంచి మనిషితో పోలిస్తే, నేను ప్రేమించని ఓ ముసలి రష్యన్ మెరుగయ్యాడు. యిది ఆయన పట్ల నా దృక్పథంలో మార్పు తేలేదు కాని నేను గొప్ప ఆవిష్కరణ చేశాను. అంటే, మనిషిలో నేను చూడని దాన్నీ, నాకు తెలియని దాన్నీ, దేన్నో పుస్తకాలు నాకు తెలియజేస్తున్నాయి అన్నదాన్ని కనుగొన్నాను.

నీజ్ని నోవ్‌గొరొద్‌లోని తరహా జీవితాన్ని మనుషులు ఇంగ్లీషు, జర్మన్ రాష్ట్రాలలో గడపడం లేదు గాని, అంతకంటే పెద్ద మెరుగు యేమీ కాదని జార్జి ఎలియట్ నీరసపు నవల "మిడిల్ మార్చ్", ఔయెర్‌బాఖ్, ష్పిల్‌హాగెన్ పుస్తకాలు నాకు తెలియచేశాయి. వాళ్లు అలాంటి విషయాలే మాట్లాడుకునే వాళ్లు – తను ఇంగ్లీషు, జర్మన్ పైసలని గురించి, ప్రభువంటే భయపడ్డమూ, ఆయన్ని ప్రేమించడమూ గురించీ మాట్లాడుకునే వాళ్లు. కాని సరిగ్గా మా వీధిలో వాళ్లల్లాగానే ఒకళ్లనొకళ్లు ద్వేషించుకునే వాళ్లు, ముఖ్యంగా, యేదో ఒక రకంగా తను చుట్టుతా వున్న అధికసంఖ్యాకుల కంటే భిన్నంగా, వేరే తరహాగా వుండేవాళ్లని. రష్యన్లకీ విదేశీయులకీ మధ్యన సారూప్యంగా వుండే అంశాల కోసం నేను వెదకడం లేదు. నేను తేడాలు చూడబోయాను, అయినా కాని పోలిక కనిపించింది.

దివాళా తీసిన వర్తకులు, మా తాత ఆప్తమిత్రులు, థాకరే నవల "వానిటీ ఫెయిర్" లోని మనుషుల మాదిరే, అదే విషయాలని గురించి మాట్లాడేవాళ్లు. నేను రాయడమూ, చదవడమూ స్తోత్రపాఠంనుంచి నేర్చుకున్నాను. నాకు ఆ పుస్తకం అంటే యిష్టం యేమంటే అది కమ్మని, సంగీత భాషలో వుంది. మా తాతా యింకా యితర ముసలాళ్లూ తమ పిల్లల గురించి

ఒకళ్లకొకళ్లు పితూరీలు చెప్పుకుంటూ వుంటే దేముడికి అవిధేయుడైన కొడుకు ఆబ్‌సాలెమ్ గురించి చక్రవర్తి డెవిడ్ చేసిన పితూరీలు నాకు గుర్తుకువచ్చాయి. మామూలుగా మనుషులు, ముఖ్యంగా యువకులూ, పాడై పోయారనీ, యింకా బుద్ధిహీనుల్లాగా సోమరిగా తయారవుతున్నారనీ, భగవంతుడి పట్ల భయభక్తులు లేకుండా పోతున్నాయనీ ఆ ముసలాళ్లు అనుకునేటప్పుడు వాళ్ళు నిజం చెప్పడం లేదనే నాకు అనిపించింది. డికెన్సు చిత్రించిన వంచకులు సరిగ్గా అలాంటి విషయాలనే అనుకునేవాళ్లు.

చర్చి మనుషుల మధ్యన వాదాలని జాగ్రత్తగా విన్నాక, వాళ్లు మిగతా దేశాల్లోని చర్చి మనుషుల్లాగా మాటలని పట్టుకుని వేలాడుతున్నారనీ, చర్చి మనుషులందరికీ, మిగతా వాళ్లని అణగదొక్కి వుంచడానికి మాటలన్నీ ఒక దారి అనీ, చర్చి వాళ్ళనే పోలిన రచయితలు వున్నారనీ నేను కనిపెట్టాను. ఆసక్తికారకమైనా, యీ పోలికలో యేదో అనుమానస్పదమైంది వుందని త్వరలోనే నాకు అనిపించింది.

నేను చెత్త పుస్తకాలని లెక్కలేకుండా చదివాను. కాని అవి కూడా నాకు ఉపయోగపడ్డాయి. జీవితంలోని అనాకర్షక భాగాలని గురించి కూడా ఆకర్షవంతమైన భాగాలల్లాగానే యెవళ్లేనా తెలుసుకోవాలి. సాధ్యమైనంత అధిక జ్ఞానం సంపాదించాలి. అనుభవం యెంత వైవిధ్యపూరిత మైందైతే అంత పురోగమనాన్ని మనిషి సంపాదించుకుంటాడు, అతని దృష్టి పథం అంత విస్తృతమవుతుంది.

నా మీద "పెద్ద" ఫ్రెంచి రచయితలు స్టెండాల్, బాల్జాక్, ఫ్లోబెర్‌లు గాఢమైన రూపనిష్పాదక ప్రభావం కలిగించారు. ఆరంభకులందరికీ యీ రచయితల పుస్తకాలని చదవమని నేను సలహా యిస్తాను. వాళ్లు నిజంగా మేధావంతులైన కళాకారులు, రూపానికి సంబంధించి అందె వేసిన నిపుణులు.

మాటలతో ప్రజలని వర్ణించే కళ, వాళ్ల సంభాషణని సజీవంగా, శ్రవణ గ్రాహితంగా చేసే కళ, సంభాషణని సృష్టించడంలో పరిణతి చెందిన నైపుణ్యం గల బాల్జాక్, తదితర ఫ్రెంచి రచయితల నేర్పు యెప్పుడూ నన్ను ముంచెత్తేసేది. బాల్జాక్ పుస్తకాలు తైల వర్ణచిత్రాలతో చేసినవేమోననిపించేది. నేను మొదటి సారి రూబెన్స్ చిత్రాలు చూసినప్పుడు నాకు తక్షణం బాల్జాక్ గుర్తుకువచ్చాడు. దొస్తొవస్కీ రాసిన తిక్క పుస్తకాలు చదివినప్పుడు, నవలా సాహిత్యపు యీ మహా నిపుణుడికి ఆయన చాలా ఋణపడి వున్నాడని అనుకోకుండా వుండలేకపోయేవాణ్ణి . లేఖినితో గీసిన చిత్రాల్లాగా తీక్షణంగా వున్న బిగిగల గొన్‌కూర సోదరుల నవలలూ నాకిష్టంగానే వుండేవి. మబ్బుగా వుండే రంగులతో, హత్తుకునేటట్టు గీసిన చిత్రాల్లాగా వుండే జోల వ్యాకుల రచనలూ ఇష్టంగానే వుండే హ్యూగో నవలలు నన్ను ముగ్ధుణ్ని చెయ్య లేదు. "1793వ సంవత్సరా"న్ని కూడా యేదో ఉదాసీనంగా చదివాను. తర్వాత మాత్రమే అనతోల్ ఫ్రాన్స్ రాసిన "దేవతల కాంక్ష" చూశాకనే ఆ ఉదాసీనతకి కారణం నాకు అర్థం అయింది. యెన్నో విషయాలని అసహ్యించుకోవడం నేను నేర్చుకున్నాకనే నేను స్టెండాల్ రాసిన వాటిని చదివాను, అతని నిబ్బరమైన మాటా, సంశయాత్మక మందహాసం నన్ను నా ద్వేషంలో దృఢం చేశాయి.

పైన చెప్పిన దాన్ని బట్టి తేలేది యేమిటంటే నేను రాయడం అనే దాన్ని ఫ్రెంచి రచయితలనుంచి నేర్చుకున్నాను. యిది యాదృచ్ఛికమే, కాని ఫలితాలు ప్రయోజనకరంగా వున్నాయి.

రష్యన్ సాహిత్యంలో మహా రచయితలైన గోగొల్, టాల్‌స్టాయ్, తుర్గేనెవ్, గొన్‌చరోవ్, దొస్తొయేవ్‌స్కీ, లెస్కోవ్‌ల రచనలని నేను చదివింది చాలా తర్వాతనే, తన అద్భుతమైన భాషా సంపదతోటీ, జ్ఞానం తోటీ నా మీద నిస్సందేహంగా లెస్కోవ్ ప్రభావం కలిగించాడు. రష్యన్ జీవితంలోకి చొచ్చుకుపోయిన సన్నిహితమైన పరిశీలనా దృష్టిగల గొప్ప రచయిత ఆయన. ఆయనకి మన సాహిత్యంలో రావాల్సినంత పేరు రాలేదు. తను లెస్కోవ్‌కి యెంతో ఋణపడివున్నానని చెహోవ్ అన్నాడు.

రష్యన్ సాహిత్యమూ, విదేశీ సాహిత్యమూ – వీటి అభివృద్ధి గురించిన పరిజ్ఞానం రచయితకి విధిగా వుండాలని మళ్లీ చెప్పడానికే యీ పరస్పర సంబంధాలనీ, ప్రభావాలనీ నేను పేర్కొన్నాను.

దగ్గర దగ్గర యిరవై యేళ్ల వయసప్పటికే, జనానికి చెప్పగలిగిందీ, చెప్పి తీరవలసిందీ యెంతో నేను చూసినట్టూ, విన్నట్టూ, అనుభవించినట్టూ నేను గుర్తించాను. మిగతా వాళ్లకంటే భిన్నంగా కొన్ని విషయాలని నేను తెలుసుకున్నట్టూ అనుభవించినట్టూ నాకు అనిపించింది. అది నన్ను కలత బెట్టింది, అశాంతిగా, వదిరేటు వంటి మానసిక స్థితిలో పెట్టింది కూడా. తుర్గేనెవ్ లాంటి సిద్ధహస్తులైన రచయితలు రాసినవి చదివేటప్పుడు కూడ ప్రధాన పాత్రల గురించి నేను బహుశా యేదో చెప్పగలనేమోననీ, ఉదాహరణకి "వేట గాని కథలు" నాయకుల గురించి తుర్గేనెవ్ కంటే మరోలా చెప్పగలనేమోనని

అనిపించింది. అప్పటికే కథాకథన నైపుణ్యం వున్న వాడినని నాకు పేరు వచ్చింది. ఓడ రేవు కార్మికులు, రొట్టెలు తయారు చేసేవాళ్లు, తిరుగుబోతులు, తివాసీలు చేసేవాళ్లు, రైల్వే కార్మికులు, దేశద్రిమ్మరులు, మొత్తంమీద నేను యెవళ్ల మధ్య బతుకుతున్నానో వాళ్లంతా నేను చెప్పే వాటిని ఆసక్తిగా వినేవాళ్లు. నేను చదివిన పుస్తకాలనుంచి విషయాలనీ తిరిగి చెప్పేటప్పుడు, తరుచుగా యితివృత్త సన్నివేశాలని మార్చేస్తున్నట్టూ, నేను చదివిన దాన్ని వక్రీకరిస్తున్నట్టూ, నా అనుభవంలో నుంచే సేకరించిన వాటిని జోడిస్తున్నట్టూ నాకు అవగతం అయింది. అలా ఎందుకు జరిగిందంటే జీవిత, సాహిత్యాల వాస్తవాలు నా మనసులో పెన వేసుకుపోయాయి. ఒక పుస్తకం మనిషి అంతగానూ ఒక కనిపించే విషయం. అది సజీవ, భాషణ వాస్తవం కూడా. అది మానవుడు సృష్టించిన, సృష్టిస్తూ వున్న విషయాలన్నిటి కంటె కూడా చాల తక్కువ “విషయం”.

నేను చెప్పేది విన్న మేధావులు నాకు ఇలా సలహా యిచ్చారు: “మీరు రాసితీరాలి. ప్రయత్నించి చూడండి.”

నేను తరుచుగా నన్ను అణగార్చినవో, లేక ఆనంద పెట్టినవో ఆ సకల విషయాలనీ వ్యక్తం చేయ్యాలనే ప్రేరణతోటి వాగ్ధాటి దాడులని, మాటల ఝరిని అనుభవించి మత్తెక్కి పోయేవాణ్ణి. “నా గుండె గుబగుబ వదిలించుకోవాల”ని ఆత్రపడే వాణ్ణి. నా లోపలి ఉద్రిక్తతవల్ల నేను చిత్రహింస పడిన క్షణాలు వున్నాయి. నా కంఠంలో గుండె కొట్టుమిట్టాడిన క్షణాలు వున్నాయి. నా మిత్రుడు, గాజు వూదే అనతోలి ప్రతిభ వున్న కుర్రాడనీ సహాయం యేం రాకపోతే నాశనమై పోతాడనీ అరవాలనిపించేది. సామాన్య వేశ్య థెరెసా చక్కని మనిషనీ ఆమె పడుపు వృత్తికి దిగడం అన్యాయమనీ అరవాలనిపించేది. ఆమె దగ్గరికి వెళ్లే విద్యార్థి కుర్రాళ్లు యీ విషయాన్ని చూళ్లేదు, జీవనాధారం కోసం ముష్టి యెత్తుకునే ముసలామె మాతిత్సా, పడుచుదనంతో వుండి బాగా చదువుకున్న మంత్రసాని యాకొవ్‌లేవా కంటే గట్టి బుర్ర వున్న మనిషని గ్రహించినట్టే.

వచనం చాలా కాలం నా అడుగులని అనుసరించి, అవాంఛనీయంగా అనువు గాని చోట నా కథల్లోకి ఇంకిపోయింది... మొత్తం మీద నేను ఒక ‘రమ్యమైన” శైలిని వాడటానికి ప్రయత్నించాను. ఒక ఉదాహరణ : “ఆ తాగుబోతు, వదనం మీద మందహాసంతో, చలించే తన నీడని పరీక్షిస్తూ దీపస్తంభాన్ని ఆలింగనం చేసుకుని నుంచున్నాడు.” నేనే రాసినట్టుగా ఆ రాత్రి, సందర్భవశాత్తూ, గాలి లేకుండా, వెన్నెలగా వుంది. ఆ రోజుల్లో అలాంటి రాత్రుళ్లప్పుడు వీధి దీపాల్ని వెలిగించేవాళ్లు కారు. పైగా ఒక వేళ దీపాలు వెలిగినా గాలి లేకుండా వున్నప్పుడు ఆ మనిషి నీడ నిశ్చలం వుంటుంది. అలాంటి పొరపాట్లూ, తప్పులూ నా కథల్లో ప్రతిదాంట్లోనూ తగిలాయి. దానికిగాను నన్ను నేనే తీవ్రంగా నిందించుకున్నాను.

కొన్ని తప్పులు చిన్నవిగానే కనిపించవచ్చును గాని అవి చాలా ముఖ్యమైనవి. ఏమంటే అవి కళాత్మక సత్యాన్ని అతిక్రమిస్తాయి. మొత్తం మీద, “అల్పాక్షరముల అనల్పార్థ రచన” కోసం, మాటని పొదుపుగా వాడుతూ కూడా విస్తారమైన ఆలోచనా పరిధిని పరివేష్టితం చెయ్యడం కోసం, మాటల ఉపకరణం ద్వారా సజీవ చిత్రాలని సృష్టించడం కోసం, ఒక పాత్ర ప్రధాన లక్షణాన్ని పదునుగా వివరిస్తూ తక్షణం పాఠకుని మనసుమీద ఆ పాత్ర నడవడిక, మాట తీరు చెక్కడం కోసం కచ్చితమైన మాటలని ఎన్నుకోవడం చాలా కష్టం. మాటల మాధ్యమికం ద్వారా మనుషులకీ, వస్తువులకీ “చిత్రాత్మకత”ని ఇవ్వడం ఒక యెత్తు, “యుద్ధమూ – శాంతీ”లో లాగా వాళ్లు భౌతికంగా స్పర్శనీయం అవగలందుకు ‘త్రీ డైమెన్షన్స్’లో వాళ్లని కళ్లకి కట్టినట్టు వర్ణించడం ఇంకో యెత్తు.

నా దోషాలు ఎప్పుడూ ఒక కవి విచారపూరిత మాటలని మనసుకి తెచ్చేవి : “మాటల చిత్రహింసని మించిన నిశితమైన చిత్రహింస ప్రపంచంలో లేదు.” మన బీద భాష శీతలంగా దారిద్ర్యంతో వుంది” అని నాద్‌సన్ కవి కామోసు అన్నాడు. భాషా “దారిద్ర్యాన్ని” గురించి అసంతృప్తి ప్రకటించని కవి అరుదు అనుకుంటాను.

భాషని ప్రజలు సృష్టిస్తారని మీకు గుర్తు చెయ్యడం ఉచితం ఇక్కడ. సాహిత్య భాష అనీ, ప్రజల భాష అనీ అనడం వూరికే ఒకటి “ముడి సరుకు” అనీ, రెండవది సిద్ధహస్తులు మలిచింది అని చెప్పడమే. దీన్ని పూర్తిగా గుర్తించిన మొదటివాడు పూష్కిన్. ప్రజలు సమకూర్చిన భాషణ సామాగ్రిని ఉపయోగపెట్టుకుని, వ్యవహరించాల్సిన తీరు చూపించిన మొదటివాడూ ఆయనే.

కళాకారుడు తన దేశాన్నీ, తన వర్గాన్నీ ప్రభావితం చేసే వాటన్నిటినీ అతి సున్నితంగా గ్రహించేవాడు – దాని చెవి, కన్ను, గుండెకాయ. అతనిది తన కాలపు గొంతు. అతను ఎంత వీలైతే అంతా తెలుసుకోవాల్సిన విధి వున్నవాడు. మరి అతను గతాన్ని గురించి ఎంత బాగా తెలుసుకుంటే,

వర్తమానాన్ని అంతబాగా అర్థం చేసుకోగలడు. అంత గాఢంగా నిశితంగా అతను మన కాలపు సార్వజనీన విప్లవత్వాన్ని, దాన్ని ఎదుర్కొనే కర్తవ్యాల పరిధినీ గ్రహిస్తాడు. ప్రజల చరిత్రకి సంబంధించిన పరిజ్ఞానం ముఖ్యం, అలాగే దాని సాంఘిక, రాజకీయ ఆలోచనా సరళికి సంబంధించిన జ్ఞానమూనూ. పండితులు – సంస్కృతి చరిత్రకారులు, మానవ జాతుల శాస్త్రీయ వర్ణన చేసే వాళ్లు – యీ ఆలోచన అద్భుత కథల్లోనూ, కల్పిత కథల్లోనూ, సామెతల్లోనూ, సూక్తుల్లోనూ వెల్లడి అవుతుందని వివరించారు. ఎంతో బోధనాత్మకంగా, పరిపూర్తిగా వుండే రీతిలో ప్రజా బాహుళ్యం ఆలోచించే ధోరణిని సూక్తులూ సామెతలూనే వాస్తవంగా వ్యక్తం చేస్తాయి. కొత్త రచయితలు వాటికి సంబంధించి పరిజ్ఞానం సంపాదించుకోవాలి,

మొత్తం మీద, సామెతలూ, సూక్తులూ అనేవి శ్రామిక ప్రజలు కూడబెట్టుకున్న సాంఘిక చారిత్రక అనుభవాన్ని సంక్షిప్తంగా పొదివి పట్టుకున్నవే. గుప్పిట ముడిస్తే వేళ్లు ముదుచుకున్నట్టుగా, రచయిత అనేవాడికి మాటలని కుదించడం నేర్పే సరంజామా చాలా అవసరం. అలాగే ఇతరులు కుదించిన వాటిని విస్తరించడమూనూ. అది కూడా ఆ కాలానికి విరుద్ధంగా వున్న, లేదా పాతబడిపోయిన అంతరర్భూత అర్థాలని వెల్లడిచేసేటట్టు వుండం.

నాకు తిరుగుబోతులూ, ఆవారాగాళ్లూ మామూలు గాడిలో లేని మనుషులుగా కనిపించారు. వాళ్లు ప్రజలతో విభేదించి వుండేవాళ్లు. యేమంటే కులం పోగొట్టుకోవడం వల్లా, తమ వర్గం నుంచి బహిష్కృతమవడం వల్లా వాళ్లు తమ పూర్వ వాసనలని వదిలించుకున్నారు.

ఈ వెలివేసిన మనుషులలో వింత మనుషులు వుండే వాళ్లు. నాకు అర్థం కానిది వాళ్లల్లో చాలా వుండేది. నేను వాళ్ల పట్ల అనుకూలంగా వుండడం అనేది, వాళ్ళు జీవితం మీద ఫిర్యాదు లేమి చెయ్యకపోవడం వల్లనే. స్థితిమంతుల కులాసా జీవితం అంటే వాళ్లకి అసూయ లేదు. దాన్ని గురించి పరిహాసంగా, ఎత్తిపొడుపుగా మాట్లాడుకుంటూ, అందని ద్రాక్ష పళ్ళు పుల్లన అనే భావమే ద్యోతకం కానియ్యరు. తమ జీవితాలు బీదరికంతో వున్నా, కులాసాగా గడిపేవాళ్లకంటే తామే మెరుగని, తాము ఏదో గుర్తించినట్టుగా, వాళ్లు గొప్పగా భావించుకునే వాళ్లు.

బహిష్కృతుల పట్లా, ఆవారాల పట్లా నాకు గల మొగ్గుకి సంబంధించిన వివరణే నేను చెప్పింది అంతా మందకొడి సంస్కారహీనులని కాకుండా మామూలు జీవితపు గాడికి బయట వున్న వాళ్లని, చిత్రించాలన్న నా కోరికని వివరించిందే. నేను విదేశీ సాహిత్య ప్రభావం కింద కూడా వున్నాను. మొదటగా ఫ్రెంచి సాహిత్యం,అది రష్యా సాహిత్యం కంటే ఇంకా ఎక్కువ కళ్లకి కట్టినట్టూ, వర్ణ శోభితంగానూ వుంది. "అణగార్చే మందకొడి జీవితాన్ని" నా వూహద్వారా ఉత్సాహభరితం చెయ్యడమనే నా కోరికే ప్రధాన కారణం.

నేనిదివరకే చెప్పినట్టుగా ఆ కోరికని "రొమాంటిసిజం" అంటారు. కొంత మంది విమర్శకుల అభిప్రాయంలో నా రొమాంటిసిజం నా తాత్వికతలో వున్న భావవాదపు ప్రతిబింబమే. ఆ అంచనా తప్పని నా అభిప్రాయం.

నాకు సంబంధించి మనిషికి బయట భావాలనేవి లేవు. నాకు సంబంధించి మానవుడు– మానవుడే– సకల వస్తువులనీ, సకల భావాలనీ సృష్టించినవాడు, అద్భుతాలనీ చేసేవాడు అతనే, ప్రకృతి శక్తుల భవిష్యత్ నాథుడు అతనే. మన ఈ ప్రపంచంలో అత్యంత సుందరమైంది మానవుడి శ్రమవల్ల సృష్టింపబడిందే, అతని కుశలమైన హస్తాలవల్ల నిర్మితమైందే. మన సకల ఆలోచనలు, భావాలు శ్రమ క్రమంలో ఉత్పన్నమైనవే. కళా, విజ్ఞానశాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన చరిత్ర మనకి విశ్వాసం కలిగించేది ఇది. వాస్తవాన్ని అనుసరించి వస్తుంది ఆలోచన. నేను మానవుడికి నివాళ్ళు అర్పిస్తున్నాను, ఏమంటే మన ప్రపంచంలో అతని హేతువు, అతని వూహ, అతని కల్పనల మూర్తి తప్ప నాకేం గోచరం కాదు. భగవంతుడు మానవుడి వూహలో కల్పితమే, ఫొటోగ్రఫీలాగా, తేడా ఏమంటే కెమెరా వాస్తవమైన దాన్ని చిత్రిస్తుంది. భగవంతుడు అనేవాడు మానవుడు సర్వజ్ఞుడుగా, సర్వశక్తివంతుడుగా, పరమ ధర్మమూర్తిగా వుండగలిగి, వుండాలని కోరుకున్న జీవిగా తను ఊహించిన దాన్ని కనిపెట్టిన ఫొటోగ్రాఫే.

"పవిత్రమైన" దాన్ని గురించి మాట్లాడాల్సిన అవసరం వుంటే, నేను పవిత్రంగా ఎంచే ఒక్కటీ ఏమంటే మానవుడు తనపట్ల తను చెందే అసంతృప్తి, ఇంతకంటే అధికుడుగా తయారవాలని అతను చేసే కృషి. మానవుడు తనే ఉనికి కలిగించి, జీవితాన్ని బంధనం చేసే చెత్త అంతటినీ ద్వేషించడాన్నే పవిత్రంగా భావిస్తాను. అసూయని, దురాశని, నేరాన్ని, రోగాన్ని, యుద్ధాలని ప్రపంచంలోని ప్రజల మధ్య శత్రుత్వాలన్ని రూపుమాపాలనే అతని సంకల్పాన్ని పవిత్రంగా భావిస్తాను. అతని శ్రమని పవిత్రంగా భావిస్తాను.

*(గోర్కీ "సాహిత్య వ్యాసాలు" నుంచి – అనువాదం – ఆర్వీఆర్)* ♦

# కవిత్వపు మూడో కన్ను 'వై' కవిత్వం






- అక్షరమాలి సురేష్
9493832470

**కో**టానుకోట్ల పీడిత గుండెల ఆకాంక్షల గొంతుక కావాలి కవిత్వం. వేదనాభరిత జీవితంలోంచి ఉబికివచ్చే కన్నీటి సముద్రాల్ని మింగే సాహసి కావాలి కవిత్వం. అలా కాక అందమైన అమ్మాయి మీదనో, వంద్యుడై భగవంతుని మీదనో అవంద్యుడైన ధీరనాయకుని మీదనో కవితలల్లి ఆనందడోలికల్లో ఆకాశవీధిలో తేలిపోవడం కాదు కవిత్వమంటే. నూనుగు మీసాల నూత్నయవ్వనం రంగురంగుల కలల ప్రపంచంవైపు పరుగుపెడుతున్న ఆ పరుగుల్ని భూమార్గం పట్టించాలి, కష్టజీవికి ఆలంబనగా నిలపేదే అసలు కవిత్వం. సరిగ్గా ఇలాంటి కవిత్వమే రాస్తూ నూతన ఉత్తేజంతో కవితా కన్యకు కొత్త దారులు తొక్కిస్తున్నాడు తక్కెడశిల జాని బాషా చరణ్. "అఖిలాశ" పేరుతో కవిత్వం రాస్తున్నాడు ఈ యువకవి.

సామాజిక మాధ్యమాల్లోనూ, అన్ని దిన, వార, పక్ష, మాస పత్రికల్లోనూ, వెబ్ పత్రికలలోనూ నిత్యం మనకు తారసపడుతున్న పేరిది. 'వై' పేరుతో వీరు రాసిన కవిత్వం ఇటీవల కొత్త చర్చకు తెరతీసింది. వీరు ఇప్పటికే అఖిలాశ, విప్లవ సూర్యుడు, నక్షత్రజల్లుల్లు, కవితా సంపుటులు తెచ్చారు. మాతృస్పర్శ పేరుతో అమ్మపై రాసిన 160 మంది కవితల సంకలనానికి సంపాదకత్వం వహించారు. "లై" పేరుతో ఆంగ్లంలో కవిత్వం రాస్తున్నారు. తెలుగులో దశాబ్దకాల క్రితం వచ్చిన నానోలు ప్రక్రియను హిందీకి పరిచయం చేస్తూ త్వరలో పుస్తకం తేబోతున్నారు. యింకా యింకా ఒక నిరంతర కవితా స్రవంతి వీరి కలం.

తెలుగు కవిత్వం సాంప్రదాయ బంధనాలు తెంచుకున్నాక అనేక ప్రయోగాలకు ఆటపట్టయింది ముఖ్యంగా ప్రక్రియా పరమైన ప్రయోగాలు అనేకం. ఇది రూపపరమైనది ప్రయోగాలు అనేకం ఫలించాయి అయితే వస్తూపరంగా తెలుగు కవిత్వాన్ని మనం అవలోకనం చేస్తే మనమింకా ఎక్కడో చీకటి మసకల్లోనే ఉండిపోయం. చాలా అంశాలను వస్తువులని చేయలేని అశక్తత చాలాకాలం రాజ్యమేలింది. 90వ దశకం నాటి అస్తిత్వ ఉద్యమాల గాలులకుకానీ మనం పైటలు తగలెయ్యలేకపోయం. వంటిళ్ళనూ ధ్వంసం చేయలేకపోయాం వెలివాడలను గుండెలకత్తుకోలేకపోయాం! అయితే మనం అక్కడితో ఆగిపోయాం. యింకా ముందుకు పోవడానికి ఇదిగో ఇప్పటికి అవకాశం వచ్చిందనమాట. మన అఖిలాశ వామనుడై మూడోపాదం ఇక్కడ మోపాడు. అంటే మూడోలింగం (థర్డ్ జెండర్) ను కవితా వస్తువుని చేయగలిగాడు. ఇతని ముందు ఈ సాహసం చేసినవారు ఒకటి అరా అంతే!

రోడ్ల కూడళ్ళలోనూ, రైలు ప్రయాణాల్లోనూ, సంత తిరునాళ్ళలోనూ నిత్యం తారసపడే హిజ్రాలు "వై" పుస్తకానికి కవితా వస్తువులు. వారిని చూస్తేనే చాలు మనసంతా జుగుప్సపడని వాళ్లెందరు? విసుక్కోని వాళ్ళెందరు? ఇట్లాంటి అంశాన్ని గురించి చర్చించడానికి ఈ కాలంలో దీన్ని

కవితావస్తువుగా ఎంచుకోవడం గొప్ప సాహసం. కవి ఈ పుస్తకానికి "వై"అనే సంకేత నామాన్ని ఎంచుకోవడం ఆధునిక ద ృక్పథానికి ప్రత్యేకంగా భావించవచ్చు. కవి దీనిని దీర్ఘకావ్యంగా మలిచారు. ముప్పైరెండు ఖండికలు ఇందులో కనిపిస్తాయి వారి గొంతుతోనే మాట్లాడుతాడు కవి కావ్యమంతటా.

***"అయినవారు ఎంగిలి మాటల శూలాలతో/ఎద లోయను తవ్వితే/ ఊరిప్రజలు వెకిలి చూపుల కొడవళ్ళు/ మాపై రువ్వితే/ మగతనాన్ని గుమ్మాన వదిలేసి/ ఆడతనం ఆవహించిన శరీరాలతో/ సమాజంలో అడుగు పెట్టాము!!"***

అంటూ శారీరక మార్పులు వారిని ఎలా వీధిపాలు చేశాయో! అండనిలవాల్సిన వారు ఎలా నిలువనీడను తుంచుతారో తెలిపే కవితా పంక్తులివి. తోబుట్టువులు, కన్నవాళ్ళు వీరికి సంబంధం లేని శారీరక మార్పులకు వీరి జీవితాల్ని బలిచేస్తారు. అండగా నిలవరు కదా అవమానంగా ఫీలవుతూ ఇంటినుండి వెళ్ళకొడతారు. పురుష శరీరంలో స్త్రీ మనసుతో నిత్యం కుమిలిపోతూ ఉన్నా వీరికి సమాజం ఏ చేయూత ఇవ్వదు.

***అక్షరాలయానికి వెలితే/ జ్ఞాన తీగలల్లాసిన సరస్వతి మాత/ముళ్ళ కంచె వేసి మా జీవితాలలో నిరక్షరాస్యత దీపం వెలిగించింది/ఆ చదువుల తల్లి స్త్రీ మూర్తే కదా*** అంటూ బడికి దూరమైన విషాదాన్ని తెలుపుతూ మన ముందు ఆలోచనల తెర లేపుతున్నాడు కవి.

***"ఆడతనం గెంటేస్తే/ మగతనం తొడల నడుమ నలిపేస్తే..."*** అంటూ వారిని కేవలం వస్తువులుగా చూసే తీరును ఎండగట్టిన పంక్తులివి. ఒకింత దుఃఖాన్ని గుండెకు వొంపే కవితా పంక్తులివి. ఇంటి నుండి గెంటివేయబడ్డ వారికి సమాజంలో సముచిత స్థానం లేక తినడానికి తిండికూడా లేక 90% మంది వీరిలో పడుపు వృత్తిలో మగ్గేవారే. అధికంగా చదువు లేకపోవడం, ఉద్యోగాలకు వీరికి అవకాశాలు లేకపోవడం, వీరితో పనిచేయడం మిగతవారు చిన్నతనంగా భావించడం వంటివి వీరి అకలిచావులకు కారణంగా ఉన్నాయి. భారతదేశంలో సుమరూ 4.8కోట్లమంది హిజ్రాలు ఉన్నట్లుగా గణాంకాలు చెప్తున్నాయి. మరి వీరి ఆరోగ్యం, విద్య, ఆహారం వంటి ప్రాథమిక అవసరాలు ఈ ప్రభుత్వాలకు ఎందుకు పట్టవు.

ఢిల్లీలో నిర్భయ సంఘటనకు ఎంత కదిలిపోయమో కదా మనం! మరి వీరిపై ఇలాంటి దాడులెన్నో జరిగాయ...

***"నిర్భయల వలె/ ప్రాణాలను మృగాలకు అర్పించారు/ మాలో ఎందఱో.../ అయినా మా కోసం ఎవరు మాట్లాడరు?"*** అనడం నిష్ఠుర సత్యమే కదా. ఈ వివక్షకు మనం సజీవ సాక్షులమే కదా! మరోచోట- ***"తల్లితండ్రులు మమ్మల్ని/ సమాజపు శూన్యానికి ఉరేస్తే/ ఈ అతుకుల రాజ్యాంగం కూడా మాకు/ మూడవ అంకె కేటాయించింది"*** అంటూ రాజ్యాంగం పట్ల, రాజ్యంపట్ల గొప్ప నిరసన కనిపిస్తుంది. ఇంకా ఈ కావ్యం నిండా వారి ఆవేదన, దుఃఖపు తాలూకు కన్నీళ్ళే కనిపిస్తాయి. లోపలి కేకలు సన్నని స్వరంతో వినిపిస్తాయి. మూలుగులు వాక్యాలు వాక్యాలుగా ప్రవహిస్తాయి. హిజ్రాలు హక్కుల కోసం సంఘటితమవడాన్ని.

***"మేమూ ఈ భారతదేశ పౌరులమే/ మరి మాకేవీ స్త్రీ పురుషులతో సమాన హక్కులు?/ మాకేవీ రిజర్వేషన్స్?"*** అంటూ ప్రశ్నించడం చూస్తాం.

చివరిదాక ఎక్కడ బిగి తగ్గకుండా నడుస్తుంది కావ్యం! హిజ్రాల పక్షాన మాట్లాడాలంటే వారి సమస్యలు, బాధలు తెలిసుండాలి. కవి స్వయాన వారిని ఇంటర్వ్యూ చేయడం కావ్యంలో చూస్తాం. సమస్యను వస్తుగతంగా చెబుతూనే వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నంలో జాని సఫలమయ్యాడు. కవిత్వపరంగా ఈ కావ్యం తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయి.

***" మౌనాన్ని స్మశానంలో నాటి/ గళాలను సమాజంలో విసిరి/ పొలికేక పెడుతున్నాము..../ నేడో రేపో గెలుపు/ మా నెత్తిపై తాండవిస్తుందిలే..."***

అదే ముగింపు వాక్యాల్లో ఒక భవితపట్ల ఆశాభావం కనిపిస్తుంది. రేపటికి తప్పక ఈ సమాజం జెండర్ తో సంబంధం లేకుండా ప్రతి ప్రాణిని గౌరవించే తత్వాన్ని అలవరుచుకుంటుందనే ఆశభావమది.

ఈ కవిని తొలిసంపుటి నుంచీ చూస్తున్నాను. కవిత్వంలో తొలుత అమాయకత్వం కనిపించేది కానీ రగిలే కాంక్ష తొంగిచూసేది. చూస్తుండగానే ఇతగాడు నాల్గవ సంపుటిదాక నడిసొచ్చాడు. ఈ ప్రయాణంలో అతని కవిత్వంలో గొప్ప పరిణామం చూస్తాం, పరిణితి చూస్తాం, "వై" లో కవితా సాధికారత స్పష్టంగా కనిపిస్తుంది. గొప్ప కవితా పంక్తులు కావ్యం నిండా పరుచుకున్నాయి. జాని తొలికావ్యం చూసి నవ్వుకున్నవాళ్ళు ప్రస్తుత కావ్యాన్ని చూసి ముక్కున వేలేసుకోవడాన్ని చూస్తున్నాను. నిక్కచ్చిగా చెప్పాలంటే రేపటికి ఇతడు ప్రామిస్. గొప్ప కవిత్వానికి యితడు ఒక ఆలంబన. ఈ కావ్యం చదివాక ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా హిజ్రాలపట్ల సాఫ్ట్ కార్నర్ ఏర్పడటం తథ్యం అది "వై" కావ్యానికి ఉన్న శక్తి..అభినందనలు.

♦

## ఊరి చివర

- జాని. తక్కెడశిల
7259511956

చెట్టుకేం తెలుసని?
బొట్లు బొట్లుగా
ఆకాశపు ముంచేతి మీద రాలడం తప్ప
నీడ కింద కుక్క మూలుగుతూ...

అప్పుడప్పుడు
పాములు కూడా మొరుగుతాయి
నీలాగా నాలాగా లోపలికో బయటికో
మొరిగి మొరిగి ఆకాశానికి వేలాడే
భూమిలో ఇంకిపోతాయి...

ఇంటికి బొక్కపడటంతో
నగ్ననామ సంవత్సరం ఉదయించింది
గోడమీద బల్లి పాకిన చారలు
వెక్కరిస్తూ నా కంట్లో...

ఉదాటున పొగలు పొగలు లేచి
చేతి మణికట్టు మీద నిలబడి
నాలుగు దిక్కులకి చేరుతాయి
ఐదో దిక్కు రొమ్ము పగిలింది....

చేతులు ఊపి ఊపి అలసిపోయారు
ఇక కన్నులూపాల్సిందే....
విరిగిన చూపులు నలిగి
లజ్జ నటిస్తూ సూర్యుడి దేహంలో...



ఎవరో నా భుజం మీద
చేయి వేసినట్టు అనిపిస్తుంది
ఇంకెవరో పిలిచినట్టు
ఒక సన్నని పొలికేక...

సమాధానం చెప్పేలోపే
మరొకరి గొంతులో
సమాధానం ములుగుతుంది
ఊరి చివర బొంద్రాయిలా
నేనొక్కడినే...

పిచ్చి టెంకాయలు పగిలిపోతాయి
పుచ్చు హోరతులు
గాలికి ఆహుతులౌతాయి

పళ్ళెంలో చిల్లర
ఘొల్లు ఘొల్లు మంటుంది...

బొంద్రాయి కక్కుకుంటుంది
రక్తంలాంటిదేదో పారుతుంది
చేతిలోకి తీసుకున్నారు
వరాహం పక్కనే కూర్చుంది...

ఇప్పటికీ చెట్టుకేమి తెలియదు!
రాలుతూనే ఉంటుంది...
బహుశ కాలాన్ని చూసి
నేర్చుకుందేమో....!
♦

---

## ఇదే...నేటి నిజం !

- హరి అంబటి

నిన్న.....

నెత్తిమీద బట్టలమూట ఎట్టుకొని
గుండె బరువును
కంటి నుంచి ఒంపుకుంటూ...
పొట్టకూటి కోసం
పల్లెతల్లిని విడిచి
పట్నం బయలెల్లిన వాళ్ళ తాత...!

నేడు....

బుర్రనిండా సదువెక్కించు'కొని'
సంకలో కంప్యూటర్ పట్టుకొని
యంత్రాల మధ్య తను ఇరుక్కుని
ఇటు పల్లెకు...
అటు పరాయి దేశానికి...
ఎటూ కానీ వాడిలా
మిగిలిపోయాడు....వీడు..



కథ




# మట్టిపెల్ల వాసన

- విజయ్ - 9490122229

అది కటారుపల్లె.

వేమన నడయాడిన పల్లె. ఇప్పుడక్కడ వేమన సమాధి ఉంది. సమాధి చుట్టూ వేమన చెప్పిన పద్యాలు గోడలపై చెక్కినారు. ఆయన సమాధి చూసేందుకు రోజూ ఎవరోఒకరు వచ్చిపోతుంటారు. వేమనను గుర్తుచేసుకుంటూ ఉంటారు.

ఆ రోజు ఓ స్కూలు బస్సు వచ్చి ఆగింది. బస్సులోంచి పిల్లలందరూ దిగుతున్నారు.

"జాగ్రత్తగా దిగండి. అందరూ క్యూలో వేమన సమాధి దగ్గరకు వెళ్ళండి" సంధ్య టీచరు జాగ్రత్తలు చెపుతోంది.

పిల్లలందరూ క్యూలో లోపలికి వెళ్లారు.

సమాధికి దగ్గర్లో ఉన్న ఇళ్ళలోని వాళ్ళు వచ్చి తొంగిచూస్తున్నారు. వాళ్ళలో ఒకాయన సంధ్య టీచరును గుర్తుపట్టినాడు.

"ఏమ్మా! సంధ్యా బాగున్నావా? ఊరువదిలాక ఊరునే మరచిపోయినావు కదమ్మా" అన్నాడు కామ్రేడ్ వెంకటరెడ్డి. వెంకటరెడ్డి గతంలో కమ్యూనిస్టు పార్టీలో పనిచేసేవాడు. అందుకాయన్ను కామ్రేడ్ వెంకటరెడ్డి అని పిలుస్తుంటారు.

ఇంతలో వేమన సమాధి ఆవరణలోకి పోయిన పిల్లలంతా చుట్టూ శిలాఫలకాలపై రాసిన వేమన పద్యాలు చదువుతున్నారు. ఒక పిల్లకాయ మాత్రం

"భూమిలోన బుట్టు భూసారమెల్ల
తనువులోన బుట్టు తత్వమెల్ల
శ్రమములోన బుట్టు సర్వంబు తానౌను

విశ్వదాభిరామ వినురవేమ! అంటూ గట్టిగా చదువుతున్నాడు. అందరూవింటున్నారు. ఇలా తలా ఒక్కరు ఒక్కోపద్యం చదువుతున్నారు.

"లేదంకుల్! నేనిప్పుడు కర్నూలులో ప్రైవేటు స్కూలులో పనిచేస్తున్నాను. అక్కడే ఉంటున్నా. మన ఊరిని చూసినట్లుంటదని ఇట్లా స్కూలు పిల్లలను పిలుచుకొని వచ్చినా. తిమ్మమ్మ మర్రిమాను కూడా చూపించాలి" అన్నది.

"మీ అమ్మనాన్న పోయినాక మీ అన్న, నువ్వు ఈ ఊరే వదిలిపోతిరి. మీ నాయన చానా కష్టపడతావుండే. మంచిరైతు. వానలు రాక సేద్యం బాగా కష్టమైపోతాందమ్మా"

అన్నాడు కామ్రేడ్ వెంకటరెడ్డి.

'ఆంటి! కిశోరన్న ఎట్లా వున్నారంకుల్' అడిగింది ఆప్యాయంగా సంధ్య.

"ఏంబాగోలేమ్మా! కిశోర్‌కూ అనారోగ్యమే. మీ చిన్నమ్మకు ఆరోగ్యమూ అంతంత మాత్రమే. పల్లెనొదల్లేక పట్నంలో బతకలేక ఇలా పోతాంది బతుకు" భారంగా అన్నాడు.

ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. ముంగారు కార్తె వచ్చింది. వానలు పడతాయమో నని ఆశ. ఒక్కో సినుకు వంటిమీద పడినపుడల్లా వళ్ళు పులకరిస్తోంది. "అమ్మా! వానస్తాదేమో పిల్లల్లకు వేమనను చూపించమ్మా, ఇంట్లో పనుంది వస్తానమ్మా" అంటూ వెళ్ళిపోయాడు వెంకటరెడ్డి.

ఒక్కోసినుకు పడేకొద్ది మట్టి వాసన పెరుగుతోంది. కమ్మగా నేతిగుట్టువాసనలా వుంది. ఆ చుట్టూ పక్కల ఇళ్ళలో హడావిడి వుంది. 'ఒరే పైన వడియాలు వేసినామురా తడిసిపోతాయేమో తీసుకురాపోరా' అంటోంది ఒక పెద్దమ్మ తన కొడుకుతో.

'వానాడెస్తాదమ్మా! అన్ని పై పై మోడాలు. ఎక్కడో వూర్లు కొట్టుకపోతావుంటే మనకు వానొస్తాది. ఆ మోడాలేమైన కురిసేటివా పాడా!' అంటున్నాడు కొడుకు.

ఆమె బతిమాలింది. అయిష్టంగా మిద్దెమీదకు పోయినాడు. నల్లటి రగ్గుమీద రాత్రిపూట నక్షత్రాల్లా మెరుస్తున్న వడియాలను చూసస్తూ వడియాల రగ్గును మడచి తీసుకొస్తున్నాడు.

సినుకులు పెరుగుతున్నాయి.

"వానవస్తావుంది, తొందరగా సమాధి చూచి నమస్కారం చేసిరండి" అంటూ పిల్లలందరికీ బిగ్గరగా చెప్పింది సంధ్య.

పిల్లలందరూ బస్సు ఎక్కడానికి మళ్ళీ క్యూలో వస్తున్నారు. పిల్లలందరూ బస్సు ఎక్కినారోలేదో చూసుకొని తానూ ఎక్కింది. బస్సు కదిలింది. వర్షం పడటం మొదలైంది. ఆమె మదిలో జ్ఞాపకాల వరద మొదలైంది.

◆◆◆

"ఒరే శివా వానొచ్చేటట్లు ఉంది. ఆకాశం నిండా మబ్బులు నిండాయిరా మిద్దెపైన ఎండేసిన శనిక్కాయలు మూటల్లోకి కట్టేయరా" అన్నాడు వేమారెడ్డి తన కొడుకుతో.

"యాడపడతాయి నాన్నా, నీభ్రమగాని, మబ్బులు వస్తాయి. పెద్దగాలి వీస్తేచాలు పోతాయి. కదిరి తాలూకాలో వాన పడతాందా! నాన్నా. నువు ఊరక కొన్నావు, డబ్బుదండగ".

"శివా! మబ్బుచూడరా! ఎట్లా ఉరుముతాందో! వాన కచ్చితంగా వస్తాదిరా! రేపు భూమి దుక్కిదున్ని రెడీచేసుకుని గుంటకు పాయాలిరా"

"పోనాన్న! "అంటూ అయిష్టంగానే కదిలాడు శివ.

అప్పుడే బడి నుంచి వచ్చిన సంధ్య హొంవర్క్ చేసేందుకు కూర్చుంది. కానీ కరెంటు పోయింది. దాంతో వాటిని వదిలిపెట్టి అమ్మ దగ్గరకు పోయింది.

శివ మూటల్ని గబాగబా కట్టేసి పై నుండే గదిలోనే వాటిని పెట్టేసి వచ్చినాడు. తుంపర మొదలైంది. కిందికి వచ్చినాడు. "ఇప్పుడు తుంపర పడతాంది. వాన వచ్చేదిలేదు. పోయేదిలేదు పైమోడాల వాన. నీ తాపత్రయంగాని. ఆభూములు అమ్మేద్దాం నాన్నా. కదిరిలో ఒక చిన్న అంగడి పెట్టుకొని బతకొచ్చు. ఎప్పుడు అప్పులేతప్ప ఏమన్నా పైసా ఆదాయం ఉందా?" అన్నాడు శివ.

కొడుకు చెప్పేదాంట్లో నిజం లేకపోలేదు. తనకు తన నాయనద్వారా వచ్చిన ఐదెకరాలు తప్పితే అదనంగా సంపాదించింది ఏమీలేదు. ఇన్నేండ్లలో తాను చేసిందేముంది. ఆరుగాలం రెక్కల కష్టం తప్ప. ఇంటర్ చదివే కొడుకు మధ్యలో చదువు మానేసినాడు. ఇప్పుడిప్పుడే పనిలోకి వస్తున్నాడు. కూతురునైనా బాగా చదివించాలని అనుకుంటున్నాడు. కొడుకు చెప్పిందానికి ఏంచెప్పాలో తోచక మౌనంగా ఉన్నాడు తను.

అప్పుడే అటువైపు పోతున్న కొండారెడ్డి, "వేమారెడ్డి బాగున్నావా?" అని గట్టిగా పిలుస్తూ పలకరించాడు.

బయటకు బయలుదేరిన వేమారెడ్డి మసకవెలుతురులో కొండారెడ్డి గొంతు గుర్తుపట్టి "ఏం కొండారెడ్డి ఏప్పుడు వచ్చావు పులివెందుల నుంచి. రారా! బోంచేసి పోదురా!"

నాకు టైంలేదు వేమారెడ్డి అంటూనే ఇంట్లోకి ప్రవేశించాడు కొండారెడ్డి.

ఇంతలో లోపల్నించి వేమారెడ్డి భార్య రమణమ్మ వచ్చింది. 'ఏమన్నా! బాగున్నారా! అని పలుకరించింది కొండారెడ్డి.

''కాఫీ తెస్తానుండన్నా!'' అంటూ మరోమాట మాట్లాడకుండా లోపలికి పోయింది.

కొండారెడ్డి లోపలికి వచ్చి నులక మంచం మీద కూర్చొన్నాడు.

"సేద్యం ఎట్లావుంది" అనడిగాడు కొండారెడ్డి.

"ముందునుయ్యి వెనక గొయ్యి లాగుంది కొండారెడ్డీ. వానలు రావటంలే. వచ్చినా టైంకు పడవు. నీకు తెలీందేముంది. ఈడంతా కరువేగదా! పిలస్తేపలుకేది కరువు. పిలువకపోయినా వస్తాది ఈడకరువు. మా కొడుకేమో వద్దు నాన్నా వ్యవసాయం అంటాడు. భూములమ్మేసి కదిరిలో ఏదన్నా వ్యాపారం పెడదామంటాడు. అదేందిరా తాతల కాలం నుండి వచ్చిన భూమిని అమ్మితే ఎట్లరా! అంటూ భూమినే నమ్ముకొనివుండా. ఈసారి దేవుడు ఏంచేస్తాడో ఏమో!" అన్నాడు భారంగా వేమారెడ్డి.

"నిజమే నన్నా వస్తావుంటే చూసినాగదా! కేవలం చాలా అధ్వాన్నంగా వుంది. ఇక్కడున్నంతా కరవు నేనెన్నడూచూడలే. పులివెందుల్లో ఇంతవుండదు వేమా!" అన్నాడు.

మౌనంగా వింటున్నాడు వేమారెడ్డి.

"మీ ఎమ్మెల్యేలు అంతోఇంతో పోరాడుతాండారు. మీకు హంద్రీనీవా నీళ్ళు వస్తాయంటాండారు. సైన్సు సిటి కూడా వస్తాదంటాండారు. అదొస్తే కొన్ని ఉద్యోగాలన్నా వస్తాయిలే".

ఇంతలో కాఫీ తీసుకొని వచ్చింది రమణమ్మ "ఏందన్నా వచ్చేది ఉద్యోగాలు" మొన్నటికి మొన్న అదేదో సైన్సు సిటి అంటాఉండిరి. అదంతా ఒట్టిదంట గదన్నా" అది ఎత్తపోయిందంటండారు. మా కదిరికి అది వచ్చేదా అయ్యేదా? యానాకొడుకన్నా అడుగుతాంటే కదన్నా" రమణమ్మ గొంతు కలిపింది వాళ్ళతో.

కాఫీ తాగడం పూర్తి చేసి, "అప్పుడే అనుకున్నా! ల్యాకుంటే మా పులివెందులోల్లు ఇప్పటికే భూముల్ని కొనేసే వాళ్ళు. కొనలేదంటే ఇది ఎత్తిపోయేదే అని అందరు అంటూ వున్నార్లే". అన్నాడు కొండారెడ్డి. "నీకొడుకు చెప్పేదే రైటనిపిస్తాంది వేమా, ఒకసారి ఆలోచించు" అంటూ లేచి చెప్పులు తొడుక్కుబోయాడు.

"మబ్బులో ఏం పోతావులేన్నా! రాత్రికి వుండి రేపు పోదువులేన్న" రమణమ్మ ఆప్యాయంగా చెప్పింది.

"లేదమ్మా! మీకు తెలీందేముంది. చానా పన్లున్నాయి. మళ్ళీ వస్తా" అంటూ చెప్పులు తొడుక్కొని గబాగబా వెళ్ళిపోయాడు.

♦♦♦

బస్సు గాండ్లపెంటలో పోలీసుస్టేషను దగ్గరున్న స్పీడుబ్రేకరును మెల్లిగా దాటుతోంది.

పొద్దున్నే రమణమ్మ పొత్తికడుపులో నొప్పి అని చెప్పింది. అమెను కదిరికి గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకుపోయినాడు వేమారెడ్డి. పరీక్షలన్నీ చేసి మందు రాసిచ్చినారు. వచ్చేటప్పుడు డాక్టరు ఏమిచెప్పినాడో ఏమో దిగులుగా వచ్చినాడు.

సాయంత్రం బడినుంచి ఇంటికి రాగానే "సంధ్యా! నువు రేపట్నించి మీ మామయ్య ఇంట్లో వుండు. రెండురోజులు మీ అమ్మకు కర్నూలు డాక్టరు దగ్గర చూపించాల! అన్నాడు తండ్రి.

సరే అని తలూపింది తను.

ఇంతలో శివ వచ్చినాడు బయట నుంచి.

"శివా! నువు చెప్పినట్లు శెనిక్కాయలు అమ్మేయిరా!" అన్నాడు వేమారెడ్డి.

శివ ఆశ్చర్యంగా, ప్రశ్నార్థకంగా చూసినాడు.

"మీ అమ్మకు బాగలేదురా! ఆపరేషను చేయాలంట. కర్నూలుకు పోవాలంట. కదిరిలో డాక్టరు చెప్పినాడు. అర్జంటుగా పోవాలంట. గర్భ సంచికి కాన్సరు వచ్చిందంటరా! మీమామ రాజారెడ్డి దగ్గర ఏమన్నా డబ్బు ఉంటాదేమో అడిగొస్తా." అంటూ వెళ్ళిపోయాడు.

గంటలో తిరిగొచ్చాడు.

"సంధ్యా నువు మామింట్లో జాగ్రత్తగా ఉండమ్మా! రెండ్రొజుల్లో మళ్ళీ వస్తాము" ప్రేమగా చెప్పింది అమ్మ.

"శివా! నువు కూడా రారా! ఆపరేషనంటే ఒక మనిషి తోడుండాలిగదా! పోదాంరా!" తండ్రి చెప్పగానే శివ కూడా బయలుదేరినాడు.

రెండ్రోజులు వారం రోజులయింది. ఈటెస్టులు, ఆటెస్టులు అంటూ వారంరోజులు చేసినారు. ఆఖరుకు వారం కాస్త పదిరోజులైంది. అప్పటికే తెచ్చుకొన్న డబ్బైపోయింది. ఎంతఖర్చయ్యేది డాక్టర్లు చెప్పలేదు. నువ్విడే వుండు. నేను పల్లెకుపోయి చిన్నరామప్ప దగ్గర డబ్బు ఇప్పించుకొనివస్తా" అని పోయినాడు తండ్రి.

మరుసటిరోజు సాయంత్రం వచ్చినాడు.

డాక్టర్లు ఆపరేషన్ను చేయాలని చెప్పినారు. రెండు లక్షలవుతుందన్నారు. అది ప్రైవేటు ఆసుపత్రి. అయితే ఆ

డాక్టరు ఆపరేషను ప్రభుత్వ ఆసుపత్రిలో చేయిస్తాడు. ఆపరేషను అయినాక మళ్ళీ తన ఆసుపత్రిలో మందులిస్తూ చూసుకుంటాడట. అంతా కలిసి లక్షన్నా కట్టమన్నారు. సరేలే, ప్రాణం మీదకొస్తే తప్పుతుందా? తెచ్చిన డబ్బులు కట్టేసినాడు.

రెండ్రోజుల్లో డిశ్చార్జి చేస్తారనంగా ఊపిరితిత్తుల్లో ఏదో అయింది. శ్వాస పీల్చటం కష్టం అయింది. డాక్టరు నేనేమీ చేయలేనని చేతులెత్తేసినాడు.

ఆమె తుది శ్వాసవిడిచింది.

భార్య మరణించినప్పటి నుంచి వేమారెడ్డికి మనసులో మనసులేదు. ఇంట్లో ఆడతోడు వుంటేనే మగవాడికి ధైర్యం. ఆమె పిల్లలను చూసుకుంటుంది. టయానికి అన్నం చేసిపెడుతుంది. ఏమైనా సమస్యలొస్తే సలహాలిస్తుంటూంది. ఇప్పుడవన్నీలేవు.

కూతురును ఎలా సాకాలా అనుకుంటూ తనలోతాను బాధపడతా ఉన్నాడు వేమారెడ్డి. ఎవరితో మాట్లాడినా సానుభూతి మాటలు వింటున్నాడు. "ఆయ్యో! వేమా ఎంతపనైపాయ. భగవంతుడు ఆమెను ఇంత తొందరగా తీసుకుపోవాల. దేవుడెప్పుడూ మంచోళ్ళనే ముందు తీసుకుపోతుంటాడు. ఏమిచేస్తాం." వేమారెడ్డికి అనుదినం ఎవరోఒకరు సానుభూతి మాటలు వినిపించేవారు.

ఒకరోజు రాత్రి పక్కింటి సిద్దప్ప చేను దగ్గరకు పోతున్నానంటూ కొడుకు శివతో చెప్పి బయలుదేరినాడు.

సంధ్య హొమ్‌వర్క్ పూర్తిచేసి, భోంచేసి నిద్రించింది.

శివ ఆ వూరి లైబ్రరీ నుంచి తెచ్చుకున్న సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రాసిన 'ఒక్క వానచాలు' నవల చదువుతున్నాడు. నిద్రరాగానే పుస్తకం పక్కన పెట్టి నిద్రపోయాడు.

రోజులాగనే తెల్లవారింది. పక్కన మంచం మీద చూస్తే నాన్న లేడు. రాత్రి సిద్దప్ప చేను దగ్గరికి పోయిన నాన్న రాలేదా? లేదా అప్పుడే పొద్దున్నే లేచి బయటకు పోయినాడా! అనుకుంటూ ఇంట్లోబయటా చూచినాడు శివ.

నాన్న కనిపించకపోయేసరికి బయట దూరంగా చెట్టుకింద పండ్లుతోముకుంటున్న సిద్దప్పతో అడిగినాడు.

"సిద్దప్పన్నా! మా నాయన రాత్రి మీచేను దగ్గరికి వచ్చినాడే కనిపించలేదా!"

ఏమోరా! రాత్రి నేను పోలే, నాకొడుకు పోయినాడు. అయినా ఆడచేసే పనేముంది. పక్కన రామిగాని తోట దగ్గర పడుకొనుంటాడేమో చూడు"

గబాగబా సిద్దప్ప చేను దగ్గరకి పోయినాడు. రామిగాడు రొప్పుకుంటూ వస్తూ 'శివన్నా!' 'శివన్నా! మీనాన్న అక్కడ పడిపోయుండాడు" అని గట్టిగా అరచినాడు.

శివ గుండెలు గుభేలుమన్నాయి. ఏమైంది నాయనకు అంటూ అటువైపు పరుగెత్తాడు. తన తండ్రి ఈ లోకం విడిచినాడు. నోట్లో నురగ వచ్చింది. రామిగాడు చూసి 'ఏదన్నా పురుగు కరిచిందేమో శివన్నా" అన్నాడు.

దు:ఖం లావాలా ఎగచిమ్మింది శివకు. ఏమిచేయాలో పాలుపోలేదు. తనబతుకు నడిసముద్రంలో విడిచిపోయారిద్దరూ. అందరూ సాయం చేసినారు. దహన సంస్కారాలు అయినాక ఒక నిర్ణయానికొచ్చాడు తన అన్న శివ.

ఒకెకరా మినహా మిగతా భూముల్ని అమ్మేసి కదిరికి పయనమయ్యాడు. అక్కడ మెయన్‌రోడ్డులో బాడుగింట్లో సరుకులంగడి పెట్టుకున్నాడు. సంధ్యను డిగ్రీదాకా చదివించాడు. బిఎడ్ పూర్తయ్యాక కర్నూలులో ప్రైవేటు స్కూలులో చేరింది. ఈరోజు మళ్ళీ ఇలావచ్చింది తనవూరుకు.

♦♦♦

కన్నీరు జ్ఞాపకాల వరదలా ఉబికాయి.

ఒక కన్నీటి చుక్క రాలి తనచేతి మీద పడటంతో ఈ లోకంలోకి వచ్చింది సంధ్య. అప్పుడే పిల్లలు టీచర్ టీచర్ 'తిమ్మమ్మ మర్రిమాను వచ్చింది' అంటూ ఆనందంలో అరుస్తున్నారు.

కళ్ళు తుడుచుకుంటూ బస్సు దిగింది సంధ్య.

అప్పుడే ఆకాశంలో సూర్యుడు తేజోవంతంగా తనకాంతిని వెదజల్లుతున్నాడు. మబ్బు తునకలంతా చెల్లాచెదరయ్యాయి. ఎక్కడో వాన తుంపర్లు పడుతూ మట్టివాసనల మకరందం ముక్కుపుటాల్ని తాకుతోంది. దూరంగా ఆకాశంలో హరివిల్లు ఏర్పడింది.

వేల ఎకరాల్లో పరుచుకున్న ప్రపంచ ప్రసిద్ధిచెందిన 'తిమ్మమ్మ మర్రిమాను' విశాలంగా కరువునేలపై పరుచుకొని వందల సంవత్సరాల కరువుకు సాక్ష్యంగా నిలిచివుంది.

కరువు మేఘం మళ్ళీ అలుముకుంటోందని ఆ పిల్లలకు ఏ మాత్రం తెలీదు, ఒక్క సంధ్యకు తప్ప. ♦

# అట్టడుగుల ఆగ్రహ ప్రకటన "నీలవేణి" కథాసంపుటి






- ఎమ్వీ రామిరెడ్డి
9866777870

కడుపు నిండినోడు ఏం జేస్తాడు?

బ్రేవ్ మని త్రేన్చి, బ్రేకింగ్ న్యూస్ సృష్టిస్తాడు. పోసుకోలు కబుర్లతో పోరంబోకు సంఘాలు స్థాపిస్తాడు. పని గట్టుకుని పనికిమాలిన వ్యవహారాల్లో తల దూరుస్తాడు. తన కులాన్నో మతాన్నో అధికారాన్నో సంపదనో ప్లకార్డులా పట్టుకుని ఆధిపత్యం నిరూపించుకోవడానికి శ్రమిస్తాడు.

కడుపు మండినోడు ఏం జేస్తాడు?

ఆకలి వెనక అదృశ్యశక్తుల గురించి ఆరా తీస్తాడు. బతుకుల మీదా, మెతుకుల మీదా ఇనప పాదాలు మోపుతున్న వాడి మొహాన 'థూ' అని ఉమ్మేస్తాడు. లోలోపల తరాల తరబడి మిగుల మాగిన భావతీవ్రతను భళ్లున కక్కేస్తాడు.

పి.వి.సునీల్ కుమార్ కథల నిండా కడుపు మండినోళ్లే ఉంటారు. నిండినోళ్లూ ఉంటారు. కానీ మండినోడిని మన రచయిత పక్షపాత బుద్ధితో భుజాన వేసుకుంటాడు. వాళ్ల మాటల్లోకి ఏనుగుల్ని ప్రవేశపెట్టి, దుర్మార్గుల కుంభస్థలాల్ని బద్దలు కొట్టిస్తాడు.

రచయితగా తన కర్తవ్యాన్ని కఠినసుందరంగా నిర్వర్తిస్తాడు!

ముందుగా ఒక హెచ్చరిక!

"నీలవేణి" కథాసంపుటిలోకి దూకి 'గుండమ్మ కథ సినిమా' అనుభూతించాలని ఆశించొద్దు. ఎందుకంటే మనకు యర్నాల్డు స్క్వార్జ్‌నగర్ గాడి 'టెర్మినేటర్' కనిపిస్తుంది.

మానవీయ పాత్రల కోసం వెదకబోతే దయ్యాలు ప్రత్యక్షమవుతాయి. అవి కుండలు బద్దలు కొడుతూ అన్నీ నిజాలే చెబుతుంటే, మన మధ్యనే నక్కి మనల్ని మరగుజ్జులుగా మారుస్తున్న దైనందిన దుర్మార్గాలు కళ్ల ముందు కదుల్తాయి.

రచయిత ప్రధానంగా మానవ సంబంధాల్లోని డొల్లతనాన్ని ఉతికి ఆరేయాలని కంకణం కట్టుకున్నాడు. అందుకోసం మనుషుల్ని కాకుండా దయ్యాల్ని ఎన్నుకున్నాడు. ఇక అడ్డేముంది! వాటిని అడ్డం పెట్టుకుని, కథలకు వేల గుర్రాలు పూన్చి వాయువేగంతో దౌడు తీయిస్తాడు.

దయ్యం ప్రధాన పాత్రగా రెండు కథలున్నాయి. ముందుగా రెండో దయ్యం గురించి చెప్పాలి. ఎందుకంటే, పేరుకే అది దయ్యం. నిజానికి మానవీయ విలువలు పుష్కలంగా ఉన్న (అ)ప్రాణి అది.

క్లుప్తంగా కథ ఏమిటంటే... యువరాజు ఓ నిరుపేద. సెక్యూరిటీ గార్డుగా ఉద్యోగంలో చేరతాడు. సిటీ శివారులో ఎక్కడో ఓ ఏటీఎం అతని ఆఫీసు. 'బంజారాహిల్స్‌లోని బంగళాలో దిగి, బెంజ్‌లో అప్ అండ్ డౌన్ చేస్తే తనకొచ్చే అయిదు వేల జీతం హాంఫట్ అవుతుంది కాబట్టి', పాడుబడ్డ కొంపలో అద్దెకు దిగుతాడు. ఇంకేముంది, ఆ రాత్రే దయ్యం ఎంటరవుతుంది.

తాఠ్, నిన్ను చంపేస్తానంటుంది. 'మోస్ట్ వెల్‌కమ్' అంటాడు యువరాజు. దయ్యం దంగైపోతుంది. కొన్ని సీన్లు నడిచాక, ఇద్దరి మధ్యా ఓ రకమైన సఖ్యత కుదురుతుంది. చివరికి ఇద్దరూ 'కలిసుందాం రా' అనుకునే స్థాయికి వస్తారు. ఇంతే కథ. ఈ కాస్తలోనే తెలుగు భాష దుస్థితినీ, పేదరికం తాలూకు నగ్నత్వాన్నీ, మనుషుల మధ్య మృగ్యమవుతున్న బంధాల్నీ, ఆడవాళ్ల పట్ల అమలవుతున్న అమానుషత్వాన్నీ రచయిత అద్భుత నైపుణ్యంతో ప్రస్తావిస్తాడు.

కథను నడిపించడానికి తాను ఎన్నుకున్న శైలి అసామాన్యమైనది.

'అక్షరాస్యత మాత్రమే ఉండి చదవడం, రాయడం మరిచిపోయిన చాలామంది తెలుగువాళ్లలానే' యువరాజుకు "పైకి దరి" (అచ్చుతప్పు కాదు, అక్కడ అలానే రాసి ఉందని రచయిత స్పష్టం చేస్తాడు) కనబడుతుంది. 'రప్పరప్ప' పైకి వెళ్తాడు. 'వాడిది మెదక్ జిల్లా జహీరాబాద్ గనుక రప్పరప్ప పోయాడు. అదే బెజవాడో గుంటూరో అయితే చకచకా పైకి వెళ్లేవాడు' అనడం వెనక రచయిత నిశిత పరిశీలనను గమనించవచ్చు. "నోట్లదయ్యంలా ఉంది ఆ ఏటీఎం" అంటాడు.

దయ్యం తనను చంపేస్తానని బెదిరించినప్పుడు, యువరాజు ప్రతిస్పందన చూద్దాం...

"చంపదలుచుకుంటే నేను పడుకున్నాక నిద్రలోనే చంపొచ్చు కదా. ఈ లైటు పాడు చెయ్యడాలు, ఆ ఫ్యాను తిప్పడాలు, తలుపులు బాదడాలు ఎందుకు? పైగా ఎంగిలి కంచం ఎత్తి పడేసినావు. ఆ ఎంగిలంతా ఎవడు ఎత్తుతాడు నీ బాబు" అంటాడు.

పైగా 'రేయ్, నేను దయ్యాన్నిరా. నన్ను చూస్తే నీ కాళ్లు వణకడం లేదా?' అని దయ్యం కసిరినప్పుడు... "సినిమా అయితే పైసలు పెట్టి టిక్కెట్టు కొంటాం కాబట్టి భయపడి తీరాలి. లేకపోతే డబ్బు బొక్క. నువ్వు ఫ్రీగా కనబడుతున్నావు. నేనెందుకు భయపడాలి?" అంటాడు మరింత తాపీగా.

అంతటితో ఆగడు. 'నీ మాట నాకు నగవే అర్థమవుతుంది' అని దయ్యం బుర్ర (ఉండి ఉంటే!) గోక్కున్నప్పుడు... యువరాజు మరింత రెచ్చిపోతాడు. "నువ్వు దెయ్యానివి. నీకు అన్ని యాసలు, భాషలు తెలియాలె. మేమంటే మనుషులం కాబట్టి పోలేం గానీ నువ్వు గాలివి. రేపు ఏ జపానో, జర్మనీనో పోయినవనుకో అక్కడి భాష తెలియకపోతే ఏం జేస్తవ్? బిచ్చుమెత్తుకుంటవా?" అంటాడు.

ఇద్దరి మధ్యా స్నేహం కుదిరాక "మనిషికున్న పాటి నీతి దయ్యానికి లేకపోతే ఎలా? నిన్న చంపుతనని, ఇయాల చంపనని మాట మారుస్తే దయ్యాల ఇజ్జత్ మూసీలో కలవదా?" అని రివర్స్ గేర్‌లో హూంకరిస్తాడు.

"మీ బాపు ఎలా చనిపోయాడు? ఆయనకు తాగుడులాంటి చెడ్డ అలవాటు ఉండేదా?" అని దయ్యం అడిగినప్పుడు... రచయిత యువరాజుతో చెప్పించిన సమాధానం చదవగానే కనిపించని దయ్యమేదో నిజంగానే మన చెంప ఛెళ్లుమనిపించినట్లు ఉలిక్కిపడతాం.

"అంతకంటే చెడ్డ అలవాటుండేది... వ్యవసాయం! దాంతో అప్పులు; గుండె ఫెయిల్".

ఇలాంటి రసవత్తర వాక్యాల్ని ఎరగా వేసి పాఠకుణ్ని కథలోకి బరబరా ఈడ్చుకుపోవడంలో సునీల్ కుమార్ దిట్ట.

"దయ్యం 2" కథ నిస్సందేహంగా ఓ అద్భుత సృష్టి.

మొదటి "దయ్యం" కథ కూడా మనల్ని ఊపిరి పీల్చుకోనివ్వదు.

రాయల్ స్టాగ్ రంగడినీ, ఓల్డ్‌మాంక్ మంగారావునీ విరగదీసి అరవై వేలు చేసే ఇంటిని రెండు వేలకే కొట్టేసిన సత్యానందం కథ ఇది. కథగా చెప్పుకోవడానికి ఏమీ ఉండదు. కానీ దాన్ని నడిపిన విధానం అపురూపం. కొన్ని వాక్యాలనైనా అవలోకించి తీరాల్సిందే...

"డ్యూటీ ఎక్కిన కొత్త కుర్ర పోలీసోడిలా దయ్యం యూనిఫాం మెయింటెయిన్ చేస్తూ, కాలనీ పక్క యెగ్గెన్నారాయణ మామిడితోటలో డ్యూటీ మీద విరగ తిరుగుతూ ఉంది".

"కానీ మంగ దయ్యం వి.ఆర్.ఎస్. తీసుకునే బాపతు కాదనీ, కేవలం రెండు రోజుల కాజువల్ లీవు మీద వెళ్లిందనీ ఆ రాత్రే అర్థమైంది".

"ఆ రాత్రంతా వీర్రాజుగాడి కొంప చుట్టూ ఐటెం సాంగులో ముమైత్‌ఖాన్‌లా రెచ్చిపోయి దాన్సింగాడేసింది"... ఇట్లాంటి వాక్యాల వరదలో 'దయ్యం పట్టినట్లు' కొట్టుకుపోతాం.

వ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన అపసవ్య భావనలు, అరాచక పద్ధతులు, అక్రమ పోకడలపై ఎక్కుపెట్టిన కథాస్త్రం "తోక దెయ్యం చెప్పిన డిసిప్లి కథ". ముదిరిపోయిన ఆ రోగాలకు అక్షరచికిత్స చేయడానికి కుక్కను ప్రధాన పాత్రగా ఎన్నుకోవడంలోనే రచయిత నైపుణ్యం కనిపిస్తుంది.

వ్యంగ్యం భూమికగా ఈ కథను కొత్త పుంతలు తొక్కించారు.

పాపం, సింగపూర్ ఇప్పుడు సింగపూర్లో మాయమైపోయి అనేక రాష్ట్రాల్లో ప్రత్యక్షమవుతోంది. ప్రజల కంటికి ఆ 'సింగపు' అందాలు కనిపించకపోయినా, పాలకుల మాటల్లోనూ పత్రికల రాతల్లోనూ ఆ మెరుపులు రోజూ జిగేల్‌మంటుంటాయి. అందుకే, 'అసలు సింగపూర్' అంటూ రచయిత సుతారంగా చురకలు అంటిస్తారు.

ఉన్నతాధికారులతో గండపెండేరాలు తొడిగించుకోగలిగిన "గబ్బరుడు" ఇందులో మన కథా నాయకుడు. "అతడు తన సొంత బుర్ర వాడినపుడల్లా వాడి తోక కోసి సున్నం పెట్టేవాళ్లు పై ఆఫీసర్లు". గబ్బరుడి అసలు బలం 'డిసిప్లి' అనబడే కుక్క. 'దానికి లా తెలుసు, లాఠీ తెలుసు'. అదే సమయంలో... 'కుక్కకు అభిప్రాయాలు ఉండవనీ, ఒకవేళ ఉన్నా ఏ కరెంటు స్తంభం మీదో పోసేస్తది' అంటూ రచయిత వ్యూహాత్మక చతురత కనబరుస్తాడు.

పై అధికారుల్ని కాకా పట్టేవాళ్లను కూడా డిసిప్లి పేరుతో ఓ ఆట ఆడుకుంటాడు. సామాజిక హోదాలకు పనిగట్టుకుని గౌరవం సమర్పించుకునే దుష్ట సంప్రదాయాల్ని ఏకిపారేస్తాడు. ఎన్నికల సర్వేల దగ్గర్నుంచీ సబార్డినేట్ల సెల్యూట్ల దాకా సందర్భం దొరికిన ప్రతి మజిలీలోనూ అక్షింతలు వేస్తాడు. కాలక్రమేణా విలన్లు హీరోలవుతున్న పోయేకాలపు పోకడల్ని ఉతికి ఆరేస్తాడు.

మైక్రోఫైనాన్స్ వస్తువుగా రాసిన కథ "ఛాయిస్ ఈజ్ యువర్స్". పైపైన చదివితే నాటకీయంగా కనిపించే ఈ కథ... క్రమంగా దాని లోతుల్లోని నిగూఢత కోసం మనం నిజాయితీగా వెతుక్కునే పని కల్పిస్తుంది. ఇంత చిన్న కథలోనే అల్లూరి సీతారామరాజు, యురేనియం, జేఆర్డీ టాటా, శ్రీశ్రీ, అంబేద్కర్‌లను ప్రస్తావించగలగడం ప్రత్యేక నైపుణ్యానికి నిదర్శనం.

"ఊళ్లో తమ కులానికి గానీ, మనుషులుగా తమకి గానీ లేని విలువ మైక్రోఫైనాన్స్ వాళ్ల దగ్గర చూసి దంగైపోయారు పేటలోని జనం"... కుటుంబాల్లోకి రూపాయలు పాయలుపాయలుగా ప్రవహించి, పరమనిష్ఠతో కాటు వేస్తాయన్న విషయాన్ని ఇంతకన్నా అద్భుతంగా చెప్పడం కష్టం.

ప్రచార, ప్రసార సాధనాలు పతన విలువల్ని సైతం పవిత్రంగా మారుస్తాయన్న విశ్లేషణ కథలో అంతర్లీనంగా కలిసిపోయి ఉంటుంది. "ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్న వాడికి కూడా ప్రొడక్టివ్, అన్ ప్రొడక్టివ్ ఎక్స్‌పెండేచర్ ఏమిటో చెప్పని చదువు మనది".

భావి స్థలకాలాలను తీసుకుని బాల్యస్మృతుల్ని నెమరు వేసుకున్న కథ "నాన్న హైదరాబాదొచ్చాడు".

నలభైలు దాటి ఇండియాలో అయితే మిడిలేజూ, అమెరికాలో అయితే హాలీవుడ్ హీరోలు అయ్యే ఏజులో ఉన్న నలుగురికి అడవి నేర్పిన పాఠం... "భయానందం" కథ.

ఇంత వ్యంగ్యం చేతుల్లోకి తీసుకుని నేర్పుగా పాఠకుడి మోహాన కొట్టి, చక్కిలిగిలి పెట్టగల రచయితలు ఇవాళ అరుదు. "సునీల్ అనే నేను" ఆ లోటు పూరించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని, తన కథల ద్వారా ప్రమాణం చేస్తున్నాడు.

అలాగని; అరిగిపోయిన వస్తువులు వెంటేసుకుని, దురాచారాలపై దుమ్మెత్తి పోస్తూ, అవినీతిపై ఆగ్రహజ్వాలలు కురిపిస్తూ పేరు కోసం పేజీలు నింపే రకం కాదు.

నిప్పుల్లాంటి వస్తువులు ఎన్నుకుంటాడు. బడుగుల జీవితాల్లోని బడబాగ్నిలో చలి కాగుతాడు. వాడల వీధుల్లోకి చొచ్చుకుపోయి, అక్కడి నరకాల్లో నిత్యం రేగే గాయాల గురించి రాస్తాడు. ఇక్కడే తను నిరంతర స్పృహతో మసలుకుంటాడు.

ఎంతోమంది చెప్పి పారేసిన రీతిలోనో, కడివెడు కన్నీళ్లు చిప్పిల్లజేసే దృశ్యసమాహారాలతోనో రచనలు చేస్తే జనం వాటి జోలికి వెళ్లరని ఆయనకు బాగా తెలుసు. అందుకే వ్యంగ్యాన్ని వాహకంగా చేసుకున్నాడు. సహజాతి సహజంగా దొర్లే మాటలమూటల్ని కథల్లో డిపాజిట్ చేయడం నేర్చుకున్నాడు.

కాబట్టే, అవినీతి కూడా "సబ్బునురగ" లాంటిదేనని చెప్పగలిగాడు. ఈ కథలో... పార్కింగ్ సౌకర్యం లేకున్నా, ఫైర్‌సేఫ్టీ లేకున్నా, ప్లాన్ అప్రూవల్‌ను నగరం నడిబొడ్డున తొంగలో తొక్కి ఇష్టారాజ్యం షాపింగ్ మాల్స్ కట్టే మార్వాడీలకు "అన్ని శాఖలూ గాంధారి పతిదేవుడి అవతారం ఎత్తి గుడ్డిగన్నయ్యేల్లా" వత్తాసు పలుకుతున్న తీరును తూర్పార బడతాడు.

ఎంత నిజాయితీ అధికారి అయినా, సమాజ సౌభాగ్యం కోసమే కంకణం కట్టుకున్నా... అతను బడుగు కులానికి చెందిన కారణంగా పరమపద సోపానపటంలో తరచూ పాముకాటుకు బలవుతున్న వ్యవస్థ రూపాన్ని ఈ కథలో

ఆవిష్కరిస్తాడు.

సందర్భానుసారంగా ఈ కథలో అంబేద్కర్ "కాన్సిరసీ ఆఫ్ సైలెన్స్" (నిశ్శబ్దపు కుట్ర)ను చర్చకు పెట్టడం రచయిత మేధస్సుకు నిదర్శనం.

చీకటి! కుల చీకటి. మత చీకటి. రాజకీయ చీకటి. అధికార చీకటి. మత్తు చీకటి. మోహపు చీకటి. ఆస్తుల చీకటి. అంతస్తుల చీకటి. చీకట్లు అష్టదిక్కుల నుంచీ వ్యాపించి చంటిగాడి జీవితాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆఖరికి అతనే కొట్టిన సెంటర్‌లైన్ గోల్‌లా అతన్ని ఉరికంబానికెక్కిస్తాయి. జీవితాల్లోని పతనపర్వాలు చీకట్ల రూపంలో చుట్టుముట్టిన కథ "చీకటి".

"వాడలోకి ఎంటరవ్వగానే ఫుల్ సూట్ వేసుకుని, చేత్తో పెద్ద పుస్తకం పట్టుకుని, చెయ్యెత్తి ఏ గాడిద కొడుకురా నా బిడ్డల మీదకొచ్చేది అన్నట్టు కాపు కాస్తున్న" అంబేద్కర్... సునీల్ కథల్లో ఒక ముఖ్య పాత్రధారి. 'చిన్నాచితకా ఉద్యోగాలు చేస్తూ అదే రాజ్యాధికారం అనుకునే తెల్లచొక్కా కూలీల" గురించి వాపోతాడు రచయిత.

'నీడ పడితేనే ఆళ్ల దేవుళ్లు మైల పడతారని, వాడజనాన్ని గుడివీధుల్లో కూడా తిరగనివ్వని' చారిత్రక సత్యాన్ని నిస్సంకోచంగా వెల్లడిస్తాడు.

"మాదిగ పుట్టుక పుట్టినా, మాదిగవాడలో పెరిగినా మాదిగోడ్నని నిరూపించుకునేసరికి" చంటికి ఏసుప్రభువు కనిపిస్తాడు. కష్టనష్టాలన్నీ అధిగమించి, జీవితం కాస్త గాటిలో పడుతున్న సమయంలో తాగుడికి బానిస అవుతాడు చంటి. కాలువ గాలి, ఫుట్‌బాల్ ఆట, బీఈడీ చదువు, ఉద్యోగం... అన్నీ చీకట్లో కలిసిపోయి చివరికి ఉరికంబమెక్కుతాయి.

అయితే, కథనంతా చీకట్లతో నింపేసి, చీకటితోనే ముగించి ఉంటే పాఠకుడు ఒక రకమైన నిరుత్సాహపు ఊబిలో కూరుకుపోయేవాడు. ఇంతటి విధ్వంసచీకటికి కారణమైన నాయుణ్ని... చంటి స్నేహితులతో చంపించడం ద్వారా విలువైన పరిష్కారం కనుగొంటాడు రచయిత.

మాలమాదిగల దుర్భర జీవితాల్ని అక్షరాలకెత్తిన మరో చిన్న కథ "మహామాయ". ఈ కథలో మరో అడుగు ముందుకేసి "మాలమాదిగవాళ్లు మాత్రం అలాగే పడున్నా, వాళ్లలో కొంతమంది హాస్టళ్లలో చేరి చదువుకుని విపరీత బుద్ధులు ప్రదర్శించడం మొదలెట్టేరు" అంటూ వాడల్లోనూ తారతమ్యాలు తలెత్తిన పరిణామాలను నిర్మొహమాటంగా విశ్లేషించారు.

'సర్వం మిథ్య' అంటూ జ్ఞానబోధ చేసే యాజులు గారు... తన సామాను పోగొట్టుకున్నప్పుడు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై కూలబడి ఢీలా పడిపోతాడు. ఈ కథలో 'రాములు' అనే బడుగు పాత్రను చాకచక్యంగా ప్రవేశపెట్టి, లోకంలోని మహామాయను ఒడుపుగా బట్టబయలు చేస్తాడు.

"దేవదాసు 2015" మా చెడ్డనాయాలు. తాగేడంటే గౌరవసభ్యులు సభలో మాట్లాడినట్టు అచ్చంగా బూతులే మాట్లాడతాడు. ఈ ఒక్క సాకుతో రచయిత చెలరేగిపోతాడు. వాడితో అన్నీ నిజాలే చెప్పిస్తాడు. వాడల చుట్టూ దడికట్టిన దుర్మార్గాల్ని ప్రదర్శనకు పెడతాడు.

ఇప్పటికీ రిజర్వేషన్ మేరకు ఎస్సీ అభ్యర్థిని ఎన్నిక చేసేదీ, ఎన్నికల వ్యూహాలు అమలు చేసేదీ, పనిగట్టుకుని గెలిపించి ఆనక అతగాణ్ని లేదా ఆమెను మరబొమ్మలా మార్చి పెత్తనం చలాయించేదీ అగ్రవర్ణ ఆసాములే! ఈ విషయాన్నే దేవదాసు మందుసీసా బద్దలు కొట్టి మరీ చెబుతాడు.

"అమెరికా ఓడికీ, ఈ మతం తెచ్చిన బ్రిటిష్షోడికీ మనమీద దొబ్బుతెగులు లేదు... దళితుల మీద పడి ఏడ్చేవోడు ఎప్పుడూ మన దేశపోడే.." అంటాడు పాస్టర్ రాజరత్నం.

పాస్టర్లను కూడా బెంబేలెత్తిస్తుంటాడు దేవదాసు. కారణం లేకుండా మాత్రం కాదు. పాత పాస్టరు రాజరత్నం ట్రాన్స్‌ఫర్ అయి, కొత్తగా వచ్చిన మల్లంపల్లి సత్యనారాయణ మూర్తిని ఓ ఆట ఆడుకుంటాడు దేవదాసు. ఆ దెబ్బకు రెండు క్షణాల్లో అంతర్ధానం అవుతాడు మూర్తి.

దేవదాసు తానే చెప్పినట్టు "మనిషీ కన్వర్టెడ్ యాజ్ క్రిస్టియన్"!

దళిత క్రైస్తవాన్నే వస్తువుగా తీసుకుని రాసిన మరో అద్భుతమైన కథ "క్రైస్తవులు లేని చర్చి". ఈ కథలో ఒక దశలో రచయిత పనిగట్టుకుని ఆంజనేయుల్ని క్రైస్తవ మతంలోకి బరబరా ఈడ్చుకొచ్చి, 'ఆశీర్వాదం'గా మార్చాడా ఏమిటి చెప్మా! అన్న అనుమానం కలుగుతుంది. కానీ ఆ తర్వాతే అసలు కథ మొదలవుతుంది. దిమ్మ తిరిగే వాస్తవాల్ని అవలోకనం చేయిస్తాడు రచయిత.

"ఇక్కడంతా ఒక్కటే. క్రైస్తవ కులం. క్రైస్తవ మతం. ఒక్కటే దేవుడు. ఏసుక్రీస్తు" అంటూ ఉద్బోధించిన 'పాదిరి' ఎహెజ్కే గారి మాటలు చర్చిలో అడ్డదిడ్డంగా దర్శనమిస్తాయి. రెడ్లు, కమ్మోరు, బ్రాహ్మలు కుడిపక్క; మాలమాదిగలు ఎడం పక్క

## కవిత

# మౌనరాగం

- సి.యస్.రాంబాబు
9490401005

ఊసుల్ని ఊహల్ని నిదరపుచ్చి
శరత్కాలపు చిరుగాలి తోడుగా
వేకువ నీడల సాక్షిగా
ఏకాంతపు దారిలో బయల్దేరాను



ఒళ్ళు విరుచుకునే కొమ్మలు
కళ్ళు తెరిచిన గువ్వలు
చిటుక్కుమనే నిశ్శబ్దానికి
పక్కవాయిద్యాల్లా

సన్నగా దారి ఈలవేసే గాలితో
హుషారుగా సాగుతుంటే



ఎండిన ఆకొకటి అలా ఎగురుతూ
గురుతు తెలియని జ్ఞాపకాన్ని మోస్తోంది

ఎవరికీ ఏమీకాని ఏకాంతం
ఏమీతెలియనట్టు
గుట్టుదాచుకుంటే
ఏటిగట్టుదాచిన మౌనంలా
మనసు మూగపోయింది ♦

---

కూచొని ప్రార్థన చేసే దృశ్యాన్ని చూసి ఆంజనేయులు అవాక్కవుతాడు.

"తొమ్మిది మంది ఆడాళ్లని ఏకకాలంలో గర్భవతుల్ని చేయడం ద్వారా నెలరోజుల్లో బిడ్డని పుట్టించలేవు అని వారెన్ బఫెట్ ఆంజనేయులుతో అనలేదు. అసలు అమెరికా వారెన్ బఫెట్‌కీ అంగలకుదురు ఆంజనేయులుకీ పెద్ద పరిచయం లేదు"... అత్యంత సాధారణ విషయాన్ని అమెరికాతోనైనా అబ్రహాం లింకన్‌తోనైనా వారెన్ బఫెట్‌తోనైనా ముడిపెట్టగల సమర్థుడు రచయిత.

"థూ..." కథపై ఇప్పటికే విస్తృత చర్చ జరిగింది. ఎన్నో సంకలనాల్లో చోటు చేసుకుంది. ఎందరో సాహితీమూర్తులు ప్రశంసల వర్షం కురిపించారు. అది కథ కాదు... కడుపు మండిన ఓ బడుగుజీవి ఆక్రోశానికి అక్షరకణికల హారతి.

రచయిత నిస్సందేహంగా ఆడవాళ్ల పక్షపాతి. లేకుంటే 'ఆడాళ్లు దేవతలై ఉండాలి... పూజిస్తారు. లేదా దయ్యాలై ఉండాలి... భయపడతారు. మనుషులుగా ఉంటే మాత్రం చంపేస్తారు, నానా రకాలుగా" అన్న నగ్నసత్యాన్ని ఓ కథలో రాసేవాడు కాదు.

ఆ పక్షపాతంలోంచి పుట్టినవే "నీలవేణి", "అందం" కథలు.

మొత్తంగా పరిశీలించినప్పుడు... సునీల్ కుమార్ కథల్లో ప్రవాహంలా వచ్చి చేరే వాక్యాలు జవజీవాలతో తొణికిసలాడతాయి. సమయసందర్భాలు సహజసుందరంగా కథాగుచ్ఛంలో ప్రకాశిస్తాయి. అనేక వాక్యాల దగ్గర చదువరి కళ్లు మెరుస్తాయి. సంభ్రమాశ్చర్యాలతో పెద్దవవుతాయి. ఉదాహరణకు "దేవుడంటే అందరికీ ఇష్టమే... పరలోక రాజ్య ప్రవేశం కోసం అనుదినం ప్రార్థిస్తారు. కానీ పరలోక ప్రయాణాన్నే ఎప్పుడూ వాయిదా వేద్దామని ప్రయత్నిస్తారు" అంటారు. ఇంత తేలిగ్గా వాక్యాలను పొదగవచ్చా అనిపిస్తుంది గానీ, నిజానికి అలా రాయడానికి అవసరమైన సృజనశక్తి పట్టుబడటం అంత తేలిగ్గాదు.

"తండ్రి అనేవాడు పూర్తిగా ఉంటే ఒకరకం. లేకపోతే ఒకరకం. ఉండి, లేకపోతే నరకం" (నీలవేణి).

"అబెద్నగో అబెద్నగోవు లాగే ఉన్నాడు. కాకపోతే కొమ్ములతో కుమ్ముతున్న గోవులాగా ఉన్నాడు" (పరిశుద్ధ వివాహము – మూడవ ప్రకటన).

కథల్లో ఎక్కడికక్కడ సందర్భశుద్ధి హాయిగా కళ్లకు కడుతుంది. కచ్చితంగా ఆ ప్రస్తావన లేదా ఇమేజరీ అక్కడ ఉండి తీరాల్సిందే లేదా వర్షంలా కురిసి తీరాల్సిందే అని పాఠకుడు ప్రమాణపూర్తిగా విశ్వసించేలా రాస్తాడు. అది సాధనతో అబ్బిన నైపుణ్యం. అధ్యయనంతో పట్టుబడిన కళ.

వాడల వద్ద ఆగిపోయిన దళితవాదాన్ని వాడల మూలాల్లోకి తీసుకెళ్లి, దళిత క్రైస్తవ జీవితాన్ని సమర్థంగా కథలకెక్కించిన రచయిత పి.వి.సునీల్ కుమార్.

క్లుప్తంగా, అత్యంత ప్రభావశీలంగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పాపినేని శివశంకర్ గారి మాటల్లో చెప్పాలంటే... "వ్యంగ్యం ఒరలో పదును కత్తి సునీల్ రచన". ♦

కవిత

# ఆశ చావని కృషీవలుడు


- వి. రవీంద్రరెడ్డి
9494422842




నీలాకాశం వైపు
ఇన్నాళ్లు ఆశగా చూశాడు,
ఆకాశం నల్లరంగును పులుముకొని
వానమాడం పట్టి
నల్లని మేఘాలు గర్జించి
తెల్లని ముత్యంలాంటి చినుకులతో
ఈ నేలంతా తడిసి ముద్దయి
దండిగా పదునయితే
సేద్యం చేసుకోవచ్చని
రాములోడి గుళ్లో భజనలు చేశాడు,
కాటమయ్య స్వామికి పూజలు చేశాడు,
పొలిమేర పెద్దమ్మకు
పొర్లు దండాలు పెట్టాడు,
దండి పదును కాకున్నా,
కాసిన్ని వాన చినుకులయినా
రాలకపోతాయ అని,
కనపడ్డ రాయికల్లా మొక్కాడు,
వరుణదేవుడు కాస్త కరుణించాడు
కాసిన్ని వాన చినుకులు
ఈ మాత్రం దానికే
తెగ సంబరపడిపోయాడు,
బ్రతుకు మీద ఆశతో
తాను నమ్ముకున్న
అమ్మలాంటి పుడమితల్లి సాక్షిగా
పెళ్ళాం మెడలోని పుస్తెలమ్మేసాడు
అధిక వడ్డీకి అప్పు తీసుకొచ్చాడు
సంతకు బయలుదేరాడు
కాడెద్దులను కొన్నాడు
ఆసామి వద్ద
విత్తనాలు అరువుగా తెచ్చాడు
పొద్దుగుంకక ముందే
మడకను భుజం మీద వేసుకొని
చెర్నాకోలు చేతబట్టి
చెక్కలగుంటకతో సేద్యం చేసి
పలకల గుంటకతో
ఎత్తు పల్లాలను చదును చేసిన
ఎర్రమట్టి చేనులో
అరువుగా తెచ్చిన ఇత్తనాలను
నాలుగు ఎకరాల ఎర్రనేలలో
నాలుగుసాళ్ల గొర్రుతో
మిట్టమధ్యాన్నాం కల్లా ఇత్తేసాడు
సాలీసాలని పదునుతో నాలుగు రోజులైనా
ఇక ఇత్తనం గింజైనా
పుడమితల్లి గర్భాన్ని చీల్చుకుని
తన చేను గట్టును చూడలేదని
విలవిలలాడిపోయాడు..
వారం రోజుల తరువాత
చేనులోకి పోయి
తడారిపోతున్న ఎర్రమట్టి వైపు
దీనంగా చూస్తున్నాడు..
దిన దినం, ప్రతిదినం
ఈదురుగాలులు,
ఉరుములు, మెరుపులు
కారు మబ్బులతో
దూరం కొండలు, ఊళ్లు
కప్పబడుతున్నాయి గానీ,
ఒక చినుకయిన
నేల రాలక,
విత్తిన విత్తనాల
ఊపిరి ఊసురుమని
ఈదురుగాలులతో సహా
ఎటో వెళ్ళిపోతున్నా,
దిక్కుదోచక,
ఆశ చావక
చేనులో నిలబడి
పెద్దకుశాల కార్తిలో కురిసే
వాన చినుకులకోసం
మళ్లీ అదే ఆకాశం వైపు
ఆశగా చూడడం తప్ప
ఏమీ చేయలేని
నిస్సహాయ పరిస్థితి
ఈనాటి రైతన్న దుస్థితి.. ♦

కథ



# వెన్నెల కురిసిన రాత్రి

- టి.వి. - 7382863523

నిశిరాత్రి మరిపించే నిండు వెన్నెల కొండల చాటున సూర్యుడిలా మబ్బుల మాటున అందంగా నిండు పున్నమి రేరాజుగా చంద్ర కిరణాలతో శ్వేతవర్ణం కురిపిస్తున్నాడు. అంత అందమైన వెన్నెల చూడడం ఒక ఎత్తు. ఆ అందమైన వెన్నెల ఆహ్లాదాన్ని ఆస్వాదించడం మరో ఎత్తు. తన ఆలోచనల్లో వున్న గోపాలం ఈ లోకంలోకి వచ్చాడు. 'ఓ' ఈ రోజు పౌర్ణమి కదా, రాత్రి సమయం 7 గం॥ అవుతోంది. కొడుకు, కోడలితో వెళ్ళాలనుకొన్నాను. మరి వీళు ్ళ ఏమి చేస్తున్నారో అని హాల్లోకి వచ్చాడు. గోపాలం, మంగమ్మా! అని పనిమనిషిని పిలిచాడు. ఏం అయ్యగారూ! అంటూ ఆమె వచ్చి నిలబడింది. పిల్లలు భోజనం చేశారా? అని అడిగాడు. చేశారు అయ్యా అని చెప్పింది. అయితే ఈ పూటకు పిల్లలు మాత్రమే ఇంట్లో వుంటారు. వాళ్ళను దగ్గరలోనే ఉన్న వాళ్ల అమ్మమ్మ దగ్గర పడుకోబెట్టమని కోడలితో చెప్పు అన్నాడు. సరే అయ్యా అంటూ మంగమ్మ అక్కడ నుంచి వెళ్ళిపోయింది. గోపాలం అతని సొంత చెల్లెలు గీత కూతురు లతను తన కోడలుగా చేసుకొన్నాడు. కొడుకు మధు, కోడలు లత అతనికి రెండు కళ్ళు, ఆ కుటుంబం నిత్య ఆనందాల హరివిల్లుగా వుండాలన్నదే అతని జీవిత ధ్యేయము. ఏరా మధు ఏం చేస్తున్నారు, నీవు, నీ భార్యా రడీ అయ్యారా లేదా బయటకు వెళ్ళాలి అంటూ గోపాలం పిలిచాడు. వస్తున్నాము మామయ్యా అంటూ అప్పుడే ముస్తాబై కోడలు, ఆమె వెనకే కొడుకు బయటకు వచ్చారు.

ఈ రోజు పున్నమి కదా, మన ప్రయాణం మీకు తెలుసు, ఎందుకింత ఆలస్యం. ఇప్పటికే సమయం తొమ్మిదయ్యింది పదండి అంటూ ముగ్గురు బంగ్లా నుండి బయటకు వచ్చారు. కారు బయలుదేరింది. గోపి డ్రైవింగ్ చేస్తున్నాడు. కొడుకు కోడలు వెనుక సీట్లో కూర్చున్నారు. ఎవరి ఆలోచనలు వారివి. సముద్రం తీరం వెంబడి వేసిన తారురోడ్డు మీద కారు వేగంగా ముందుకు దూసుకుపోతున్నది.

సముద్రం ఎదురుగా ఓ అందమైన బృందావనంలో పచ్చల పతకాలు, మరకత మాణిక్యాలతో పొదిగి, దివ్యమైన కాంతులు వెదజల్లే ఆధునాతన భవంతి అది. పగలు చూస్తే దాని అందచందాలు అర్థం కావు. ఆ యమునా నది ఒడ్డున బృందావని ఎలా వుంటుందో తెలియదు కాని, నిత్యం మువ్వల సవ్వడుల్లా ఎగసిపడే కెరటాలు, రతీమన్మథులు కలసిపోయినట్లు దూరంగా సముద్రము ఆకాశము కలసిపోయిన దృశ్యం. సముద్రానికి ఎదురుగా విశాలమైన మైదానంలో మనసును ఆకర్షించే చెట్లు, పూల మొక్కల ఘుమఘుమల మధ్య అల్లావుద్దీన్ సృష్టించిన అద్భుత భవంతిలా లతలతో అల్లుకుపోయి నిత్య

మధురానుభూతులు అందిస్తూ, పాలవర్ణంలో తడిసినట్లు కన్పించే స్వచ్ఛమైన పాలరాతి భవనం, భవంతికి చుట్టూ విరబూసిన హరితవనాల అందాలు. బృందావనం అంటే ఇదే మరి. తన ఆలోచనలకు ప్రతిరూపకంగా, అపురూపమైన డిజైన్‌తో నిర్మించిన ఈ బృందావనం అంటే గోపాలానికి చాలా ఇష్టం.

కారు భవంతి పోర్టికోలోకి రాగానే బాబూగారూ! అంటూ వాచ్‌మెన్ రామయ్య ఎదురొచ్చాడు. రామయ్య గోపికి నమ్మినబంటులా, భవంతికి రక్షకుడిగా వుంటున్నాడు. అందరూ లోపలికి వచ్చారు. ఏదైనా అవసరమని అడుగుతారేమోనని రామయ్య ఎదురుచూస్తున్నాడు. ఏమి పనిలేదంటూ గోపి అతనిని పంపించేశాడు. మేడపైన పడకగదిని చూపిస్తూ మీరుకూడా వెళ్ళండంటూ కొడుకు, కోడలకి సంకేతం ఇచ్చాడు. తను తన గదికేసి చూస్తూ లోపలికి వెళ్ళాడు. మధు, లత కూడా వారి రూంలోకి వెళ్ళారు. ఏమండీ! అంటూ మొదలెట్టింది లత. పౌర్ణమి వస్తే చాలు మామయ్య మనల్ని ఇక్కడకు తీసుకువస్తారు ఎందుకండి? అక్కడ కూడా మన ఇల్లే కదా. ఆయన కూడా అక్కడే వుండవచ్చు కదా. ఇక్కడ ప్రత్యేకత ఏముంది? అమ్మ దగ్గర పిల్లల్ని వదలిపెట్టి రావడం నాకు ఇష్టంగా లేదు. అలా అని మామయ్యకు చెప్పలేను. ఆయన అర్థం చేసుకోరు. ఆయనకు అంతగా అనిపిస్తే ఆయన ఒక్కరే వచ్చి పడుకోవచ్చు కదా? మనకెందుకీ అవస్థ, మరి రేపు పొద్దున మీటింగ్ ఉందన్నారు. మనం ఎప్పుడు లేస్తామో, ఇంటికి ఎప్పుడు వెళ్తామో అంటూ నిట్టూర్చింది లత. ఒట్టి మాటలేనా గట్టి కబుర్లేమైనా ఉన్నాయా అంటూ మధు గోముగా ఛలోక్తి విసురుతూ (మధుకు ఆ ఇల్లంటే చాలా ఇష్టము, కాని ఎందుకో తెలియదు) భార్యను దగ్గరగా తీసుకోవడానికి ప్రయత్నించాడు. భర్త కోరికను కాదంటూనే బాధ్యతలను గుర్తు చేసింది లత. చేసేది ఏమీలేక మధు, లత ఇద్దరూ నిద్రలోకి జారుకొన్నారు. అర్ధరాత్రి ఒంటిగంట కావొస్తోంది. మధుకి అనుకోకుండా మెళకువ వచ్చి లేచాడు. పగలంతా అలసిపోవడంతో వెంటనే నిద్రపట్టేసింది. ఇక్కడ సముద్రపు ఒడ్డున చాలా చల్లగా ఆహ్లాదకరంగా ఉన్నది వాతావరణం. వెంటనే తండ్రి గుర్తుకు వచ్చాడు. నాన్నగారు పడుకున్నారా? ఒక్కరే ఉన్నారు కదా వెళ్ళిచూద్దం మంచిదే అనుకొంటూ, అలవాటుగా మెల్లగా తలుపు తట్టాడు. తలుపు గడియపెట్టలేదు కాబోలు మెల్లగా తలుపు తెరుచుకొన్నది. లోపలికి తొంగిచూశాడు. నాన్నగారు తనకిష్టమైన పట్టెమంచంపైన లేరు. పట్టెమంచం పాతదైనా అది వాళ్ళ అత్తగారు ఇచ్చినది, దానిపై పడుకొంటే అమ్మ ఒళ్ళో పడుకున్నట్లు వుంటుందని నాన్నగారు ఆ మంచాన్ని ఇక్కడే భద్రంగా వుంచారు. బాత్‌రూంలోకి వెళ్ళారా అని తొంగి చూశాడు. కాని అక్కడా లేరు. ఎక్కడికి వెళ్ళివుంటారని ఆలోచిస్తూనే మంచంపై కూర్చున్నాడు మధు. తలగడ ప్రక్కకు జరిగిపోయి దాని క్రింద వున్న డైరీ కన్పించింది. ఓ! ఇది నాన్నగారిదే అని దగ్గరకు తీసుకొని అప్రయత్నంగానే డైరీ తెరిచాడు. నాన్నకు డైరీ వ్రాయడం చాలా ఇష్టం. అంతే కాదు అది ఎప్పుడూ తిరగేస్తూ వుంటారు. దాని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. కాని ఇప్పుడు నాన్నగారు ఇక్కడ లేరు. ఏకాంతంగా వున్నాను. డైరి చదవడమా! మానడమా అని ఆలోచిస్తూనే పేజీలు తిప్పడం ఆరంభించాడు మధు. మొదటి పేజీలో అమ్మానాన్న బ్లాక్ అండ్ వైట్ ఫోటో భద్రంగా అతికించారు. తర్వాత పేజి తిప్పగా మాది పెద్దలు కుదిర్చిన పెండ్లి, బతకడం ఎలాగో తెలియదు. బంధం ఏర్పడింది. నూరు రూపాయల జీతంతో నూరేళ్ళ జీవితం మొదలైంది. మొదటిరాత్రి అందరూ వూహించుకొన్నాట్లు ఏర్పాట్లు లేవు. పిండివంటలు లేవు. అత్తగారు ఇచ్చిన పాత పట్టె మంచం వుంది. కాని పరుపుకు బదులు బొంతలు ఇచ్చారు. అప్పుడే ప్రారంభమైంది, ఉన్నదాంట్లో సర్దుకుపోవాలని. ఇద్దరం చిరునవ్వులతో ఒక్కటయ్యాం. అక్కడ నుండి ఆమె జీవితమంతా అంతా సర్దుకుపోవడంతోనే సాగింది. చూస్తూండగానే సంవత్సరం తిరిగింది. మేము ఇద్దరం ముగ్గరైనాం. మగపిల్లవాడు ముద్దుగా మధు అని పేరు పెట్టుకున్నాం. అందాల బ్రతుకు సౌధం నిర్మించాలని వున్నా ఆర్థిక పరిస్థితిలో పురోగతి లేదు. చాలీచాలని జీతము. ఎప్పుడైనా పండ్లు తిందామని తెస్తే ఎందుకండీ ఇలా డబ్బు దుబారా చేస్తారు, డబ్బులు వుంటే బాబు పాలడబ్బాకైనా పనికొస్తుంది కదా అని అంటూండేది. కోర్కెలన్నీ మూటకట్టి వుట్టిమీద పెట్టి సర్దుకుపోవడం నాకూ నేర్పింది. పండుగరోజు పిల్లవాడికి చొక్కా లాగూ కొన్నాను. రాధ గుర్తుకు వచ్చింది. మంచి చీర కొనడానికి డబ్బులే లేవు. రోడ్డు ప్రక్కన షాపింగ్‌మాల్‌లో చౌకగా దొరుకుతున్నాయని 80 రూపాయల్లో ఒక చీరకొన్నాను. కాని నాకు బట్టలు లేకుండా ఆమె చీరను స్వీకరించదు. పైగా గొడవ చేస్తుంది. అందుకనే సంతలో సెకెండ్స్ బట్టలే అమ్మేచోటుకు వెళ్ళి వున్నవాటిలో బాగా కన్పించే ఒక ప్యాంటు, చొక్కా కొన్నాను. వాటిని తీసుకొని ఇంటికి వెళ్ళి, రెడీమేడ్ డ్రస్సని నమ్మబలికాను. కాని ఆమె నిజం గ్రహించి కూడా అవునా భలేగా వున్నాయి అంటూ

సంతోషం వ్యక్తం చేసింది. ఇంతలో నేను తెచ్చిన చీర చూసి కోప్పడింది రాధ. ఎందుకండీ చీర కొన్నారు. ఇప్పుడు ఏమి అవసరం వచ్చింది. పోయిన నెలలో కొన్న చీర వుంది కదా అంటూ మురిపెంగా నిష్ఠూరమాడింది. కాని అది ఆమె కొన్న చీర కాదని పక్కింటి అన్నపూర్ణమ్మగారు ఇచ్చినదని నాకు తెలుసునని ఆమెకు తెలియదు కాబోలు. ఎన్నో ఆటుపోట్ల మధ్య జీవన నావ సాగిపోతున్నది. అలా నాలుగేళ్ళలో మేము నలుగురైనాము. పాప పుట్టింది. మా ఆలోచనలో మార్పు వచ్చింది. చిన్నపాటి ఉద్యోగం, చాలీచాలని జీతం ఇలా ఎంతకాలం? ఏదైనా చేయాలని రాధ ఆలోచిస్తూ, భర్తకు సలహా ఇవ్వడమే కాకుండా తన పుట్టింటివారిచ్చిన మంగళసూత్రపు గొలుసు, కాళ్ళ పట్టీలు, భర్త లేనప్పుడు తీరిక సమయాల్లో పొరుగింటి వారికి చేసే సహాయాల్లో వారు ఇచ్చిన పారితోషికంలో మిగిల్చిన కొంత డబ్బు కలిపి బట్టల వ్యాపారానికి పెట్టుబడిగా ఇచ్చింది. దాంతో హోల్‌సేల్‌గా తెచ్చుకొన్న బట్టలతో సైకిల్‌పై వ్యాపారానికి అంకురం వేసింది. పాప ఎదుగుదలతో పాటు వ్యాపారం చిన్న చిన్నగా ఎదగడం సాగింది. అయినా భార్యాభర్తలు ఇద్దరమూ వ్యాపారంలోని లాభాలను చూస్తున్నామేగాని, మేము మనుషులమే కదా, మాకు కోర్కెలు, కనీస సౌకర్యాలు వుంటాయి కదా అని మర్చిపోయాము. సర్దుకుపోవాలి కదా అంటూ ఊతపదం మాత్రమే మిగిలింది.

మొదట్లో వ్యాపారంలో పెద్దగా లాభాలు వుండేవి కావు. కాని వచ్చిన దానితో నా భార్య చాలా చక్కగా ఇల్లు చక్కదిద్దేది. పిల్లలకు అన్నీ అర్థమయ్యేలా వివరించేది. నేను చేసేది సైకిల్‌పై తిరుగుతూ బట్టల వ్యాపారము కాబట్టి పల్లెలు ఎక్కువగా తిరిగేవాణ్ణి. నా మంచితనం వారికి నచ్చిందేమో రైతులు ప్రేమగా గోపాలం శనక్కాయలు తీసుకెళ్ళు. మా తోటలో పండిన కూరగాయలు తీసుకో, అంటూ ప్రేమగా ఇచ్చేవారు. కూరగాయలు అయితే వారం రోజులు సర్దేది రాధ. నేను తినాలని కోరికున్నా ఆదివారం వచ్చిందంటే గుడ్డే నీసుగా సరిపెట్టుకొనేవారము. మాసానికోసారి అన్నపూర్ణమ్మగారు మిగిలిన అన్నము, నీసుకూర మాకు ఇచ్చేవారు. అది మనపై గౌరవంతో ఇచ్చారని రాధ గొప్పగా చెప్పేది. పండుగల మురిపించేది. ఆమె గౌరవంతో ఇచ్చింది కాదని, రాధ వాళ్ళింట్లో పనిమనిషిలా పాచిపని చేసినందుకు ఇచ్చిందని తెలిసినా తెలియనట్లు నటించేవాడిని. మరి నాకు బాగా గుర్తు అయిన సంఘటన, ఒకరోజు మేము అద్దెకుంటున్న యజమాని కూతురు బర్త్‌డేను వాళ్ళు పెద్ద కేక్ కట్ చేసి చాలా ఆర్భాటంగా చేశారు. అది చూసి మా పాప అడిగింది నాన్న నా బర్త్‌డే వస్తోంది కదా, నాకు ఇలా చేయరా అని. పిల్లలకు అర్థం కాదు కదా పెద్దవాళ్ళ ఇబ్బంది, అయినా సరేనంటూ మాట ఇచ్చాను. కాని వ్యాపారంలో సంపాదించే ప్రతి పైసా కూడా తిరిగి పెట్టుబడిగా మార్చే యంత్రంగా మారిన నేను ఈ విషయం అప్పుడే మర్చిపోయాను. పాప బర్త్‌డే రోజు తిరిగి తిరిగి ఇంటికి వచ్చి అలసటగా కూర్చున్న నా దగ్గరకు కూతురు వచ్చి నాన్న కేకు తెచ్చారా అని అడుగుతూ వళ్ళో వచ్చి కూర్చుంది. అప్పటి వరకు పాప ఏమడిగిందో నాకు అర్థం కాలేదు. కళ్ళముందు వ్యాపారమే తప్ప ఏమి కనిపించలేదు.

సమయస్ఫూర్తిగా వ్యవహరించే రాధ ఒక చిన్న ప్లేట్లో కేక్‌తోపాటు చిన్న క్యాండిల్‌తో వచ్చి, సరితా ఇదిగోనమ్మా కేకు అంటూ పాపకు చూపించింది. నాకు ఆశ్చర్యం వేసింది. క్యాండిల్ వెలిగించి పాపతో కేక్ కట్ చేయించమని చాకును నాకు అందించింది. నేను నా విసినారితనాన్ని అసహ్యించుకొంటూనే రాధ సమయస్ఫూర్తిని, సహకారాన్ని అభినందిస్తూ, సూపర్‌స్టార్‌లా నటించాను. ఇంతలో సరిత అల్లరిగా అమ్మా నాకు ఎన్ని సంవత్సరాలైతే అన్ని కాండిల్స్ వెలిగించాలి, ఆ లెక్కన నాకు నాలుగు క్యాండిల్స్ వెలిగించాలి, కాని నాకు ఒకటే క్యాండిల్ ఎందుకు పెట్టారు అని అడిగింది. నిజమే తల్లీ, అలా వెలిగిస్తే ఇతరులకి మన వయస్సు తెలిసిపోతుంది. అయినా ఎన్ని క్యాండిల్స్ వెలిగించినా ఆర్పేందుకే కదా, అలా అన్ని క్యాండిల్స్ ఆర్పినా ఒక్క క్యాండిల్ ఆర్పినా ఒక్కటే కదా! అయినా క్యాండిల్స్ ఆర్పేది ఎందుకో తెలుసా, క్యాండిల్ ఆరిపోతూ మన జీవితాలు సంతోషంగా వెలగాలని కాంక్షిస్తుంది, అందుకే పెద్దలు ఈ సాంప్రదాయం పెట్టారమ్మా అంటూ సర్దిచెప్పింది రాధ. ఆ రాత్రి నేను జీవితంలో మరవలేనిది. మాది చిన్న ఇల్లే అయినా వెనుక పెరట్లో ఆరుబయట పౌర్ణమి వెన్నెలలో నేను రాధ పట్టె మంచం మీద పడుకొని ఆలోచిస్తున్నాము. ఆర్థికంగా నిలదొక్కోడం ఎలాగా అని. రాధ మెల్లగా అడిగింది, ఏమండీ! ఈ వెన్నెల చూశారా? అంటూ పగలంతా పడ్డ కష్టానికి అలసిపోయి చల్లదనానికి హాయిగా నిద్రలోకి రాధ జారిపోతున్నట్లు గమనించాను. కాని నాకు నిద్ర రాలేదు. కష్టసుఖాలు గురించి ఆలోచిస్తూనే వున్నాను. సుఖాలు కావాలంటే నేను కష్టపడాలి అంతే. అదే లక్ష్యంతో పట్టుదలతో వ్యాపారంలో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ కోటీశ్వరుడినయ్యాను. కోట్ల సంపాదనలో మమతలు – మనసు లేని మరమనిషినయ్యాను. కనీసం భార్య ప్రేమకు,

ఆప్యాయతకు, దాంపత్యానికి కూడా దూరమై సంపాదన పరుగులో విన్నర్‌గా గెలిచాను.

ఆమె చివరి క్షణాలలో అన్న నాలుగు మాటలు నన్ను శూలాల్లా గుచ్చుకుంటూనే వున్నాయి. మీరు భగభగ మండే సూర్యుడిలా శ్రమించి ఆర్థికానందంలో సంపాదన అనే పర్వతాన్ని అధిరోహిస్తున్నారే కాని చంద్రకాంతిని తాకలేరు. ప్రశాంతంగా జీవించలేరంటూ, గుండెపోటుతో చంద్రుని ప్రక్క తారలా నా జీవితం నుండి అనంతలోకాలకు వెళ్ళిపోయింది నా అతిలోక సుందరి, అనురాగ దేవత.

అవును నిజమే మనిషి సంపాదన జీవించడానికి, అనుభవించడానికి కానప్పుడు సంపాదన దేనికోసం, త్రాగడానికి పనికిరాని ఎండమావుల కోసం పరిగెత్తడం తప్పు. సత్యం తెలుసుకొనే లోపు ఆనందం ఆవిరైపోయి, వయస్సు సహకరించక గుజరీకి వెళ్ళే యంత్రంగా మారాను.

అవును ఆమె నా దగ్గర వున్నన్నాళ్ళు యంత్రంలా పనిచేసింది. మరమనిషిలా మారుతూనే ఆలోచనలు పంచింది. సర్దుకుపోతూనే నా లక్ష్యానికి వూతమై నిలిచింది. కానీ ఏదీ అనుభవించకుండానే నా వూతం నేలకొరిగింది. ఆమె నేలకొరిగినా, ఆమె ప్రతిరూపం నీడలా నా వెన్నంటే వుంటుంది. వెన్నెల్లో కలసిపోదాం అన్నట్లుగా ప్రతి పౌర్ణమికి ఆహ్వానిస్తూనే వున్నది.

నాలా నా కొడుకు జీవితం ఇలా కాకూడదని నెలలో ఒక్కసారైనా పున్నమి వెన్నెలలో రేరేజుగా ఈ బృందావనాన్ని ఏలాలని కౌముది రాత్రులలో తడిసి పునీతులు కావాలని కొడుకు, కోడల్ని ఇలా తీసుకొస్తున్నాను. ఏ పున్నమినాడైనా నీ ప్రక్కన నేను చేరుకోవాలని, ఈ సముద్రము ఒడ్డున వెన్నెలలో చంద్రుని ప్రక్కన తారలా మెరుస్తున్న నిన్ను చూస్తూ కన్ను మూయాలని ఆశతో అంటూ డైరీలో వ్రాసాడు.

మధు తన తండ్రి డైరీ చదువుతున్నంత సేపు ఒక సినిమాలా దృశ్య కావ్యం చూస్తున్న అనుభూతికిలోనయ్యాడు. ఇప్పటి వరకు నాన్నగారు ఎందుకు ఇలా ప్రతి పున్నమికి ఇక్కడికి వస్తున్నాడో అర్థం కాలేదు. నన్ను ఒక మరమనిషిలా చూడకూడదనుకున్నాడో ఏమో అందుకే మా కోసం ఈ బృందావనం కట్టించాడు. నన్ను, లతను రాధాకృష్ణుల్లా చూడాలనుకున్నాడు. కాని నేను మాత్రము ఇప్పటికీ నాన్నగారిలా సంపాదన పరుగు పందెంలో విజేతగా నిలవాలని, నగరాన్నే మా సామ్రాజ్యంగా భావించాను అని చెమ్మగిల్లిన కళ్ళతో తేరుకున్నాడు. నాన్నగారెక్కడున్నారు, ఏమైపోయారు అని వెతకడం ప్రారంభించాడు మధు. కళ్ళు వెతుకుతున్నాయి. కాని ఆలోచన మాత్రం గతాన్ని వేగంగా తిప్పేస్తోంది. అమ్మ అహర్నిశలూ మా కోసం, మా ఆనందం కోసం శ్రమిస్తూ, ప్రేమాభిమానాలు పంచి కన్నుమూసింది. నాన్న యంత్రంలా మారి వాటి పునాదులపై ఇంద్రభవనాలు నిర్మిస్తూనే ఇలా వృద్ధాప్యంలోకి పరుగులు తీసి అలసిపోయారు. ఒరిగిపోవడానికి సిద్ధమవుతున్నాడని తలపోస్తూ భవనం దాటి సముద్రం వైపు అడుగేసిన మధు సముద్రం వైపు దృష్టి సారించాడు. పున్నమి వెన్నెల పరుచుకున్న ఇసుక తిన్నెపై కూర్చుని ఎదురుగా ఎగసిపడుతున్న అలలను ధ్యానంలో మునిగిన యోగిలా చూస్తున్నారు నాన్న. తండ్రి దగ్గరకు నడిచాడు, ఏం నాన్న ఇక్కడ ఇలా కూర్చున్నావు నిద్రపట్టలేదా? అన్నాడు మధు. “ఏం లేదురా ఈ సముద్ర ఘోష విందామని వచ్చాను అంటూ కొడుకు చేయి పట్టుకొని లేచాడు గోపి. ఇద్దరూ కలిసి భవంతివైపు అడుగులేశారు. మధు మస్తిష్కంలో ఆలోచనలు మాత్రం వెంబడిస్తూనే వున్నాయి. నిజమే సముద్రఘోషను శంఖంలో వినేదానికి, దగ్గరగా చూస్తూ వినేదానికి చాలా వ్యత్యాసం వున్నది. నాన్న కట్టిన ఇంద్రభవనం నాకు ఒకప్పుడు పర్యాటక భవనంలా కన్పించేది. కాని ఇప్పుడు అందమైన పచ్చిక నడుమ అనుభవమనే ఇటుకలతో, ప్రేమనే సిమెంటు కలిపి, అందమైన చలువరాళ్ళలో మనస్సును నింపి నిర్మించిన బృందావనంలా కన్పిస్తున్నది. ఇంతా ఎవరి కోసం, నా కోసమే కదా! నేను ఒక మూర్ఖుడిని, నేను ఇది అర్థం చేసుకోక, నా భార్యను కూడా యంత్రంగా మార్చుతున్నాను అనుకుంటూ వేదనతో బరువెక్కిన మనసుతో తండ్రితోపాటు భవంతిలోకి అడుగుపెట్టాడు మధు. నాన్నగారు అప్పుడు కూడా అప్రయత్నంగానే మా పడకగదికి వెళ్ళమని సైగచేసి, తన పడక గదిలోనికి వెళ్లి పట్టె మంచాన్ని కౌగిలించుకున్నారు.

ప్రపంచం అభివృద్ధి వైపు పయనిస్తోంది. అభివృద్ధి అంటే అందమైన పరిసరాలు, భవంతులే అనుకొంటున్నాము. కానీ నాణేనికి బొమ్మ బొరుసుల్లా ఒకవైపు డబ్బు, మరోవైపు మానవత్వం. ఇవి రెండూ జీవితం. దాంపత్యంలో భార్య అంటే భర్త సంపాదనకు ఉపయోగపడే యంత్రం కాదని, భర్త అంటే భార్య పెట్టుకొనే నగలకు, కట్టుకొనే చీరలకు యజమాని మాత్రమే కాదని భావిస్తూ వెన్నెల రాత్రులను గడపాలని భావిస్తూ మధురానుభూతులతో రంగరించి, మానవత్వం వికసించేలా జీవిత బృందావనంలో నిద్రపోతున్న లతను మేల్కొలిపి, పందిరికి తీగలా అల్లుకుపోయారు. ♦

**కవిత**

# ఊరి మధ్యలో బొడ్రాయి

- జె. బి. చరణ్
7259511956



నీకేం తెలుసని?
బొట్లు బొట్లుగా
ఆకాశపు ముంజేతి మీద
రాలడం తప్ప
నీడకింద కుక్క మూలుగుతూ...

అప్పుడప్పుడు
పాములు కూడా మొరుగుతాయి
నీలాగా నాలాగా లోపలికో
బయటికో
మొరిగి మొరిగి ఆకాశానికి
వేలాడి
భూమిలో ఇంకిపోతాయి...

ఇంటికి బొక్కపడటంతో
నగ్ననామ సంవత్సరం
ఉదయించింది
గోడమీద బల్లి పాకిన చారలు
వెక్కరిస్తూ నా కంట్లో...

ఉదాటున పొగలు పొగలు లేచి
చేతి మణికట్టు మీద నిలబడి
నాలుగు దిక్కులకి చేరుతాయి
ఐదో దిక్కు రొమ్ము పగిలింది....

చేతులు ఊపి ఊపి
అలసిపోయారు
ఇక కన్నులూపాల్సిందే....
విరిగిన చూపులు నలిగి
లజ్జ నటిస్తూ సూర్యుడి
దేహంలో...

ఎవరో నా భుజం మీద
చేయి వేసినట్టు అనిపిస్తుంది
ఇంకెవరో పిలిచినట్టు
ఒక సన్నని పొలికేక...

సమాధానం చెప్పేలోపే
మరొకరి గొంతులో
సమాధానం మూలుగుతుంది
ఊరిమధ్యలో బొడ్రాయిలా నేనొక్కడినే...

పిచ్చి టెంకాయలు పగిలిపోతాయి
పుచ్చు హారతులు
గాలికి ఆహుతులౌతాయి
పళ్ళెంలో చిల్లర
ఘొల్లు ఘొల్లు మంటుంది...

బొడ్రాయి కక్కుకుంటుంది
రక్తంలాంటిదేదో పారుతుంది
చేతిలోకి తీసుకున్నారు
వరాహం పక్కనే కూర్చుంది...

అది ఎప్పటికీ శవమే
సమాధి తత్వాన్ని ఊపిరిలో బంధిస్తేనే
కన్నుల్లో ఊయల ఊగుతుంది
రేపొక ఆశ మాత్రమేనని
బోధపడుతుంది...

నవశిశువు గొంతులో ఉలి
కేకల శిల్పం తోసుకుంటూ
ఆరాటం మాయను కప్పుతుంది
చేప కంట్లో నృత్యం వేదాంతం

నల్లటి మట్టి నోరు విప్పింది
కండలు కండలుగా జారాల్సిందే
మింగడమే జీవరహస్యం
కాలం నిన్ను నువ్వు కాలాన్ని

క్షణాన్ని కోసుకొని తినగలవా?
ఒక్క క్షణాన్ని తవ్వడానికి
కోట్ల సమాధులను కోటానుకోట్ల
గర్భాలను వలిచి చూస్తేనే తెలుస్తుంది...

గతాన్ని కనురెప్పలపై పరిస్తేనే
భవిష్యత్ లో వర్షం కురుస్తుంది
ఆకులు రాలితే పునర్నిర్మాణమే
ధ్వంసం ఏది లేదు పిచుకగూడు

నీరవ నిశబ్దంలో ఒంటరి పక్షి
అది నీ భ్రమ
సహజమో, అసహజమో
చావెప్పుడు నీ భుజాలపైనే

మేఘాలను రెండుగా కోయకు
వీలైతే మనిషిని మనిషిని కుట్టుకుంటూ
దీపం కదిలితే భూమేమి కంపించదు?
నీడలు తెగిపడతాయంతే...

దవడపై అగ్నిపర్వతం
మాటల క్షిపణి శూన్యాన్ని కోసుకుంటూ
కాలికింద చెమట తత్వం
పుడమి ఏడ్చిన శబ్దం...

పుష్పాల పరిమళం ఎంతసేపు?
నీరు కాలం నోట్లో వెలుగుతుందా?
ఏదైనా ఇంకిపోవాల్సిందే
నువ్వైనా నేనైనా నిశబ్దం

జననమరణాలు ఒకే అంగట్లో
కాదు కాదు ఒకే జీవంలో
ఇటువైపు నుండి అటువైపుకు మరణం
శాశ్వత్వం శాశ్వత్వం శాశ్వత్వం
అమాయకులు మూర్ఖులు

ఇప్పటికీ నీకేం తెలియదు!
రాలుతూనే ఉంటావు...
బహుశ కాలాన్ని చూసి
నేర్చుకున్నావేమో...

♦

**నచ్చిన రచన**

# సుగంధాలు వెదజల్లే "వికసిత దళితం"






**- జంధ్యాల రఘుబాబు**
**9849753298**

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకొస్తాడన్నట్టు డా.కల్లూరి ఆనందరావు జనవరి 1979 నుండి 2016 వరకు రాసిన, ప్రచురితమైన, రేడియోలో ప్రసారమైన కవితల్ని ఇప్పుడు పుస్తక రూపంలో తేవటం, ఈ అక్టోబరు నెలలో ఆయన ప్రిన్సిపాల్‌గా పదవీవిరమణ చేయటం కాకతాళీయంగానే జరిగాయి. నిజంగా ఆయనో సీనియర్ కవి. చాలా ఆలశ్యంగానైనా తీసుకొచ్చిన కవితా సంపుటి "వికసిత దళితం". ఈ పుస్తకంపై "రెండుగుండెల సవ్వడి" అన్న తమ ముందుమాటలో ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు పేర్కొన్నట్లుగా ముప్ఫై అయిదేళ్ళ కవిత్వం ఇప్పుడు ప్రచురిస్తున్నారు డా.కల్లూరి. కవిత్వానికి కాల, స్థల బేధాలు లేవన్నట్టు ఈ సంపుటిలోని కవితలు నిత్యనూతనంగా, ఒక సమకాలీన ప్రయోజనం ఆశించి రాసినట్టుగా మనకు తెలిసిపోతూ ఉంటుంది. ఇందులో డా.ఆనందరావు ఎంచుకున్న అంశాలు అలాంటివి. వస్తుపరంగా వైవిధ్యమైన, వైరుధ్యమైన అంశాలు ఇందులో పక్కపక్కనే దర్శనమిస్తాయి. కవి ఎంత నిరంకుశుడో కవిత్వం అంత సుకుమారమైనదనిపించేలా పుస్తకం సాగుతుంది. అట్లని అందరి బాధ్యతనూ తెలపకుండా ఆయన వదలలేదు. కవిత్వాన్ని ఒక సీరియస్ విషయంగా ఆయన స్వీకరించటమే అందుక్కారణం. ఆచార్య రాచపాళెం "1979 నుండి 1993 దాకా ఆనంద్ రాసిన కవితలు ఒక కదంబ మిశ్రమ స్వభావాన్ని కలిగున్నాయి. ఇది ఆయన కవిత్వంలో తొలిదశ. ఆ తర్వాత ఆయన స్పష్టమైన దళిత స్వరం వినిపించాడు. కారంచేడు, చుండూరు సంఘటనలు, డా.వి.ఆర్.అంబేద్కర్, గుర్రం జాషువాల శత జయంతులు, కాన్షీరాం ఉద్యమం వంటివి ఈ మార్పునకు దోహదం చేసి ఉంటాయని, సమాజాన్ని జాతీయ, బౌద్ధ, వర్గ దృక్పథాలతో అర్థం చేసుకుంటూ కుల మత ఆర్థిక అసమానతలు భారతీయ సమస్యలుగా ఆనందరావు గుర్తించారంటారు రాచపాళెం.

గుత్తి కవితాసభలో ఆయన చదివిన సర్దుబాటు అన్న కవిత ఈ కవితా సంపుటిలో మొదటిది. "ఓ సంక్రాంతీ!/ కూచిపూడి నృత్యాలకు మారు క్యాబరే డ్యాన్సులతో/ శాస్త్రీయ సంగీతానికి మారు చవకబారు సినిమా సాంగ్స్‌తో/ పంచ భక్ష్య పరమాన్నాలకు మారు పది గ్లాసుల కాఫీ నీళ్ళతో/ సర్దుకొనే ఈ నవనాగరిక రోజుల్లో..." అని మొదలుపెట్టి "కులమత సంఘర్షణల్లో జరిగే నరబలుల్నే నీ నైవేద్యాలుగా/ తగలబెట్టిన బస్సుల్నే భోగి మంటలుగా సరిపెట్టుకోవా? అనుగ్రహించవా" అని ముగిస్తారు. ఎంతటి కవైనా యవ్వనంలో రాసే కవితలు భావుకతతో, ప్రేమ నిండి ఉంటాయంటారు విమర్శకులు. ఆనందరావు అందుకు మినహాయింపు కాదు. హృదయేశ్వరి కవితలో నా హృదయం మానస సరోవరం అంటూ "నా హృది సరసు అలలపై తేలేదీ నీ రూపే/ ప్రేయసీ!/ నే నిరంతరం నీ హృదయ శృంఖలాల బందీని" అంటారు.

చైతన్య గీతాలు లో "చలిస్తే చేతనం/ ఫలిస్తే సాధనం/ ప్రజ్వలిస్తే చైతన్య సాధనం", "ఫలించటం ప్రకృతి సహజం/ ప్రజ్వలించటం ప్రవృత్తి సహజం/ ప్రకోపించటం ప్రకృద్ధ సహజం". మృగతృష్ణ అన్న కవితలో "అందమైన పువ్వు

కనింపించగానే/ అమాంతం అందుకోవాలనే కాంక్షెందుకోయ్?/ ఏ తోటమాలి ముద్దుబిడ్డో అది/ ఏ వనమాలి మురిపాల చెలియో అది" అని, అందులోనే చివరిలో "గరిక పూవులోన/ కరకు చీకటిలోన/ మరగి పోయే నీ బంద బ్రతుకులో/ మతిమాలిన ఆశపాశాలెందుకోయ్!" అని కరుణశ్రీని, సీనియర్ సముద్రాల ఇద్దరినీ గుర్తు తెస్తారు. ఇక మనీషి అన్న మూడు లైన్ల కవిత ఇలా ఉంటుంది "ఎక్కుపెట్టిన నీ ఆశయ బాణం/ ఔన్నత్యపు శిఖరాగ్రాన్ని తాకితే/ అప్పుడు నువ్వు మనీషివి".

1985 లో రాసిన కవిత "యాటం బాంబ్" లో "బ్రహ్మాండమైన ధనవంతుణ్ణనుకొని/ పేదవాణ్ణి హీనంగా పరమాణువులా/ చూడకు మిస్టర్!/ పరమాణువు ప్రేలిందంటే/ బ్రహ్మాండం బ్రద్దలవుతుంది, జాగ్రత్త!" అని చులకనగా చూడకు దేన్నీ అన్న మహాకవి మాటల్ని గుర్తు చేస్తారు. అదే సంవత్సరంలో రాసిన "జననీ జన్మభూమిశ్చ" అన్న కవితలో "భారతదేశం నా జన్మ భూమి/ భారతీయులందరూ నా సహోదరులు/ అయ్యా! ఆగండి! అంతటితో ఆపండి" అంటూ వివిధ వేర్పాటువాదాల్ని స్పృశిస్తూ "మనమందరం సోదరులం/ మనదేహం భారతీయం/ మన శ్లోకం సమతా గీతం" అని ముగిస్తారు. ధ్యానం అనే కవితలో "ధ్యానంలో ఉన్నా!/ సడి చేయకండి/ వాస్తు శిల్పినై విశ్వభవనపు కొత్తరూపుకు/ చిత్రణ చేస్తున్నా! సద్దు చేయకండి" అని తన ఆశయాలను చెబుతూ "ప్రతి గదినీ అంటార్కిటిగా హిమ ధవళంతో/ వెల్ల వేయాలని/ చీకటి గుయ్యారాల మనుషుల మెదళ్ళలో/ లాంతర్లు వెలిగించాలనీ/ భువన భవన ప్రాంగణాల ప్రాకారాలకు/ పసిఫిక్ పచ్చని తివాసీని పరువాలని/ వాస్తు శిల్పినై చిత్రణ చేస్తున్నా"నంటూ మహాకవి శ్రీశ్రీ ప్రభావాన్నుండి కోలుకోలేక రాస్తారు.

మనదేశంలో "వర్ణ వ్యత్యయం" ఎలా ఉందో చెబుతూ "ఆకాశంలో ఏడు రంగులు కలిస్తే/ అందమైన హరివిల్లు అవుతుంది/ కానీ! నాదేశంలో అదేం చిత్రమో!/ నాలుగు వర్ణాలు కలిస్తే చాలు/ అనేక కులాలేర్పడతాయ్!/ అసమానతా జ్వాలల్ని రగిలిస్తాయ్!" అన్న మాటలు ప్రస్తుత పైపరిస్థితులకు అద్దంపట్టేవి. ఈ కవిత 1984 లో రాసింది. ఇక "సింహావలోకనం" అన్న కవితలో మహాకవి "కవితా ఓ కవితా" ఆనవాళ్ళు కనిపిస్తాయి. "త్రివర్ణ పతాకం"లో "దారిద్ర్య వ ృక్షమును వేర్లతో కూల్చగ/ చండ గాడ్పులతో ఊగుము జండా!/ కులమత భేదపు రాక్షసునణచగ/ వజ్రాయుదమై కదులుము జండా!" చదువుతుంటే గర్జించు రష్యా అన్న మాటలు గుర్తుకురాక మానవు. "పద్య దశకం" అంటూ బాపూజిపై, మంచి, విరికన్నె, కవికాలం, చిరునవ్వుల చెలి, చిన్నారి, మనసు, కవి, సాక్షి, రాగము మొదలైన అంశాలపై రాసిన పద్యాలు కూడా ఉన్నాయి.

"త్రి కర్మలు" లో "త్రికరణ శుద్ధి మాకు లేదంటే మేమొప్పం!? మా మనసు మాట చేతలన్నీ/ శుద్ధిగా ఎల్లప్పుడూ ఉంటాయ్/ కాకుంటే/ కలిసికట్టుగా ఉండవంతే/ మామనసులో ఆలోచనలు అనేకం/ మా మాటల కోటలకే లోపం?/ మా చేతల అపసవ్యాలకెక్కడ నిశ్చలత్వం?". ఇది 1982 లో రాసింది. దేవుడొక్కడే మాకు దేవళంబులు వేరు అన్న కవికోకిల మాటలు గుర్తుకొస్తాయి. దళితుల మధ్య సయోధ్యకూ కంకణం కట్టిన ఆనందరావు అభినందనీయులు. ఈమధ్య దళితులు శుభ్రంగా ఉండరు అన్న ఓ అమాత్యుడిలాంటి వారికి ఈ కవిత ఓ చెంపపెట్టు.

ఇక శీర్షిక కవిత "వికసిత దళితం" మొదలుపెట్టటమే "మనుషుల్ని దేవుళ్ళను చేయొద్దు" అంటూ మనుషుల్ని పశువుల్లా చూడొద్దనీ చెబుతారు. కళ్ళకు గంతలు కడితే మౌనంగా తిరిగిన గానుగెద్దులు/ నేడు రంకెలేయటం/ మూతికి చిక్కం కడితే దుక్కి దున్నిన పశువులు/ ఇప్పుడు కొమ్ములెగరేయటం" మొదలైందంటారు ఆనందరావు. "మా జ్ఞాన నేత్రాలు మా దేహాల గుండా వీక్షించటం/ మొదలుపెట్టిందిప్పుడే" అని శ్రమతో ముడిపడ్డ దళితుల జీవితాలను చూపిస్తారు. మేధస్సు ఎక్కడినుండో రాదు తరతరాల శ్రమశక్తి నుండే వచ్చాయని చెప్పకనే చెబుతారు. దళితులను అవర్ణుడా, శ్వపచుడా, చండాలా, అంత్యజుడా మొదలైన పదాల్ని చూసి "సహస్ర నామాలున్న సర్వేశ్వరులమనుకొన్నా" అని గర్వంగా ప్రకటిస్తారు. "మాకు తోలు వలవటం తెలుసు/ మాకు వెన్ను విరవటం తెలుసు/ మాకు కాటికి కాయమోసి/ కపాలమోక్షం ఇప్పించటమూ తెలుసు/ ఔను!/ మేం చర్మకార్లం/ పాలేర్లం/ కాటికాపర్లం....." అని వికసిత దళితాన్ని ముగిస్తారు.

కవిత్వంలో దళిత కోణం చూపి ధైర్యాన్ని, పట్టుదలను పెంచి మేమూ ఎవ్వరికీ తీసిపోమని ప్రకటించిన ఎందరో కవులున్నారు. అలాంటివారిలో ఆనందరావూ ఒకరు. వారి కలాన్నుండి విరబూసిన పరిమళాలే ఈ "వికసిత దళితం". అది ఎప్పుడూ పరిమళిస్తుంటుంది. సువాసనలు వెదజల్లుతూనే ఉంటుంది. ఒక అంబేద్కర్, ఒక జాషువ ఇచ్చిన స్ఫూర్తిని అందిబుచ్చుకొని ముందుకుపోవటమెలాగో ఈ కవితా సంపుటి తెలుపుతుంది. అందరినీ జాగృతం చేస్తుంది. ♦

# దండించాల్సిందే

- డా॥ కప్పగంతుల మధుసూదన్
9246468076

ఆవేదనతో....
ఔను ! వాళ్ళను దండించాల్సిందే.
తొలిపొద్దులోనే పొలాలకెళ్ళి
దున్నుకోడమో .. విత్తుకోడమో చెయ్యకుండా,
ఆళ్ళ చెమట దిగుబడిని
యే దళారులకో.. దగుల్బాచులకో కట్టబెట్టకుండా ,
ఒకేళ అంత కష్టం చేయలేకపోతే, ఆపొలాన్ని
మా అంబానీలకో.. అదానీలకో అప్పగించకుండా
దినమూ.. ఎగసాయమంటూ మేడి కడతారా
పల్లెల్లో పరిశ్రమలేందని ఎదురు తిరుగుతారా !
వాళ్ళను దండించాల్సిందే !

నల్లధనాన్ని తవ్వి తియ్యాలని
అదాట్న నోట్లు రద్దుచేసి , అంత మంచి పనిజేస్తే
నానాయాగీ చేసింది యీాళ్ళుగాదూ !!
ఇత్తనాలకంటారు, కూలీలకంటారు, పురుగు మందు
కంటారు
ఎరువుల కంటారు, తోలకాలంటారు , బాడిగలంటారు
అప్పుడే మునిగిపోయినట్లు, ఆ పంచెల్ని ఎగ్గట్టుకోని
ఏటియం సెంటర్లలో నిగ్గి నీలుక్కోని
ఎండకో.. బొండకో., తినో.. తినకో..
ఆళ్ళచావు ఆళ్ళు జచ్చి దాన్ని రాజ్యానికి చుడతారా !
ఎంత అలుసైపోయామీాళ్ళకి
వదలకండిరా...
వాళ్ళను శిక్షించాల్సిందే !

మేమేదో కొత్తదనంకోసం 'రుణమాఫీ' అంటే
అదికుబేరులకు మాత్రమే వర్తించే కాన్సెప్టని గుర్తించరే
వీళ్ళు
మహాఅయితే యీాళ్ళు జేసే లచ్చుల అప్పుల్ని నాలుగేళ్ళు
పస్తుండైనా లచ్చునంగా తీర్చియొచ్చుగా!
అప్పుజేసినోళ్ళు పుస్తెలమ్మైనా తీర్చాల్రా అంటే
బుర్రూపుతూ యినకుండా
ఆడాడికోబోయి పెశాంతంగా బతుకుతున్న
ఆ విజయ మాల్యాల పేర్లు., నీరవ్‌మోదీల పేర్లు..
నలుగురి మధ్యల్లో జేరి సణుక్కుంటున్నారే !
ధర్మం తప్పికూడా గొంతు పెగుల్తొందీళ్ళకి



యీాళ్ళని ఖచ్చితంగా దండించాల్సిందే !

'అరే ! పాత ట్రాక్టర్లొద్దురా
ఆటివల్ల పొల్యూషన్ వస్తాది' అంటే ఎంత కసి యీాళ్ళకు
పాత ఆర్ టి సి బస్సులు గుర్తొస్తాయా ...
మా కిందస్థాయి నాయకుల కాన్వాయిల క్కూడా అన్ని
కార్లు ఎందు కంటారా ...
అయ్యి గూడా పొల్యూషనేనా ....
ఆళ్ళ ఆమదాల బుర్రలకు అర్థం కావడం లేదుగానీ
సంవత్సరం మించి అసలు మా వొళ్ళు యే కారైనా
వాడారా
"పొల్యూషన్ గదా" .... ఎప్పటి కప్పుడు మార్చేస్తుళ్ళా...
మేము ఆకాశంలోదిరిగేది గూడా అందుగ్గాదూ
ఐనా అయన్నీ యీాళ్ళకెందుకు ?
దొరికితే మాత్రం వదలిపెట్టొద్దు .....
వాళ్ళను దండించాల్సిందే !

పథకాలు పెడుతూ.. ప్రాజక్టులు కడుతూ
పెద్దపెద్ద భవంతులు.. పదిలైన్ల రోడ్లు..
యిమానాలు, రైళ్ళు.....
మేమొకపాలినుండి మొత్తంగా....
దెవలప్ జేసుకుంటూ పోతుంటే

డీజిల్ పెరిగింది, పెట్రోల్ పెరిగింది, గ్యాసు పెరిగింది,
ఖర్చు పెరిగింది
గిట్టుబాటు ధరొక్కటే పెరగలేదంటారీళ్ళు !
అయ్యి బెరిగితే యియ్యిబెరిగి నట్టుగాదూ ?
అసలు యెకానమీ గురించి యేందెలుసీళ్ళకి !
మా కార్ల ఖర్చు, యిమానాలఖర్చు ఫారెన్‌ఖర్చు, పార్టీఖర్చు
లెక్కలేస్తారా ?
యేంజేస్తార్లే అనుకుంటున్నారేమో ! . . . . .
అటాక్ చెయ్యండీళ్ళ మీద !

కరవొచ్చినా మేమే ..ముంపొచ్చినా మేమే
పండినా మేమే .. ఎండినా మేమే
ఆళ్ళ యిత్తనాలు పుచ్చినా మేమే ...
యేసినపంట సచ్చినా మేమే
ప్రతిదానికీ ప్రభుత్వమేనా యీళ్ళకి
అసలీ అగసాట్లొద్దురాబాబూ .. పొలం అమ్మెయ్ ..
ప్లాట్లేద్దామంటే
అన్నపూర్ణను అమ్మలేమంటూ యేడుస్తారీళ్ళు
యీళ్ళే ప్రపంచాన్ని ఉద్ధరిస్తున్నట్టు
ఆ మైకులోళ్ళు .. పేపర్లోళ్ళు యీళ్ళచుట్టూజేరి
గోలగోలజేస్తారు.
ఊరుకుంటే ప్రమాదకరమీళ్ళు ....
వీళ్ళను దండించాల్సిందే !

ఈ దేశాన్ని యిట్టావొదిలెయ్యలేక
జనాన్ని అభివృద్ధి జేద్దామని
కులభేరులు, మతభేరులు, యువభేరులు, నవభేరులు . . .
అయ్యన్నీ జేసుకుంటూ. . .
డబ్బులిస్తూ .. పలావుబెడుతూ.. బతిమిలాడుతూ..
భంగపడుతూ. . .
మా తిప్పలేవో మేంబడుతుంటే ... బస్సులు బెట్టి జనాన్ని
తోలుకుంటుంటే....
యీళ్ళూరికి బస్సులేదంట
" మీటింగులకెట్టా వస్తది ? " అని నిలదీస్తారీళ్ళు
ఆ వూరి ఆడోళ్ళకు పురుడొచ్చినా , జనాలకు జరమొచ్చినా
పది కిలోమీటర్లు నడవాలంట...
రోజూ మార్నింగ్ వాకింగు, ఈవెనింగ్‌వాకింగు.,
పలకింపులు.పాదయాత్రలు . . . మేంజెయ్యట్లా. . .
నడక మంచిదేగా !!
అసలీళ్ళను రోగాలు దెచ్చుకోమందెవరు ?
పిల్లల్ని కనమందెవరు ? అంత కష్టపడుతూ పట్నానికి
రమ్మందెవరు ?
పచ్చటి పొలాల్లో పొర్లాడి చావకుండా,
పొద్దుట్నే యీళ్ళకి టౌన్లలో పనేముంది ...
సోతంత్రం మితి మీరుతుళ్ళా ....
వదలకండాళ్ళని !!

నాలుగుసార్లోడిపోయినా, సిగ్గిడిసి పెట్టి
సారికీ మేం నిలబడ్డంలా ....
ఆత్మాభిమానమంటా ... బొంగూ బోషాణమంటా ...
యీళ్ళకి అప్పిచ్చినాసావే .. యివ్వకపోయినాసావే
పంట పండినా సావే ... ఎండిజచ్చినా సావే
బుడిక్కన యీళ్ళు సచ్చిపోయి మానెత్తికి చుడతారు .
కరెంటంటే కోతుండదా ... ఎగసాయమంటే నష్టముండదా
....
ఎవరు జెప్పాలీళ్ళకి ?
చెప్పినా వినేదెవరు ?

యీళ్ళకు నిద్దర్రాక .. రేత్రిళ్ళూ పొలాల్లోదిరిగి
బక్క చిక్కిన రైతులంట .. యీళ్ళే ఎన్నుముకలంట ....
మేందిరగట్లా రేయింబగళ్ళు
అక్కడికేదో కర్షకులు కరిగిపోతున్నట్టు
యేలికలు ఎదిగిపోతున్నట్టు ..... అంతా నెగిటివ్ ప్రచారం

పోలీసోళ్ళని బిలవండ్రా ... కుళ్ళబొడవండీళ్ళని
భాష్పవాయువులొదలండి .. ఫిరంగులు పేల్చండి
వాటర్ పైపులతో గుంపులు చెదర గొట్టండి
లాటీకర్రలతో కాళ్ళిరగ్గొట్టండి
అదుగో.... ఆ మిలటరీ వాళ్ళను గూడా పిలవనంపిచ్చండి
వీళ్ళను మాత్రం వదలకండి

కొండల్నికూడా పెకలించే యీళ్ళని కొద్దోళ్ళనుకోకండి
రోయ్ ...
యీళ్ళు నేలను మాత్రమే నమ్ముతారు
నేతల్ని ససేమిరా నమ్మరు !
♦

నచ్చిన రచన

# మనసు పొదల్లో వెల్లువెత్తిన కవిత్వం






- వై.హెచ్.కె. మోహన్‌రావు
8985296123

సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఉద్యోగ బాధ్యలతోపాటు కవిత్వాన్ని కూడా గాఢంగా ప్రేమించినవారు. ఒక ప్రభుత్వ ఉన్నతాధికారినన్న భావనను ప్రదర్శించని సాహితీవేత్త. అందరినీ కలుపుకుపోయే వ్యక్తిత్వం ఆయనది. ఎలాంటి దర్పంలేని కవి. సాహితీ సంస్థలకూ, సాహిత్యకారులకూ పరిచయం అక్కర్లేని పేరు ఆయనది. దశాబ్ద కాలంగా గుంటూరు జిల్లా రచయితల సంఘానికీ, నాలుగేళ్ళుగా ఆం.ప్ర.రచయితల సంఘానికీ అధ్యక్షబాధ్యతలు నిర్వహిస్తూ ఆ జోడు సంస్థలనూ విస్తృతి పరుస్తున్న అత్యంత అనుభవజ్ఞులు.

వచన కవిత్వం, నానీల కవిత్వం, కథ, వ్యాసరచన ఇత్యాది నాలుగు సాహితీ ప్రక్రియల్లో నిష్ణాతులైన సోమేపల్లి ఏడవ కవితా సంపుటి 'మట్టి పొరల్లోంచి..!' మకుట ధరి. మొత్తం సంపుటాల్లో ఐదు వచన కవిత్వం, రెండు నానీల రచనలూ ఉన్నాయి. గత 75 వారాలుగా ఆంధ్రజ్యోతి గుంటూరు జిల్లా సాహితీపుటకు ప్రతి సోమవారం క్రమం తప్పకుండా 'నానీ'లు పంపుతున్న ఏకైకకవి సోమేపల్లి. వీరి ఒక్క 'తదేకగీతం' వచన కవితా సంపుటిపైనే పరిశోధన జరిపి ఓ విద్యార్థి యంఫిల్ పట్టా పొందారు. ఇదే సంపుటి హిందీభాషలోకి అనువదించబడటం విశేషం. సాత్వికులైన సోమేపల్లి సాహిత్యంలో మెత్తదనం, నిరసన, నిలదీత, ఆగ్రహం, ప్రబోధం, అనునయం వంటి వివిధ కోణాలు అక్షరరూపమెత్తుతాయి. వాఙ్మయ తెరలను ఒక్కొక్కటిగా తొలగించుకుంటూ పరిపూర్ణుడుగా రూపాంతరం చెందుతూ ఇప్పుడు 'మట్టిపొరల్లోంచి..!' కవితా సంపుటం వెలువరించారు.

చదువరిని గాఢంగా హత్తుకునే విశాలమైన భావుకత. సాంద్రమైన కవిత్వం వ్రాసే సోమేపల్లి వారి కలం నుండి వెలువడిన నూతన వచన కవితా సంపుటి కూడా కవన పొరల్లో జీవం పోసుకుంది. ఇందులో సమకాలీన, సార్వకాలీన అంశాలపై అల్లిన 32 కవితలున్నాయి. రైతు వెతలూ, ప్రస్తుత గ్రామీణ ముఖచిత్రం, ఆధునికత మోజులో కోల్పోతున్న మానవసంబంధాలూ, అంతరించి పోతున్న చేతివృత్తులూ, నేటి 'అమ్మ' స్థితీగతీ, నీటి సంరక్షణావశ్యకత, తరుగుతున్న తెలుగు భాషా ప్రభ, మానవతలు లుప్తమైన మనిషి వంటి అంశాలు ఈ కవితల్లో ఇమిడివున్నాయి. ఈ కవితల్లో 'మానవత్వపు పతాక' మకుటం కలిగిన కవితను ముగిస్తూ పాలకుడు ఎటువంటి శీల సంపద అలవరచుకోవాలనే విషయంపై ఆయన గొంతెత్తుతారు. శిఖరాన్ని / అధిరోహించిన వ్యక్తి / అక్కడ / మానవత్వపు పతాక ప్రతిష్టించి / జే గంటలు మోగించాలి' అంటూ ఆయన ఒక ఆశయాన్ని ఎలుగెత్తారు. నిజమే కదా! పాలకులు సద్భావనతో ప్రవర్తిస్తే ప్రజలకూడా సత్ప్రవర్తనతో వారి దారిలో నడుస్తారు. గొప్ప విలువలు కలిగిన సమాజం నిర్మాణమౌతుంది. ప్రస్తుత పాలకులకే కాదు,

భావికాలాల పాలకులకూ ఇదో మార్గదర్శనం. యథారాజా తథాప్రజలు అన్న సూక్తికి ఆధారంగా ఉన్నాయి పై వాక్యాలు. అత్యంత వాస్తవికమైన అనాధికాలపు ఆర్యోక్తి ఇది. ప్రస్తుతం నెలకొన్న అనుచిత సామాజిక రుగ్మతలన్నింటికీ నేటి పాలనావ్యవస్థల తీరుతెన్నులే మూలమన్న విషయం అందరినోటా సర్వత్రా వినపడుతూ వస్తూన్న మాట. విలువలు మంటగలసి అవినీతి అక్రమాలకు నిలయమైన పాలన మారాలంటే పాలకుల తీరు నీతివంతంగా తయారవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానవతా విలువలు పెంపొందాలని సోమేపల్లి వారు చాలా స్పష్టంగా సెలవిచ్చారు.

'ఫేస్‌బుక్‌లో అమ్మ' శీర్షిక గల కవితలో హైటెక్ యుగంలో బిడ్డల స్వభావ స్వరూపాలను నగ్నపరిచారు. 'ఒకానొక సాయంత్రం / ఆకస్మికంగా / తల్లి మరణించింది. / ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి / లైక్‌లకోసం / కామెంట్లకోసం / నిరీక్షణే.. నిరీక్షణ' అంటూ ముక్తాయింపు నిస్తారు. ఆధునికంగా సంతానం తల్లి మరణాన్ని కూడా ఎంత నిర్లక్ష్యంగా స్వీకరిస్తుందోననే అంశాన్ని ఆయన తీవ్రంగా ఎండగట్టారు. యువత ఎలక్ట్రానిక్ సౌకర్యాలకు బానిస ఐన విధానాన్ని ఆయన బట్టబయలు చేశారు. అమ్మనూ ఆమె మరణాన్ని సైతం అసహాస్యం చేసే దశకు చేరుకుందని వేదన చెందుతున్నారు. ఇది ఆయనందించిన ఉదాహరణ కావచ్చు. అతిశయం మాత్రం కాదు. వాస్తవమేనని గ్రహించాలి. ఈ రోజుల్లో ఇంట్లో పనికిరాని ఉపకరణాల జాబితాలో ప్రప్రథమంగా చేరుతుంది వృద్ధ తల్లిదండ్రులే. వీరిపై డస్ట్‌బిన్‌లనే పరిహాస పదం కూడా ప్రయోగిస్తున్నారు. ఎంత విచారకరం. విస్మరణకూ, నిరాదరణకూలోనై అలవికాని ఆవేదనతో చావుకోసం కళ్ళలో వత్తులు వేసుకుని కాలం వెళ్ళదీస్తున్న వృద్ధులైన తల్లిదండ్రులెందరో? తల్లినీ, మరోచోట తండ్రినీ స్మశానాల్లో విడిచి వచ్చే కసాయి బిడ్డలను గమనిస్తూనే వున్నాం. ఒంటిపై చెంచాకండలేని అత్తలను నానా చిత్రహింసలకు గురిచేసి ఈడ్చిపడేసి నేలపై జరజరా ఈడ్చుకెళుతున్న కోడళ్ళను టీవీల్లో, సోషల్‌మీడియా తెరలపై చూస్తూనే వున్నాం. హృదయ విదారకంగా ఉంది అమ్మల స్థితి. వృద్ధాశ్రమలన్నీ ఆదరణకు నోచుకోని తల్లిదండ్రులలో కిటకిటలాడుతున్నాయి. ఈ వైపరిత్యాన్నే ఆయన హైటెక్‌గా కవిత్వీకరించారు.

'ఎక్కడని వెదకడం..?' శీర్షిక ఉన్న కవితలో 'అయితే ఇప్పుడు / మనిషిని వెతకాలి / బయటకాదు / మనిషిలోనే' అంటారు. 'ఈ ప్రపంచంలో అన్నీ ఉన్నాయి. కానీ మనిషేలేడు' అనే నానుడిని దార్శనికులు ప్రయోగిస్తున్నారు. 'మాయమైపోతున్నడమ్మా మనిషన్న వాడు' అంటాడు ఒక వాగ్గేయకారుడు. వసుధపై నేటి జనాభా 750 కోట్లు. ఐతే మానవ విలువలున్న మనుషులు మృగ్యమై పోతున్నారనేది కవి వ్యక్తీకరణ. మనిషిని మనిషిగా ప్రేమించే మనుషులు కావాలని ఆయన అభిలషిస్తున్నారు. 'నిన్ను నిన్నుగా ప్రేమించుటకు, నీకోసమే కన్నీరు నింపుటకు, తోడొకరుండిన, అదే భాగ్యము, అదే స్వర్గమని' మహాకవి శ్రీశ్రీ అన్నారు. మనిషికి కొలమానం డబ్బో, అధికారమో, లబ్ధినో కాకూడదనేది సోమేపల్లి వారి ఆకాంక్ష. పారిపోతున్న మనిషితనం తిరిగి పాడుకోవాలని ఆయన మనసా ఆశిస్తున్నారు.

సంపుటిలోని కవితలన్నీ ఇటువంటి సామాజికాంశాలతోనే సాగాయి. అన్ని కవితలూ చదివి ఆస్వాదించాల్సినవే. మరిన్ని కవితలను విశ్లేషించడం భావ్యం కాదనుకుంటాను. మచ్చుకు మాత్రమే కొన్ని కవితల్లోని పంక్తులను మీ ముందుంచుతున్నాను. 'మట్టి పొరల్లోంచి' వచ్చిన కవిత్వమంతా తాజాగా ఆయన మనసుపొరల్లోంచి మొలకలెత్తిన భావావేశాలే. శ్రద్ధగా చదివి హృదయానికి పట్టించాల్సిన కవిత్వకుదురు 'మట్టి పొరల్లోంచి' సంపుటి. అద్భుతమైన కవిత్వాన్ని అందించిన సోమేపల్లి వారికి అభినందనలు. ఈ పుస్తకాన్ని ముద్రించుటకు గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ వారు ఆర్థిక సహకార మందించారు. సాహితీవేత్తలకు సహృదయ ప్రోత్సాహమందిస్తున్న సుబ్బారావు గారికి ఒక కవిగా మరీ మరీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

కాలంతో పాటు ముందుకు ప్రయాణిస్తున్న కవి సోమేపల్లి. కాలానుగుణంగా కవిత్వం వ్రాస్తున్న కవి. సమకాలీనంగా వస్తువును ఎంచుకుంటున్న కవి. సాహితీ పరిణామాల క్రమానుగుణంగా తనుకూడా మారుతూ, మార్పులను తన శైలికి అన్వయించుకుంటూ ముందుకూ, మునుముందుకూ నడుస్తూ నిత్య నూతనంగా పరిణామం చెందే కవి సోమేపల్లి. 2018లో వెలువడ్డ తడి ఆరని కవిత్వం నిండిన **'మట్టి పొరల్లోంచి'** వచన కవితా సంపుటి పుటలు. 56, ధర రూ. 60/-లు. క్రిసెంట్ పబ్లికేషన్స్, 29-25-43ఎ, వేమూరి వారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ - 520002. చిరునామాను సంప్రదించాలి. సోమేపల్లి సెల్ నెం: 9000004565తో ముచ్చటించవచ్చు. ♦

# స్వీకారం

## కథామీనార్



సమకాలీన ముస్లిం నేపథ్య కథలు 2005 - 2018

సంపాదకులు: **మహమ్మద్ ఖదీర్‌బాబు**

**వేంపల్లె షరీఫ్**

వెల :170/- పేజీలు: 266

ప్రతులకు : 9603429366

దేశంలో జరుగుతున్న ఘటనలకు వర్తమాన తెలుగు ముస్లిం సమాజం ఎలా అనుకంపనం చెందుతున్నదో తనకు తానుగా జీవనం ఎలా సాగిస్తున్నదో తెలియడానికి ఆంధ్రప్రదేశ్ తాలూకు మానసిక ఆవరణాన్ని ఒక నిర్దిష్టమైన శాంపిల్‌గా తీసుకుని ఎంచిన కథలు ఇవి.

**- సంపాదకులు**

## సిరిజల్లు బాలల గేయ సంపుటి



**సింహాద్రి నాగశిరీష**

వెల : 80/- పేజీలు: 57

ప్రతులకు : 9492249327

రచయిత్రి నాగశిరీష పిల్లల మనస్సులను, వారి పోకడలను అద్దంలో బింబంలా పసిగట్టిన బాలల పక్షపాతి. పాటలన్నీ స్పందించి రాసినవే... ఇందులో ఒక తల్లి, పిల్లలు విరివిగా మనకు తారస పడతారు. రెండు తీర్లా పాటలున్నాయి. పిల్లలంతా పిల్లల మాదిరిగా ఎట్లుంటారో, ఒకే తల్లే అయినా అందరు తల్లుల హృదయం పాటల్లో ఉంటుంది.

**- భూపాల్**

## పర్యావరణ ప్రయాణాలు



ప్రయాణ కవిత్వం

**అద్దేపల్లి ప్రభు**

వెల : 20/- పేజీలు: 32

ప్రతులకు: 9848930203

కనపడని అయిస్కాంత క్షేత్రమేదో/ కాలికి చక్రాల్ని కట్టి లాగుతుంది/ఒక పొడిగాలి విసురూ/ఒక లేయెండ ఎదురూ/దేహాన్ని తడుముకుంటూ పోతాయి/ఛలో ఇబ్రహీం... కాసింత లాంగ్ డ్రైవ్ పోదాం/ కుళాయి చెరువు నించి మాటల బండి /బయలు దేరుతుంది...

**- అద్దేపల్లి ప్రభు**

## హిమధాత్రి కవిత్వం



**పుప్పాల సూర్యకుమారి**

వెల : 40/- పేజీలు: 73

ప్రతులకు : 9701973843

అరుదైన ఈ కవితా సంపుటిలో అంబేద్కరిజం ఉంది. వందేమాతరం మాటు జాతి మాధుర్యం ఉంది. చెట్టు చైతన్యశోభ, మట్టి పరిమళాల ప్రభా ఉన్నాయి. వరాయాకరణలు, ప్రపంచీకరణలూ మనల్ని ప్రశ్నిస్తాయి. ఉగ్రవాదాలు, అహింసావాదాలు పాఠకుణ్ణి ప్రభావితం చేస్తాయి. నిర్భయులు, బడుగుల జీవితాలు, మతమౌఢ్యాలు చదువరులను ఉలిక్కిపడేలా చేస్తాయి.

**- వడలి రాధాకృష్ణ**

## వెలుతురు బాకు కవిత్వం



**వనజ తాతినేని**

వెల : 125/- పేజీలు: 166

ప్రతులకు: 9985981666

వనజ కథలైనా, కవిత్వమైనా ఆమెలోని అన్వేషణా తృష్ణకి సంకేతాలు. ఎవరైనా ఒక వెతుకులాటలో భాగంగానే రాస్తారు. కాని, ఆ వెతుకులాటకి ఎంతో కొంత అర్థం తెలిసినప్పుడు గమ్యం మసకగా అయినా కనిపిస్తుంది. వనజ కవిత్వంలో ఆమె గాఢమైన అనుభవ పరిపక్వత ప్రతి సందర్భంలోనూ వ్యక్తమవుతుంది.

**- కల్పనా రెంటాల**

## కథల గోదారి



**దాట్ల దేవదానం రాజు**

వెల : 120/- పేజీలు: 147

ప్రతులకు: 9440105987

ఈ గుచ్ఛంలో కథలన్నిటికీ కాన్వాస్ గోదావరే. పొడుగు వెడల్పుతో పాటు ఎత్తు కలిగిన కాన్వాస్ గోదావరి. దాట్ల ఒక్కో అలని చుట్టచుట్టుకు ఇంటికి తీసుకెళ్ళి, మనసులో పరిచి, ఆరబెట్టి దాని మీద రాసిన కథలివి. పైగా కథా శీర్షికల్ని మిత్రులు సూచించగా వాటితో ఇతివృత్తాలు అల్లుకున్నారు. చక్కని పూరణతో అందించి, సరికొత్త అవధానానికి అంటు తొక్కారు.

**- శ్రీరమణ**

# స్వీకారం




## మూడు పదులు ముప్పై కావ్యాలు

'ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు' పొందిన కవితా సంపుటాలపై విశ్లేషణలు

**డా॥ ఉమ్మడిశెట్టి రాధేయ**

వెల :150/- పేజీలు: 214

ప్రతులకు : 9985171411

**మా** అవార్డు గ్రహీతలైన ముప్పై మంది కవులు వారి ముప్పై ఉత్తమ కావ్యాల విశ్లేషణ 'మూడు పదులు - ముప్పై కావ్యాలు". ఇందులో మూడు దశాబ్దాల తెలుగు కవిత్వంలో సంభవించిన అనేక పరిణామాలను మనం గమనించవచ్చు. ఒక కవిగా నాకున్న అవగాహనతో ఈ విశ్లేషణా వ్యాసాలు వెలువరిస్తున్నాను.

**- డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ**




## నీళ్లలోని చేప కవిత్వం

**బాలసుధాకర్ మౌళి**

వెల : 120/- పేజీలు: 187

ప్రతులకు : 9676493680

**"సు**మారు నా రెండేళ్ల జీవితాన్ని అక్షరాల్లోకి అనువదించుకుంటే ఇప్పుడు మీ చేతుల్లో వున్న ఈ సంకలనం. అయినా వెలితి మిగిలే వుంది. 'ఏరోజుకారోజు ఒక అసంపూర్ణం' అనే తెలివిడి వుంది నాకు. ఒక కవిత పుట్టుకకు ఒక ప్రత్యేక సందర్భమొక్కటే కారణం కాదనుకుంటాను. కవిత ఒక పర్టిక్యులర్ శిల్పంలో ఒదుగుతున్నట్టనిపిస్తుంది. గాని దాని వేళ్లు ఎక్కడో మొదలవుతాయి. చిగుళ్లు ఎక్కడెక్కడికో విస్తరిస్తాయి.

**- బాలసుధాకర్ మౌళి**




## ప్రతిధ్వని సాహిత్య వ్యాసాలు

**డా॥ దిలావర్**

వెల : 100/- పేజీలు: 156

ప్రతులకు: 9866923294

**డా॥**దిలావర్ సీనియర్ రచయిత. ఈ వ్యాస సంపుటిలో పదహారు వ్యాసాలున్నాయి. సమకాలీన తెలుగు సాహిత్యంలో ప్రతిభావంతంగా రాస్తున్న రచయితల పుస్తకాల గురించిన మంచి విశ్లేషణ ఈ పుస్తకంలో ఉంది. ఈ వ్యాసాలన్నీ వివిధ పత్రికలలో ప్రచురించబడినవే. అన్నింటినీ ఒకచోట చేర్చి పాఠకులకు అందించడం అభినందనీయం. ఇది విలువైన వ్యాసాల సమాహారం




## మౌనగీతం కవిత్వం

**జి. శాంతారెడ్డి**

వెల : 30/- పేజీలు: 60

ప్రతులకు: 8008177325

**అ**మెరికాలో జరిగే కొన్ని విషాదాలను వింటున్నప్పుడు పేపర్లలో చదువుతున్నప్పుడు అటువంటి సందర్భాలలో శాంత వేదనా సందేశం ఏదైతే ఉందో చాలా సందర్భోచితంగా ఉంది. చదువుతుంటే నా హృదయం ఆర్ద్రమైంది. నా పాలమూరు కవితలో పాలమూరును మన కళ్లముందు చిత్రిక కట్టించింది. హోళీ పండగ వర్ణన రసవంతంగా వుంది. ఈమె రాసిన నలభైపై కవితలతో మౌనగీతాన్ని రూపుదిద్దడం సంతోషదాయకం.

**- డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి**




## మొగ్గలు

**డా. భీంపల్లి శ్రీకాంత్**

వెల : 50/- పేజీలు: 117

ప్రతులకు: 9032844017

**ఈ** మొగ్గలు మూడు పాదాల కవిత్వమే అయినప్పటికీ క్లుప్తత, సరళత, సంక్షిప్తత, గాఢత దీని ప్రధాన లక్షణాలు. మొగ్గలు కవిత్వానికి ఎలాంటి అక్షర నియమం కాని, ఛందస్సు కానీ లేదు. అందరూ సులభంగా రాసే కవితా ప్రక్రియ ఈ మూడు పదాల కవిత్వాన్ని చక్కగా అభివ్యక్తీకరిస్తే తప్ప మొగ్గలు తెలుగు సాహిత్యంలో నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది.

**- డా. భీంపల్లి శ్రీకాంత్**



## విశ్వయుద్ధంలో మనమెక్కడ?

**శ్రీమతి పత్తి సుమతి**

వెల : 50/- పేజీలు: 60

ప్రతులకు: 8790499405

**మం**చి పుస్తకం - "విశ్వయుద్ధంలో మనమెక్కడ" వ్రాసిన రచయిత్రి శ్రీమతి పత్తి సుమతి గార్ని కొనియాడక తప్పదు. మంచి అవగాహనతో సుమతి మేడమ్ గారు అన్ని కోణాల నుంచి శాస్త్రీయంగా క్రీడల ప్రాముఖ్యతను వివరించిన తీరు చాలా అభినందనీయం. ముఖ్యంగా యువతకు ఈ పుస్తకం స్ఫూర్తిదాయకం. ప్రతీ విద్యార్థి ఈ పుస్తకం చదివి ప్రేరణ పొందుతారని నేను ఆశిస్తున్నాను.

**- శ్రీనివాస్ కుమార్ బడి**

# స్వీకారం

## విశాఖ సంస్కృతి ఉత్తమ బాలల కథలు 2018



**సంపాదకులు: శిరేల సన్యాసిరావు**

**వెల :100/- పేజీలు: 90**

**ప్రతులకు : 9603076777**

'విశాఖ సంస్కృతి' పత్రిక వారు గడచిన సంవత్సరం (2017) బాలల కథల పోటీ నిర్వహించి అందులో ఉత్తమ కథలను పత్రికలో ప్రచురించడమే కాకుండా వాటన్నింటిని ఒక చోటుకి చేర్చి పుస్తకంగా సాహితీ లోకానికి అందించడం ఎంతో స్ఫూర్తిదాయక అంశం.

**- డాక్టర్ మక్కెన శ్రీను**

## మట్టిమనిషి ధిక్కార స్వరం



**కవిత్వం**

**సంపాదకులు: బైస దేవదాసు**

**వెల : 10/- పేజీలు: 66**

**ప్రతులకు : 9000065433**

'కాళోజీ జయంతి సందర్భంగా ఇచ్చిన పిలుపు మేరకు స్పందించిన కవుల కవిత్వాన్ని 4-9-2014న నేటినిజం పత్రికల్లో ప్రచురించడం జరిగింది. ఆ కవిత్వాన్ని సెప్టెంబర్ 9 కాళోజీ జయంతి సందర్భంగా వెలువరిస్తున్నదే ఈ "మట్టిమనిషి ధిక్కారస్వరం" కవితా సంకలనం.

**- బైస దేవదాసు**

## యుగకర్త గురజాడ




**ప్రొ॥ వెలమల సిమ్మన్న**

**వెల : 160/- పేజీలు: 148**

**ప్రతులకు: 9440641617**

"యుగకర్త గురజాడ" అనే రచన వాదనలకు, ఎంతోమంది ఆలోచనా వైఖరులకు అద్దం పడుతుంది. ఇందులో చర్చకు నోచుకున్న అనేక విషయాల్ని తమ విజ్ఞతతో ఆలోచించడానికి ఇది మంచి అస్కారాన్నిస్తుంది. అంతేకాక ఆచార్య సిమ్మన్న గారి విస్తృత పఠనాన్ని, పరిశీలనని తెలియజేస్తుంది.

**- ప్రొ॥ కొండపల్లి సుదర్శనరాజు**

## సాహితీవనంలో ఒక మాలి డా. కపిలవాయి లింగమూర్తి



**కూర్పు: డా. కొల్లోజు కనకాచారి**

**వెల : 180/- పేజీలు: 194**

**ప్రతులకు: 9491593871**

ఇందులో కపిలవాయి గారి జీవనం, వారి వలు గ్రంథాల సంక్షిప్త పరిచయం, వారి శిష్యగణం పరిచయాలు, శిష్యులు, మిత్రులు చేసిన స్తుతులు, ఉదాహరణప్రాయంగా ఒకటి రెండు ముందుమాటలు (కపిలవాయి వారివి, ఇతరులు రాసినవి), వారందుకున్న బిరుదులు, సత్కారాలు, సన్మానాలు, రచనలు, వారి రచనలు ప్రచురించిన పత్రికల పట్టికలు, వారి సాహిత్యంపై పరిశోధన చేసిన వారి సమాచారమూ, ఉద్దరించ దగిన కపిలవాయి వాక్యాలు ఉన్నాయి.

**- డా॥ కొల్లోజు కనకాచారి**

## రాజరథం సాహిత్య రూపకం (భువన విజయం)




**డా॥ కపిలవాయి లింగమూర్తి**

**వెల : 50/- పేజీలు: 117**

**ప్రతులకు: 9032844017**

అష్ట దిగ్గజాలు వారిపై ఉండే అపవాదులు, వారి వారి చాటువులు అంతేగాక పాఠకులు చెప్పుకునే వారి వారి కృతులలోని గుణ దోషాలు అనే విషయాలు ఆ దిగ్గజ కవుల నోటి వెంటనే వారి సంభాషణ రూపంలో ప్రేక్షకులకు అందించవలెననే దృష్టితో కూర్చినాను.

**- డా. కపిలవాయి లింగమూర్తి**

## ఇదేదో నెమలి నీడలా వుంది




**ఆశారాజు కవిత్వం**

**వెల : 200/- పేజీలు: 221**

**ప్రతులకు: 9392302245**

ఎక్కడెక్కడ నుండి తెచ్చుకోవాలో/ నీడ కోసం నాలుగు సిమెంటు రేకులు/ గోడలు లేపి చాన్నాళ్లయింది/ చినుకు వెంట చినుకు రాలి/ కూలిపోయే దశకు చేరింది/ కట్టింది మట్టితో కదా–/ పరిమళముంటుంది కాని, / పట్టు గట్టిగా వుండదు/ మీద పడుతుందన్న దిగులు లేదు కాని, / కూలిపోతే కలలు ఎగిరిపోతాయన్న భయముంది....

**- ఆశారాజు**

# అలరించిన అనంత పుస్తక సంబరాలు




- డాక్టర్ యం.ప్రగతి

అనంతపురం వాసులకు దసరా ఉత్సవాలు కాస్త ముందుగానే విచ్చేశాయి. ఎన్.టి.ఆర్. ట్రస్ట్, విజయవాడ బుక్ ఫెయిర్ ఎగ్జిబిషన్, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా 2 వ పుస్తక మహోత్సవం అక్టోబర్ 6 వ తేదీ నుండి 14 వరకు 9 రోజుల పాటు అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో విజయవంతంగా జరిగింది. తొలి రోజు అంటే అక్టోబరు 6 వ తేదీ సాయంత్రం జిల్లా కలెక్టరు వీరపాండ్యన్, నగర మేయరు శ్రీమతి స్వరూప పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సభలో కలెక్టరు మాట్లాడుతూ పుస్తకం మంచి చెడులను విడమరచి చెబుతుందన్నారు. కుటుంబ సమేతంగా పుస్తక ప్రదర్శనను సందర్శించాలని కోరారు. ప్రముఖ కవి సింగమనేని నారాయణ మాట్లాడుతూ సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా పుస్తకం విలువ ఏమాత్రం తగ్గలేదన్నారు. తొలిరోజు సభలో శాసనమండలి మాజీ సభ్యులు డాక్టర్ గేయానంద్, ఎమెస్కో అధినేత విజయ్ కుమార్, ఆర్డీవో మలోల, జిల్లా విద్యా శాఖాధికారి జనార్ధనాచార్యులు తదితరులు పాల్గొన్నారు. మిగిలిన ఎనిమిది రోజులు జరిగిన రకరకాల సాహిత్య, సాంస్క ృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సభా వేదికకు అనంతపురం గర్వించదగ్గ రచయిత చిలుకూరి దేవపుత్ర వేదిక గా నామకరణం చేశారు. ఆరు గ్లాసులు, ఏకాకి నౌక చప్పుడు, వంకర టింకర ఓ వంటి కథా సంకలనాలతో పాటు పంచమం వంటి అద్భుతమైన నవలలు రాసిన దేవపుత్ర పేరు ప్రాంగణానికి పెట్టడం ఎంతైనా సముచితమని సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు.

అక్టోబరు 7 వ తేదీ ఆదివారం జరిగిన రాయలసీమ కథ-నవల సదస్సుకు డాక్టరు ఎం.ప్రగతి అధ్యక్షత వహించారు. ఈ సభలో డాక్టర్ నాగేశ్వరాచారి నవల గురించి మాట్లాడుతూ రాయలసీమలోని ఫ్యాక్షన్, కరువు, గ్రామీణ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులను బండి నారాయణ స్వామి, చిలుకూరి దేవపుత్ర, శాంతి నారాయణ వంటి అనేక మంది రచయితలు గద్దలాడతాండాయి, మీ రాజ్యం మీరేలండి, పంచమం, పెన్నేటి మలుపులు మొదలైన నవలల్లో ఆలోచనాత్మకంగా చిత్రీకరించారని పేర్కొన్నారు. బతుకు వెతుకులాట రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి రాయలసీమ కథ, నవలల్లో మాండలిక ప్రయోగం గురించి మాట్లాడుతూ ఆయా ప్రాంతాల భాష, సంస్కృతిని ప్రతిబింబించేలా రచనలు కొనసాగాలని అన్నారు. తిరస్కారానికి గురైన రాయలసీమ మాండలికాన్ని ఇప్పుడు అనేక మంది రచయితలు అద్భుతంగా ఉపయోగించి, సఫలీకృతులయ్యారని గుర్తు చేశారు. తాను రాసిన ఇసక, కొల్లబోయిన పల్లె కథలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతపురం లో వస్తున్న నూతన ఒరవడుల గురించి సీనియర్ రచయిత్రి శశికళ, వర్ధమాన కథా రచయితలు వెంకటేసులు, దీవెన, ప్రగతి తదితరులు మాట్లాడారు. ఈ సభను వర్ధమాన కథా రచయిత వేంకటేశు

లు నిర్వహించారు. సభకు ముందు జ్ఞాన స్కంద ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది.

అక్టోబరు 8 వ తేదీ అనంత కవిత్వం గురించి సదస్సు ప్రముఖ కవి మల్లెల నరసింహ మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో పద్య కవిత్వం గురించి డాక్టర్ ఆశావాది ప్రకాశరావు ప్రసంగిస్తూ, పద్యానికి విశిష్ట లక్షణాలున్నాయని, సర్వ కవితలకు పద్యం ఆద్యంగా నిలుస్తుందని అన్నారు. ఈ భాష లోనూ లేని యతి ప్రాసలు తెలుగు పద్యాల సొంతమన్నారు. పల్లెల్లో పద్య నాటకాలు, పద్యాలతో నిండిన హరికథలను బాగా ఆదరిస్తున్నారన్నారు. డాక్టర్ జూపల్లి ప్రేం చంద్ అనంత కవుల కవిత్వంలోని వస్తు వైవిధ్యాల గురించి చర్చించారు. ప్రధానంగా కరువు గురించి ఇక్కడి కవులు చిత్రించిన కవిత్వం అద్భుతమని పేర్కొన్నారు. కరువు గురించి రాసిన కవితల సంకలనం వొరుపు గురించి ప్రస్తావించారు. ప్రకృతి శీతకన్ను, పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ వర్ధమాన కవులు తమ కలాలను ఎక్కుపెట్టిన తీరును ప్రశంసించారు. అనేక మంది యువ కవులు తమ వస్తు విస్తృతిని పెంచి కవితలు రాస్తున్న తీరు అమోఘమని అనేక కవితలను గుర్తు చేశారు. విప్లవ కవి జెట్టి జైరాం మాట్లాడుతూ కవిత్వంలో ఆధునికత ప్రవేశించిన తీరుతో పాటు వివిధ ధోరణులను పరిచయం చేశారు. సభను వర్ధమాన కవి మిద్దె మురళీకృష్ణ నిర్వహించారు. సభ అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో దాదాపు 30 మంది కవులు తమ కవిత్వాన్ని వినిపించారు. కవిసమ్మేళనాన్ని డాక్టర్ ఎ.ఎ.నాగేంద్ర, మధురశ్రీ, మిద్దె మురళీకృష్ణ, దాదా ఖలందర్ నిర్వహించారు. సభ ప్రారంభంలో చిన్నారి రోహిత ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులను ఆనంద డోలికలూగించింది.

నాలుగవ రోజు అంటే అక్టోబరు 9 వ తేదీ సాయంత్రం "తెలుగు భాషా వికాసం" అనే అంశం మీద జరిగిన సదస్సుకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పెద్దిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో విశ్రాంత ఆచార్యులు పి.ఎల్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ స్థాయిలో ద్వితీయ భాషగా తెలుగు స్థానే సంస్కృతం చొరబడటం పాలకులకు తెలుగు భాష పట్ల సవతి ప్రేమను చాటుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకాశవాణి సీనియర్ వ్యాఖ్యాత డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి మాట్లాడుతూ ఒక భాష మనుగడ సాగించాలంటే ఆ భాషను ఆ ప్రాంతంలో ప్రజలు తమ నిత్య దైనందిన జీవితంలో ఉపయోగించడం అవసరమన్నారు. గొట్టిముక్కల సుబ్రహ్మణ్య శాస్త్రి రచించిన కొన్ని పద్యాలు పాడి వినిపించి, తెలుగు భాష వికాస ప్రాధాన్యత గురించి వివరించారు. విజయకుమార్ మాట్లాడుతూ రవీంద్రనాథ్ టాగూర్ ఒక వ్యక్తి అభిప్రాయాలను మాతృభాషలో మాత్రమే స్పష్టంగా వ్యక్తం చేయగలమన్నారని పేర్కొన్నారు. టాగూర్ తన మాతృభాష లోనే గీతాంజలి రాసి నోబెల్ బహుమతి పొందారన్నారు. మన దేశంలో హిందీ తర్వాత తెలుగు భాష మాట్లాడే వారి సంఖ్య అధికంగా ఉండేది కాగా ఇప్పుడు తెలుగు భాష మాట్లాడే వారి సంఖ్య 4 వ స్థానానికి పడిపోయిందని ఆవేదన చెందారు. ఈవిషయాన్ని గురించి ప్రతి తెలుగు వ్యక్తి సింహావలోకనం చేసుకోవాలన్నారు. ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ డిగ్రీ స్థాయిలో విద్యార్థులు తెలుగు ద్వితీయ భాష గా చదివే అవకాశం కేవలం మూడు సెమిస్టర్లకు మాత్రమే పరిమితం అయిందని, దీనివల్ల విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో తెలుగును చదివే అవకాశం కోల్పోతున్నారని అన్నారు. కళ్యాణ దుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ అంకె శ్రీనివాస్ ఆహ్వానం పలుకగా, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలఅధ్యాపకులు హేమమాలిని వందన సమర్పణ చేశారు.

5 వ రోజు అక్టోబరు 10 వ తేదీ బుధవారం సాయంత్రం కార్యక్రమాలు చిన్నారులు వాక్య, కవన విలాసి ముద్దుముద్దుగా పలికిన పద్యాలతో ప్రారంభమయ్యాయి. అనంతరం "సాహిత్య సృజనలో అనంత మహిళలు" అనే అంశం గురించి సభ జరిగింది. ఆచార్య ఎం.కె.దేవకి అధ్యక్షత వహిస్తూ, చాలమ్మ, తాళ్ళపాక తిమ్మక్క వంటి 10 మంది మహిళలు పద్య కవిత్వాన్ని ప్రాచీన కాలంలోనే రాశారన్నారు. తదనంతర కాలంలో సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి సంఘసంస్కర్తలు చేసిన కృషి లో భాగంగా స్త్రీ విద్య ను ప్రోత్సహించారు. అలా చదువుకున్న మహిళలు రచనలు చేస్తూ మహిళలు ఎదుర్కొన్న సమస్యలను ప్రస్తావించారు. మాతురేఖ సలాం రచయిత శశికళ మాట్లాడుతూ ఒకప్పుడు సాంఘిక దురాచారాల కారణంగా మహిళలు పడిన ఇక్కట్లను, ప్రేమ కథలను ప్రస్తావించిన మహిళా రచయితలు తర్వాతి కాలంలో విభిన్నమైన వస్తువులతో తమ కలాలకు స్త్రీ వాదమనే పదును పెట్టారన్నారు. ప్రసవ వేదన, ఋతు సమస్యలు, లైంగిక వేధింపులు, స్త్రీ విముక్తి

వంటి అనేక వైవిధ్యమైన సాహిత్య వస్తువులను తీసుకుని రాస్తున్నారని పేర్కొన్నారు. నేటితరం రచయిత్రులు మరింత విస్తృతంగా రచనలు చేయాలని కోరారు. మానస బాంధవ్యం నవలా రచయిత్రి షహనాజ్ మాట్లాడుతూ పురుష రచయితలతో పోలిస్తే మహిళలు రచనావ్యాసంగంలో అనేక ఇబ్బందులు, పరిమితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాసిన రచనలను అచ్చేసుకోవడంలో కూడా మహిళలకు ఆర్థికంగా సంపూర్ణ స్వేచ్ఛ పొందలేక పోతున్నారన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ తాము చేస్తున్న ఉద్యమాలకు రచయిత్రులు తమ కలాల ద్వారా మద్దతు పలకాలని, మహిళల్లో చైతన్యం తీసుకొచ్చే రచనలు చేయాలని వర్ధమాన రచయితలను కోరారు. సభను తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ అనితమ్మ నిర్వహించారు. సభానంతరం కవయిత్రులు తమ కవితా స్వరాలు వినిపించారు. చిలుకూరి దీవెన, యమునా రాణి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రగతి, యమున, దీవెన, దేవి, పేరిందేవి, డాక్టర్ అనితమ్మ, సైరాబాను, జ్యోత్స్న తదితరులు కవితాస్వరాలు వినిపించారు.

నవ్యాంధ్ర పుస్తక సంబరాలలో భాగంగా గురువారం అక్టోబరు 11 న జరిగిన సాహిత్య సభలో ప్రముఖులు తమను ప్రభావితం చేసిన పుస్తకాల గురించి మాట్లాడారు. నందవరం కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీనియర్ కథా రచయిత సింగమనేని నారాయణ తనను బాగా ప్రభావితం చేసిన పుస్తకం శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం అంటూ తన తాత్విక, సామాజిక ఆలోచనలో మార్పు తీసుకువచ్చిన పుస్తకమని పేర్కొన్నారు. సమాజాన్ని నడిపించేది శ్రమేనని మహాప్రస్థానం తాత్విక దృక్పథమని అన్నారు. మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం తననెంతగా ప్రభావితం చేసిందో చలం యోగ్యతా పత్రం కూడా అంతగానే ప్రభావితం చేసిందన్నారు. డిగ్రీ రోజుల్లో షేక్స్పియర్ రాసిన హామ్లెట్ నాటకం, ఇతర రచనలు ప్రభావితం చేశాయని తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ దశలో రొమిల్లా థాపర్ రచనలు చరిత్రను అర్థం చేసుకోవడానికి ఉపకరించాయని అన్నారు. వివిధ సందర్భాల్లో వివిధ పుస్తకాలు, వివిధ వ్యక్తులు, వివిధ ఉద్యమాలు ప్రభావితం చేశాయని, వాటిలో డార్విన్ రాసిన ఆరిజిన్ ఆఫ్ స్పీషిస్, మార్క్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక, అంబేద్కర్ రాసిన కుల నిర్మూలన మొదలగు పుస్తకాల గురించి చంద్రశేఖర్ శ్రోతలతో పంచుకున్నారు. మానవత తరిమెల అమర్నాథరెడ్డి గోరా రచించిన మూఢనమ్మకాలు-నాస్తిక దృష్టి పుస్తకం తన ఆలోచనలో, దృక్పథంలో మార్పు తీసుకువచ్చిన పుస్తకం గా పేర్కొంటూ, ఆ పుస్తకం రంగనాయకమ్మ రాసిన రామాయణ విష వృక్షం పుస్తకం చదివేలా ప్రేరేపించిందని అన్నారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు తనను ప్రభావితం చేసిన కమ్యూనిస్టు ప్రణాళిక ప్రపంచాన్ని ఏవిధంగా కుదిపి వేసిందో సభికులకు గుర్తు చేశారు. ఆ పుస్తకం విడుదలయ్యాక అనేక దేశాలలో విప్లవాలు సాధ్యమయ్యాయని చెప్పారు. రాహుల్ సాంకృత్యాయన్ రాసిన “ఓల్గా నుంచి గంగ వరకు” పుస్తకం గురించి విశాలాంధ్ర బుక్ హౌస్ పూర్వ మేనేజర్ ఈశ్వరరెడ్డి తనను ప్రభావితం చేసిన పుస్తకం గా చెప్పారు. డాక్టర్ రమేష్ నారాయణ తన ప్రసంగంలో బండి నారాయణ స్వామి శప్తభూమి నవల తనకు బాగా నచ్చిన చారిత్రక నవలగా తెలిపారు. తెలుగు అధ్యాపకులు జ్యోత్స్న, అశ్వర్థరెడ్డి సభా నిర్వహణ చేశారు.

అనంతరం తరిమెల అమర్నాథరెడ్డి, నాగశయనా రెడ్డి, కోగిరి జయచంద్ర, సుధాకర మూర్తి, కృష్ణ కుమార్ తదితరులు హాస్య వల్లరి కార్యక్రమం నిర్వహించారు. హాస్యం మానవుని ఒత్తిళ్ళ నుంచి దూరం చేసే దివ్య ఔషధంగా పేర్కొన్నారు. నవ్వే వాడు భోగి, నవ్వించే వాడు యోగి, నవ్వని వాడు రోగి అని వక్తలు పేర్కొంటూ అనేక హాస్యభరిత సందర్భాలను ప్రేక్షకులకు చెబుతూ నవ్వించారు.

శుక్రవారం 12 వ తేదీ సాయంత్రం సాహిత్యం అస్తిత్వ వాదాలు అనే అంశంపై సభ జరిగింది. సభకు ప్రముఖ రచయిత డాక్టర్ శాంతి నారాయణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ దళిత, బహుజన అస్తిత్వం, ప్రాంతీయ, ముస్లిం అస్తిత్వ వాదాలతో పాటు, స్త్రీ అస్తిత్వ వాదం, క్రిస్టియన్ అస్తిత్వ వాదం, రైతు అస్తిత్వ వాదాలు ఉన్నాయన్నారు. కులం, మతం, ప్రాంతం, జెండర్ ప్రాతిపదికన వివక్షకు గురయినప్పుడు, నిర్లక్ష్యం చేయబడినపుడు అస్తిత్వ వాదాలు తలెత్తుతాయన్నారు. తానా పురస్కార గ్రహీత బండి నారాయణ స్వామి బహుజన అస్తిత్వ వాదం గురించి మాట్లాడుతూ కులాన్ని మినహాయించిన ఆర్థిక శాస్త్రం భారత దేశంలో లేదన్నారు. ఆనువంశికంగా కులవృత్తులు సంక్రమించడం ఆర్థిక శాస్త్రానికి పునాదిగా నిలిచిందన్నారు. వి.పి.సింగ్ వల్ల దళిత వాదం నుంచి బహుజన వాదం విడిపోయి తన ఉనికిని చాటుకుందన్నారు.

రాయలసీమ, ఇంకా ఇతర ప్రాంతాల్లోని వెనుకబడిన వర్గాల జీవితాలను సాహిత్యీకరించిన రచయితలను, వారి రచనలను గురించి ప్రస్తావించారు. తమకు సంబంధం లేని 'ఫాక్షనిజం' గొడవల్లో సమిధలైన బీసీ, ఎంబీసీ జీవితాలను చిత్రించే సాహిత్యాన్ని పరిశీలించి.. వాళ్ళనలా ఆ దీనస్థితిని తెచ్చిన వ్యవస్థను గురించి విశ్లేషించవలసి ఉందని అన్నారు. అతిముఖ్యమైన విషయమేమిటంటే బీసీల్లోనే అత్యంత వెనకబడిన కులాలైన కుమ్మరి, చాకలి, మంగళి, విశ్వకర్మ, గానుగ మొదలైన కులాల జీవితాలకు సంబంధించిన సాహిత్యానికి ప్రత్యేక గుర్తింపును అన్వేషించడం, సాహిత్యంలో ఈ అత్యంత వెనుకబడిన కులాలు జీవితచిత్రణ ఏవిధంగా జరిగిందో పరిశీలించి, విశ్లేషించాలని కోరారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథ రెడ్డి మాట్లాడుతూ అన్ని రకాలుగా ప్రకృతి తో పాటు పాలకుల నిర్లక్ష్యానికి గురయిన రాయలసీమ ఆటంకాలను అధిగమించి అభివృద్ధి చెందటానికి ప్రజలను చైతన్యం చేయవలసిన బాధ్యత రచయితలదేనని పిలుపు నిచ్చారు. డాక్టర్ షమీవుల్లా ముస్లిం మైనారిటీ సాహిత్యం గురించి వివరించారు. రాయలసీమ లోని వేంపల్లి షరీఫ్, షహనాజ్, హిదయతుల్లా, జూటూరు షరీఫ్, రియాజుద్దీన్ వంటి ముస్లిం రచయితల గురించి ప్రస్తావించారు. డాక్టర్ జెన్నే ఆనంద్, రియాజుద్దీన్ సభా నిర్వహణ గావించారు.

నవ్యాంధ్ర పుస్తక సంబరాలలో భాగంగా శనివారం అక్టోబరు 13 సాయంత్రం సాహిత్యం – కళలు అనే అంశంపై సభ జరిగింది. సభకు ప్రజానాట్యమండలి అధ్యక్షులు ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య సుధాకరబాబు మాట్లాడుతూ సాహిత్యానికి కళలకు అవినాభావ సంబంధమున్నదన్నారు. సంగీతం, నాట్యం, చిత్ర లేఖనం వంటి కళారూపాలు సాహిత్యం సహకారం లేకుండా మనుగడ సాగించలేవన్నారు. అదే విధంగా సాహిత్యం పలు రకాల కళా రూపాల ద్వారా ప్రాచుర్యం పొందగలిగిందని పేర్కొన్నారు. పండిత పామరులకు ఆనందాన్ని కలిగించడంతో పాటు చైతన్యాన్ని నింపడంలో కళలు ప్రముఖ పాత్ర వహిస్తాయని అన్నారు. మానవ జీవన పరిణామ క్రమం లో సాహిత్యం, కళలు నిరంతర ప్రవాహం గా వెంట నిలిచాయన్నారు. భావ వ్యక్తీకరణకు కళలు సరైన మాధ్యమమని అన్నారు. ఆద్యంతం పాటలు, పద్యాలతో సాగిన ఆయన ప్రసంగం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ప్రముఖ చిత్రకారుడు, రచయిత ఎల్. ఆర్. వెంకటరమణ చిత్రలేఖన సాహిత్యం గురించి మాట్లాడుతూ, ప్రప్రథమంగా సాహిత్యం చిత్రలేఖనం రూపంలోనే మొదలయిందన్నారు. ఆదిమ మానవుల మధ్య సమాచార మార్పిడి బొమ్మల ద్వారానే జరిగిందన్నారు. మానవ పరిణామం మెదడు తో పాటు చేతులను ఉపయోగించడం ద్వారా సాధ్యమయిందని పేర్కొన్నారు. వివిధ నాగరికతలలో, వివిధ దేశాల్లో చిత్ర లేఖన సాహిత్యం ఎలా పరిణామం చెందిందో వివరించారు. సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో ఖ్యాతి నొందిన లియోనార్డో డావిన్సి తదితరుల కళా నైపుణ్యం, ప్రయోజకత గురించి వివరించారు. కవిత్వాన్ని వాటర్ కలర్స్ తో పోల్చారు. ఒపాక్ కలర్స్ ను కథలతోను, ఆయిల్ కలర్స్ ను నవలలతోను పోల్చారు. సాహిత్యం అక్షరాస్యులకు మాత్రమే అర్థమయ్యే కళారూపం కాగా, చిత్రకళ ఎవరికైనా అర్థమయ్యే ప్రక్రియ అని తెలిపారు. విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు శివయ్య మాట్లాడుతూ క్రీడా కళ కూడా వ్యక్తి ఎదుగుదలకు అనివార్యమని అన్నారు.

నవ్యాంధ్ర పుస్తక సంబరాలలో భాగంగా చివరి రోజు శనివారం సాయంత్రం సైన్సు %--% సాహిత్యం అనే అంశంపై మొదటి సదస్సు జరిగింది. సభకు జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు డాక్టర్ వీరభద్రయ్య అధ్యక్షత వహించారు. సభలో ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ సైన్స్ అనేది మూల పదార్థం, సాహిత్యం అనేది వ్యక్తీకరణ అన్నారు. గణిత శాస్త్రం చదివిన డి.డి.కోశాంబి చరిత్రకు కొత్త భాష్యాలు చెప్పారు. సాహిత్యానికి సైన్స్ ను రంగరిస్తే అద్భుతంగా ఉంటుంది. హెచ్.జి.వెల్స్ సైన్స్ ఫిక్షన్ కథలు రాశారు. విషయం బాగా అర్థం చేసుకొని, ఆయా కాలాల్లో అందుబాటులోకి వచ్చిన అంశాలను క్రోడీకరించి రచనల్లో పొందుపరచాలి. స్థానికతను కూడా జోడించి, సమస్యలను విశ్లేషణ చేసి రాయచ్చునని తెలిపారు. విశ్రాంత ఆచార్యులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైజ్ఞానిక శాస్త్రానికి, మతానికి మధ్య సంఘర్షణ అనాదిగా జరుగుతున్నదన్నారు. వైజ్ఞానిక శాస్త్రం – సాహిత్యం నాణానికి బొమ్మా బొరుసు వంటివన్నారు. వైజ్ఞానిక శాస్త్రానికి సంబంధించిన పారిభాషిక పదకోశాలు, నిఘంటువుల కొరత ఉందన్నారు. కందుకూరి వీరేశలింగం 1881 లోనే విజ్ఞాన శాస్త్ర జనీనం వంటి అనేక

## జాషువా జయంతి సభ




మార్పు దిశగా ప్రయాణించి, భావి తరాలకు స్ఫూర్తిగా నిలవాలని ప్రముఖ కవయిత్రి, సామాజిక కార్యకర్త అరుణ గోగులమండ పిలుపునిచ్చారు. మహాకవి గుర్రం జాషువా 123వ జయంతిని పురస్కరించుకుని జాషువా సాంస్కృతిక వేదిక, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో సెప్టెంబర్ 27న కవి స్వరం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాహితీ స్రవంతి వొరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అరుణ మాట్లాడుతూ మారు తున్న కాలంతో పాటు సామాజిక అసమానతలు కూడా పెరగడం దారుణమ న్నారు. మతోన్మాద బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులు, మైనార్టీలు, మహిళలపై దాడులు పెరుగుతున్నా యన్నారు. ప్రణయ తరహా హత్యలను ఖండించాల్సింది పోయి సమర్థించడం సిగ్గు చేటని విమర్శించారు. ' రాజు విగ్రహాలలో కాదు ప్రజల మనస్సుల్లో జీవించాలి ' అన్న జాషువా వాక్యాలను ఆమె గుర్తు చేశారు. ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి మురళీ కృష్ణ మాట్లాడుతూ కవులు, కళాకారులు తమ రచనల ద్వారా సామాజిక రుగ్మతలను నివారించాలన్నారు. సభాధ్యక్షులు వొరప్రసాద్ మాట్లాడుతూ అనాగరికంగా వ్యవహరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో జాషువా భావాలను స్మరించుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులుగా సాహితీ స్రవంతి శాంతిశ్రీ, యువకవి అనిల్ డ్యాని, చిత్రకారులు ఎ సునీల్ కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు కవులు తమ కవితలను వినిపించారు. ♦

---

పుస్తకాలు రాశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైజ్ఞానిక అంశాలను కథా రూపంలో చెప్పడం ద్వారా సులభతరం చేయవచ్చునని తెలిపారు.

రెండవ సదస్సు బాలసాహిత్యం మీద డాక్టర్ చంద్రశేఖర శాస్త్రి అధ్యక్షతన జరిగింది. ప్రధాన వక్తగా పాల్గొన్న ఆచార్య ఎం.కె.దేవకి తన ప్రసంగంలో బాల సాహిత్యం అనగానే పంచతంత్ర కథలు, పేదరాసి పెద్దమ్మ కథలు, ఈసపు కథలు, చందమామ కథలు గుర్తురావడం సహజం. సింహం, పులి, ఏనుగు వంటి జంతువులను కథల పుస్తకాల బొమ్మల్లో చూసి నిన్నటి తరం పిల్లలు ఆనందించేవారు. నగర వాసుల పిల్లల్లో కొందరు మాత్రం జంతు ప్రదర్శనశాలలో చూస్తుంటారు. ప్రస్తుతం టీవీ చానల్స్ పుణ్యమా అని ఏనిమల్ ప్లానెట్, డిస్కవరీ చానల్స్ వచ్చిన తర్వాత పులి, సింహం, ఏనుగు లాంటి జంతువుల్ని, రకరకాల సర్పాలని, వివిధ జాతుల పక్షుల్ని వాటి జీవన విధానాన్ని స్పష్టంగా చూడగలుగుతున్నారు నేటి తరం పిల్లలు. పొడుపు కథలు, వినోద కథలు, చిట్టి కథలు, నీతి కథలు, పిట్టకథలు బాల సాహిత్యంలో భాగమన్నారు. నేటి పత్రికలు పిల్లల కోసం ఓ పేజీని ప్రత్యేకంగా కేటాయించి వారిపట్ల తమకున్న ప్రేమను, బాధ్యతను నిరూపించుకుంటున్నాయి. పిల్లలకు వినోదం, విజ్ఞానం, వికాసం అందించడంలో భాగంగా పద వినోదం, గడి – నుడి, గణితంలో సమస్యలు, కథలు, గేయాలు, కవితలు, వ్యాసాలు, కార్టూన్లు ఇలా ఏ రూపంలో వచ్చినా సరే బాలసాహిత్యాన్ని సుసంపన్నం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జూటూరు తులసీదాస్ మాట్లాడుతూ కోగిర జై సీతారాం, చొప్పా వీరభద్రప్ప, చం, జూటూరు తులసీదాస్ తదితరులు బాల సాహిత్యాన్ని సృజించిన అనంతపురం జిల్లా సాహిత్య వేత్తలని పేర్కొన్నారు. తను రాసిన అమ్మ నేర్పిన గుణింతాలు పుస్తకం గురించి ప్రస్తావించారు.

నవ్యాంధ్ర పుస్తక సంబరాలలో చివరి రోజు జిల్లా కలెక్టర్ శ్రీ వీరపాండ్యన్ తన కుటుంబ సభ్యులతో సహా సందర్శించడం పుస్తకాల పట్ల ఆయనకున్న మక్కువను తెలియజేస్తుంది. గత తొమ్మిది రోజులుగా వివిధ ప్రచురణకర్తలు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినందుకు, అన్ని రోజులు సాహితీ సమావేశాలను నిర్వహించినందుకు, పాల్గొన్న వారందరికీ పుస్తకాలను బహూకరించినందుకు నిర్వాహకులను అభినందించారు. సంబరాలు జరిగిన అన్ని రోజులు స్థానిక పత్రికలు ప్రత్యేకమైన కథనాలు రాయడం తో పాటు, స్థానిక కవులను, రచనలను పరిచయం చేయడం ఆకట్టుకుంది. ♦

## డైరీ

# ప్రత్యామ్నాయ విధానాలతోనే సాంస్కృతిక వికాసం




జాతి జీవన విధానమే సంస్కృతి అని, సాంస్కృతిక వికాసానికి ప్రత్యామ్నాయ విధానం అవసరమని పలువురు వక్తలు సూచించారు. గుర్రం జాషువా 123వ జయంతిని పురస్కరించుకుని జాషువా సాంస్కృతిక వేదిక, ప్రజానాట్యమండలి, ఎంబి విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి, యుటిఎఫ్, జనవిజ్ఞాన వేదిక, అంబేద్కర్–పూలే విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా సాంస్కృతిక విధానంపై సెప్టెంబర్ 28న సెమినార్ నిర్వహించారు. జాషువా చిత్ర పటానికి పూల మాలవేసి సంగమం కన్వీనర్ సి.ఉమామహే శ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తగా వ్యవహరించారు.

సంస్కృతి అనే జీవనదిలో మానవుడే కేంద్రబిందువని, ఆచార, వ్యవహారాల పేరుతో కొన్ని శక్తులు సంస్కృతిని విషతుల్యం చేస్తున్నాయని సాహితీస్రవంతి గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి అన్నారు. సుప్రీంకోర్టు వ్యక్తి స్వేచ్ఛను పెంపొందించే తీర్పులు ప్రకటిస్తుంటే, రాజకీయ వ్యవస్థ మాత్రం స్వేచ్ఛను కుదిస్తోంది. కల్చరల్ మాఫియాను అడ్డుకోవాలి. భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు పడుతున్నాయన్నారు. వీటిని ఛేదించాల్సి అవసరం ఉందని, మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన ప్రణయ హత్యపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాట్లాడకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రముఖ సినీ దర్శకులు సి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సినీ రంగానికి కల్చరల్ మేనిఫెస్టో అవసరం అన్నారు. ప్రజా జీవితాలకు దగ్గరగా ఉండే కథలను ఎంచు కోవాలని, దళిత, మైనార్టీ, స్త్రీవాద, ప్రాంతీయ ఉద్యమాలు సినిమాల్లో ప్రతిబింబించడం లేదన్నారు. నాస్తిక కేంద్రం వ్యవస్థాపకులు విజయం మాట్లాడుతూ నూతన విలువలు సమాజంలోకి రావాలంటే మత మౌఢ్యాన్ని తరిమికొట్టాలన్నారు. ఏపీ గ్రంథాలయ కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ సాంస్కృతిక వికాసానికి పుస్తక పఠనం అవసరమన్నారు.

ఈ సందర్భంగా ప్రజాశక్తి సంపాదకులు ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ విభజన గాయాలతో ఉన్న ఏపీకి నూతన సాంస్కృతిక విధాన కావాలని, భూములు, నదులు, ఖనిజాలను స్వాధీనం చేసుకున్నట్లే ప్రజా కళాకారులను కూడా ప్రభుత్వం తన స్వాధీనంలోకి తీసుకుంటోందని విమర్శించారు. ప్రజా సంస్కృతికి తావు లేకుండా పాలక సంస్కృతి కొనసాగుతోందని, సంస్కృతి ప్రజల హక్కు అని, అభ్యుదయ వాదులందరినీ కలుపుకుని పోరాడాలన్నారు.

మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా జీవితానికి సంబంధించిన సమస్యలు సాంస్కృతిక రంగంలో

# డాక్టర్ శాంతినారాయణ సాహితీ సమాలోచన



అనంతపురం జిల్లా ముఖ్యంగా రాయలసీమ రైతుల జీవితాలను నేపథ్యాలుగా చేసుకొని శాంతినారాయణ రచనలు చేశారని పలువురు వక్తలు అన్నారు. అనంతపురం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో సెప్టెంబర్ 30న డా॥ శాంతినారాయణ సాహితీ సమాలోచన సదస్సు జరిగింది. అనంతపురం జిల్లా సాహితీస్రవంతి ప్రధాన కార్యదర్శి హిదయ్‌తుల్లా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాంతినారాయణ రచనలు నమ్ముకున్న రాజ్యం, పల్లేరు ముల్లు, కొండ చిలువ, బతుకు బంతి కథా సంపుటాలు, కొత్త అక్షరాలమై, నడిచేయి నగరం కవితా సంపుటాలు, పెన్నేటి మలుపులు నవల తదితర రచనలపై చిలుకూరి దీవెన, పిళ్ళా కుమారస్వామి, ఎ.ఎ. నాగేంద్ర, దాదా ఖలందర్, డా॥ కె. నాగేశ్వరాచారి ప్రసంగించారు. కరువు నేపథ్యంతో పాటు వివిధ ప్రక్రియలలో అనేక సామాజిక అంశాలను ఈ రచనల్లో చూడవచ్చుని, పద్యం నుండి మాండలిక వచన రచనల వరకూ సాగిన శాంతినారాయణ సాహిత్య ప్రయాణం అరుదైనదే గాక విలువైనదని పలువురు తెలిపారు. డా॥ శాంతినారాయణ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యం.టి.జ్యోత్న్న ఆహ్వానం పలుకగా డా॥ యం. ప్రగతి ముఖ్య అతిథి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో డా॥ అంకే శ్రీనివాసులు, ప్రజ్ఞా సురేష్, బాలగొండ ఆంజనేయులు, ఎల్.ఆర్. వెంకటరమణ, జూటూరి షరీఫ్, రియాజుద్దీన్, జెన్నే ఆనంద్, నిర్మలారాణి, శశికళ, రాజారాం, అశ్వర్థరెడ్డి, గోసల నారాయణస్వామి, ప్రసన్నరామ తదితరులు పాల్గొన్నారు. ♦

---

ప్రతిబింబించడం లేదన్నారు. కౌలు రైతులు, విద్యార్థుల ఆత్మహత్యలు రచనల రూపంలో వెలుగులోకి రావాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే కె సుబ్బరాజు మాట్లాడుతూ సమాజంలో విస్తరిస్తున్న విష సంస్కృతికి వ్యతిరేకంగా కలిసి పోరాడాలన్నారు.

అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజల సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. నాటక అకాడమీ ఉపాధ్యక్షులు కందిమళ్ల సాంబశివరావు మాట్లాడుతూ జాతిని జాగృతం చేసే నాటక రంగాన్ని కాపాడాలన్నారు. ముస్లిం మేధావుల వేదిక కన్వీనర్ ఉష ఎస్ డ్యానీ మాట్లాడుతూ పాలక పక్ష సాహిత్యం, ప్రజా సాహిత్యం వేర్వేరుగా ఉంటున్నాయన్నారు. ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల విధానంలో కూడా ప్రక్షాళన చేయాలన్నారు. సాంస్కృతిక రంగ విశ్లేషకులు మంతెన సీతారాం మాట్లాడుతూ మతం ఒక్కటే సంస్కృతికి ప్రాతిపదిక కాదన్నారు. విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ పాలక వర్గాలు మానవ సంబంధాలను వ్యాపారమయం చేస్తున్నాయన్నారు. ప్రజాసాహితి సంపాదకులు కొత్తపల్లి రవిబాబు, తెలుగు భాషాభివృద్ధి సంఘం అధ్యక్షులు సామల రమేష్ బాబు, రచయిత, దర్శకులు వైఎస్ కృష్ణేశ్వరరావు, ప్రజానాట్య మండలి కార్యదర్శి అనిల్ కుమార్, ఎస్ఎంఎస్ కన్వీనర్ కారుసాల శ్రీనివాసరావు, విరసం నాయకులు రివేరా, వ్యాయామ అధ్యాపకులు బండి గోవర్ధనరావు, సాహితీ స్రవంతి అధ్యక్షులు వొర్రప్రసాద్, ఒ. శాంతిశ్రీ, చిత్రకారులు సునీల్ కుమార్, అరసం కార్యదర్శి కొండపల్లి మాధవరావు, వై సిద్ధయ్య, కె లక్ష్మయ్య, గాదె సుబ్బారెడ్డి, రామరాజు, బోస్ తదితరులు పాల్గొన్నారు. ♦



విజయవాడలో సింగ్‌నగర్ దగ్గర కృష్ణహోటల్ జంక్షన్‌లో సెప్టెంబర్ **27**న జాషువా **123**వ జయంతి సందర్భంగా ఎం.బి. విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన జానపద ఉత్సవాలను ప్రారంభిస్తూ ప్రసంగిస్తున్న సాహితీస్రవంతి గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి. చిత్రంలో శాసనమండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, మంతెన సీతారాం, గుండు నారాయణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్



గుంటూరులో గుర్రం జాషువా విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో సెప్టెంబర్ **27**న జాషువా **123**వ జయంతిని పురస్కరించుకుని జరిగిన సభలో గుర్రం జాషువా కవితా పురస్కారం – **2018** ని ప్రముఖ సినీకవి సుద్దాల అశోక్‌తేజకు అందజేస్తున్న బి.వి. రాఘవులు. చిత్రంలో కె.ఎస్. లక్ష్మణరావు, పాశం రామారావు, పోలే ముత్యం, ఎం. విజయలక్ష్మి, కాకాని సుధాకర్, బి. వేదయ్య, సోమేపల్లి వెంకటసుబ్బయ్య తదితరులు




విజయవాడలో జనసాహితి ఆధ్వర్యంలో చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో సెప్టెంబర్ **28**న జరిగిన నిర్మలానంద సంస్మరణ సభలో నిర్మలానందపై ప్రజాసాహితి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖ రచయిత వెన్నా వల్లభరావు. చిత్రంలో అరుణ, కొత్తపల్లి రవిబాబు, కొండపల్లి మాధవరావు, వీరప్రసాద్, దివికుమార్



విజయవాడలోని ఎం.బి. విజ్ఞానకేంద్రంలో సెప్టెంబర్ **8**న జరిగిన ప్రసిద్ధ జర్నలిస్టు, రచయిత జ్యూలియస్ ఫ్యూజిక్ వర్ధంతి సభ. జ్యూలియస్ ఫ్యూజిక్‌పై ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ జర్నలిస్టు, రచయిత ఉషా యస్ డ్యాని. చిత్రంలో ఎం.బి. విజ్ఞానకేంద్రం బాధ్యులు బోస్, రఘు, ఎస్. వెంకట్రావు, ఉషారాణి, అచ్యుతరావు, కె. లక్ష్మయ్య

## కవితల పోటీ ఫలితాలు

**'న్యూ** విజన్ సాంఘిక సేవా సంస్థ' 'వ్యవసాయ సంక్షోభం – రైతు ఆత్మహత్యలు – నివారణ' అంశంపై నిర్వహించిన కవితల పోటీ ఫలితాలను డా॥ డి. క్రాంతి కుమార్, దాదినబోయి ఏడుకొండలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. విజేతలుగా డా॥ పోరెడ్డి రంగయ్య –ఆలేరు, డా॥ బీరం సుందరరావు –చీరాల, వడలి రాధాకృష్ణ–చీరాల, కోసూరి రవికుమార్ –దాచేపల్లి, యు.యల్.యన్. సింహ–నెల్లూరు లు నిలిచారని తెలిపారు. ప్రత్యేక బహుతులను కె.పి. డింపుల్–తిరుపతి, కొండూరు వెంకటేశ్వరరాజు –గూడూరులకు లభించాయి. 2019 జనవరిలో తిరుపతిలో జరిగే కార్యక్రమంలో వీటిని అందజేస్తామని, ఈ పోటీకి 165 కవితలు వచ్చాయని, న్యాయనిర్ణేతగా విశ్లేషకులు వై. హెచ్. కె. మోహన్‌రావు వ్యవహరించినట్లు తెలిపారు. ♦

## గమనిక

**సా**హిత్య ప్రస్థానం అక్టోబర్ సంచికలో 'అధికారం, ఆప్యాయతల మధ్య నలిగిన ఆమ్రపాలి' వ్యాసం 'దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు' పేరుతో ప్రచురితమైంది. ప్రొ॥ దార్ల వెంకటేశ్వర రావు గారు తను రాసిన ఆ వ్యాసం ప్రజాకళ వెబ్‌పత్రికలో సెప్టెంబర్ 2007న ప్రచురించిన విషయాన్ని తెలియజేస్తూ సాహిత్య ప్రస్థానంకు ఈమెయిల్ చేశారు. తన బ్లాగ్‌లో ఆ వ్యాసం ఉందని పేర్కొన్నారు. సాహిత్య ప్రస్థానం పరిశీలనలో ఆ విషయం నిర్ధారణ అయింది. ఈ విషయం దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు దృష్టికి తీసుకువెళ్ళి ఈ విధంగా చేయటం సరైనది కాదని తెలియజేయడం జరిగింది. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుంది.

**– ఎడిటర్**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం

## ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి

## తెలుగు భాషా సంస్కృతి - ఔన్నత్యం

ప్రభుత్వము వారు జి.ఓ.ఎమ్.ఎస్.నెం.27, తేది.06-12-2016 నందు
రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ఏర్పాటు చేశారు.
తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నది.

### పథకాలు / కార్యక్రమాలు

- ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలు / కళాశాలల నిర్వహణ
- సర్వారాయ హరికథ పాఠశాల గ్రాంటు
- అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ సొసైటి, చెన్నై గ్రాంటు
- ప్రముఖ జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు
- సాంస్కృతిక అకాడమీలు
- 6,746 వృద్ధ కళాకారులకు నెలకు రూ.1,500/- లు చొప్పున ఫించన్లు
- కళాకారులకు రైల్వే కన్సెషన్ మంజూరు చేయుట
- ఆనంద లహరి
- యువ సంస్కృతి
- చిత్రలేఖనం
- సాహిత్య భవిష్యనిధి
- సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, సంక్రాంతిసంబరాలు, ఉగాది వేడుకలు
- ఆడిటోరియంల నిర్మాణం
- ఘంటసాల ఆడిటోరియం నిర్మాణం
- కూచిపూడి నాట్యారామం
- కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ
- సాంస్కృతిక సంస్థలకు ఆర్థిక సహాయం
- ప్రముఖ వ్యక్తుల జయంతి ఉత్సవాలు
- షెడ్యూల కులాల ఉపప్రణాళిక కార్యక్రమాలు
- షెడ్యూలు తెగల ఉపప్రణాళిక కార్యక్రమాలు
- జిల్లా సాంస్కృతిక మండళ్ళకు గ్రాంటు
- ఎ.పి.భవన్‌లోను, ఇతర రాష్ట్రాలలోను సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు
- బాల ప్రతిభ

ముఖ్య కార్యనిర్వహణాధికారి
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు
సంస్కృతి సమితి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
విజయవాడ

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.VJ/187/2017-19
Date of Posting : 1st &2nd of Every Month ▪ Date of Publication: 27.10.2018


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు



వైద్యరంగంలోని వ్యవస్థీకృత లొసుగులను క్షేత్రస్థాయి పరిశీలనతో బయటపెట్టిన సంచలనాత్మక ఇంగ్లీషు పుస్తకం

రచయితలిద్దరూ స్వయంగా డాక్టర్లే
డా॥ అరుణ్ గాద్రే
డా॥ అభయ్ శుక్లా

## వైద్యానికి సుస్తీ

పేరుతో తెలుగులో వెలువడింది..
అనువదించిందీ డాక్టరే.. డాక్టర్ సురేష్

పేజీలు 184. ధర రూ.150/-

వైద్య నిపుణుల ఆవేదనను వినండి! వైద్యరంగం గురించి అందరూ పట్టించుకునేలా చేసే పుస్తకం! తప్పక చదవండి!



సాహిత్యం ప్రపంచ వీక్షణానికో గవాక్షం; విశ్వాన్ని మన కనుల ముందు పరుస్తుంది. మనిషెక్కడివాడైనా అమ్మ ప్రేమ ఒక్కటే; ధన బలం ఎక్కడున్నా అణిచేసేది సామాన్యుడినే; ప్రపంచ సాహిత్య విను వీధులలో ఈ సత్యాన్ని హృద్యంగా చెప్పి ప్రజలను చైతన్య పరిచి, ఉత్తేజ పరిచే సాహితీ వేత్తలు మాత్రం కొందరే. అటువంటి వారిలో కొందరిని తెలుగు పాఠకులకు పరిచయం చేయాలన్న మా ప్రయత్నమే ఈ పుస్తకం.



ప్రపంచ సాహితీ వేత్తలు
ముక్తవరం పార్థసారథి
పేజీలు 176 రూ. 150/-



కులం - ఆర్థిక పునాది
పేజీలు 64 రూ.50/-

భారతదేశంలో కులం, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో అనాదిగా అలజడిని సృష్టిస్తూనే వుంది. గాని దాని ఆర్థిక మూలాలపై ఎవరూ దృష్టి సారించకుండా కొన్ని అసంకల్పిత, మరికొన్ని కుట్రపూరిత ప్రయత్నాలు జరిగినట్లు తెలుస్తూ వుంది. గతంలో వలసవాద చరిత్రకారులు, భారతీయత వంటబట్టించుకున్న కొంతమంది వామపక్ష చరిత్రకారులు ఈ సమస్యపై ఉపేక్షించారు. నాటి రాజకీయపార్టీల చర్చల్లో దొర్లిన వివరాల పత్రాల ద్వారా కొంత సమాచారం దొరికినా, పార్టీలు ముక్కలై దిగువ కులాల నుండి కొత్తగా ఎవరూ పార్టీల్లో చేరకపోవటం, నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ఊపందుకోవటం, బహుజన మేధావి వర్గం అన్నది చిన్నగా తయారై ప్రశ్నించటంతో దేశంలోనూ ముఖ్యంగా తెలుగు ప్రజల మధ్య కులంపై చర్చ కొనసాగుతూనే వుంది. ఈ నేపథ్యంలో రాజకీయ అర్థశాస్త్రంలో చెప్పే మార్క్స్ విశ్లేషణతో రాసిన పుస్తకం ఇది.

'మాకొద్దీ తెల్లదొర తనమూ' అంటూ ఆ నాడు బ్రిటీషు పాలకులపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన గరిమెల్ల అందరికీ తెలిసిన వారే. తెల్ల దొరలకంటే అతి కిరాతకంగా పాలిస్తున్న నేడు దేశీయ పాలకుల విధానాలను ఎండగడుతూ 'మా కొద్దీ నల్లదొరతనమూ' అంటూ గర్జించిన దళిత కవి కుసుమ ధర్మన్న జీవిత చరిత్రకు సంబంధించిన అనేక విశేషాలను అందించిందీ పుస్తకం. వర్ణ వ్యవస్థ పట్ల, కులదాష్టం పట్ల ఆగ్రహవ్యక్తిగా, మాల, మాదిగల పట్ల వాళ్ళ అభ్యుదయంపట్ల అచంచల ప్రేమ మూర్తిగా కన్పించే ధర్మన్న పుట్టిన తేదీ, మరణానికి సంబంధించి అనేక సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం చేశారు రచయిత.



తొలి దళిత ఆత్మగౌరవ స్వరం
కుసుమ ధర్మన్న కవి
పేజీలు 56 రూ.45/-

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533

**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం


If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor
Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059